13-7Pg1exHMNWJQE.qxd:13-7Pg1exHMNWJQE.qxd 1/1/02 6:18 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విశాఖపట్నం

fb.com/vaartha Digital

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

13-7-2026 సోమవారం సంపుటి: 32 సంచిక: 163 పేజీలు: 16 వెల: 6.50

మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు 2లో
హార్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత 5లో

## సిఆర్‌డిఎ నిర్వాసితుల జీవన భృతి 10 వేలకు పెంపు

### లాండ్ పూలింగ్ రైతులకు రుణమాఫీ అమలు: ప్రభుత్వం



**విజయవాడ,జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** సిఆర్‌డిఎ ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ట్రంకు రోడ్ల నిర్మాణంలో నివాసాలను కోల్పోయిన నిర్వాసిత కుటుంబాల జీవన భృతి రూ.5 వేల నుంచి రూ.10 వేలకు పెంచాలని నిర్ణయించింది. ఇటీవల సిఎం అధ్యక్షతన జరిగిన కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ప్రభుత్వం 12 నెలల పాటు నెలకు రూ.10 వేల జీవన భృతి అందించనుంది. ఇంటి అద్దెతో కలిపి జీవన భృతి చెల్లింపునకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎపిసిఆర్‌డిఎ చర్చల విధానంలో సవరణలు చేసింది. జులై 7వ తేదీన జరిగిన 63వ ఎపిసిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకుంది. సవరించిన జీవన భృతి అమలు చేయాలని ఎం సిఆర్‌డిఎ కమిషనర్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ల్యాండ్ పూలింగ్ రైతులకు రుణమాఫీ అమలు చేయాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో రెండో దశలో ల్యాండ్ పూలింగ్ రైతులకు ఎపి సర్కార్ యాన్యుటీ పెంచింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేలకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. జరీబు భూములకు ఎకరాకు రూ.50 వేల >>2

# ప్రకృతి సేద్యాన్ని పెంచండి

### ఎల్‌నినో ప్రభావానికి తగినట్లుగా ప్రాంతాలవారీగా పంటల సాగు

### మైక్రో న్యూట్రియంట్ల వినియోగం కూడా పెంచాలి

### సీమను ఉద్యాన హబ్‌గా మార్చేందుకు రూ. 40 వేల కోట్లతో పూర్వోదయ పథకం : సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంపై ఎల్ నినో చూపుతున్న ప్రభావాలను అంచనా వేస్తూ ప్రాంతాల వారీగా పంటల సాగు అంచనా జరగాలని, దానికి అనుగుణంగానే చర్యలు ఉండాలని సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.ఆ మేరకు ఆయన వివిధ హోదాల్లో అధికార యంత్రాంగానికి కీలకాదేశాలు జారీచేసారు. సమాచార, పౌరసంబంధాలశాఖ సమాచారాన్ని అనుసరించి వివిధ ప్రాంతాల్లో ప్రకృతిసేద్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో పిఎండిఎస్ హాఫ్ మూన్ విధానాల్లో సేద్యం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎల్ నినో కారణంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల ప్రభావం ఉన్నప్పటికీ రాష్ట్రంలోని రైతులు నష్టపోకుండా పంటలకు కనీస మద్ధతు ధర లభించేలా చూడాలని సిఎం దిశానిర్దేశం చేశారు. ఈ విషయంలో కేంద్ర సహకారంకూడా తీసుకుని ఎపిలో చేపడుతున్న ప్రకృతి సేద్యానికి మరింత ప్రోత్సాహం కల్పించాలని సిఎం స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ సాగుతో విజయవంతమైన రైతుల సేవల్ని కూడా వినియోగించుకోవాలని సిఎం సూచించారు.రైతులు పండించిన ఉత్పత్తులు నేరుగా వినియోగదారుల ఇళ్లకుచేర్చేలా ఫార్మ్ టూ హోమ్ విధానం అమలు చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు >>2



ముంబయిలో శస్త్రచికిత్స చేయించుకున్న డి.సిఎం పవన్ కల్యాణ్‌ను ఆదివారం పరామర్శిస్తున్న సిఎం చంద్రబాబు - 2లో

## సెప్టెంబరు, అక్టోబరులో స్థానిక ఎన్నికలు

ఓటరు జాబితాల సమగ్ర ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తయిన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సెప్టెంబరు నెలాఖరులో లేదా అక్టోబరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయన్నారు. కూటమి పార్టీల మధ్య అన్ని >>2



మంటలను అదుపు చేస్తున్న అగ్ని మాపక సిబ్బంది

## 7 బస్సులు దగ్ధం

### విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

**విజయవాడ,జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడలోని ఆటోనగర్‌లో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. 7 బస్సులు దగ్ధమయ్యాయి. మరమ్మతుల కోసం ఉంచినబస్సులో మంటలు చెలరేగటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. ఆటోనగర్ లోని ఓ మెకానిక్ షెడ్డులో మరమ్మతుల కోసం బస్సులను నిలిపి ఉంచారు. ఆదివారం ఉదయం 11.30గంటల ప్రాంతంలో మరమ్మతుల కోసం ఉంచిన ఓ బస్సులో మంటలు చెలరేగాయి. ఆ మంటలు కొద్దిసేపటికి మిగిలిన బస్సులకు వ్యాపించాయి. ఒక్కసారిగా దట్టమైన పొగలు వ్యాపించాయి. ఆ ప్రాంతమంతా నల్లటి పొగతో నిండిపోయింది.

పక్కనే మరికొన్ని బస్సులు పార్కింగ్ చేసి ఉండటంతో మంటలు మరింత వేగంగా వ్యాపించాయి. ఇది గమనించిన స్థానికులు వెంటనే అప్రమత్తమయ్యారు. అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.ప్రమాద సమయంలో షెడ్డు నిండా బస్సులు ఉన్నాయి. అవి ఏవీ కూడా స్టార్టింగ్ కండిషన్‌లో లేవు. మంటలు మరింతగా వ్యాపించకుండా స్థానికులు సాహసంచేశారు. క్రేన్లసహాయంతో బస్సులను పక్కకు లాగే ప్రయత్నం >>2

## అదుపుతప్పిన కారు


### ఎఆర్ కానిస్టేబుల్ దుర్మరణం

**ఒంగోలు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** ఒంగోలు నగరం మంగమూరు రోడ్డులోని పద్మ టవర్స్ ఎదుట ఆదివారం ఉదయం మహిళా వైద్యులు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోవడంతో ముందుగా చెత్త ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం సైకిల్‌పై పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు విధులకు వెళ్తున్న ఎఆర్ కానిస్టేబుల్ మరియదాసు (36)ను బలంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆయన రోడ్డుకు అవతల ఉన్న సర్వీస్ రోడ్డుపై పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కారు వేగంగా ముందుకు దూసుకెళ్లడంతో >>2

## ఉద్యమ బాటలో ఆర్టీసి జెఎసి

### రేపటి నుంచి దశలవారీగా ఆందోళనలకు పిలుపు

**విజయవాడ.జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ప్రైవేటు ఆపరేటర్లుతో విద్యుత్ బస్సుల నిర్వహణ, మూసివేసిన డిపోల పునరుద్ధరణపై స్పష్టత లేకపోవడంతో ఉద్యమం కొనసాగిస్తామని ఆర్టీసీ ఉద్యోగుల జెఎసి ఆదివారం ఓ ప్రకటన చేసింది. జూలై 14 నుంచి 19 వరకు ప్రజాప్రతినిధులను కలిసి మద్దతు కోరుతూ వినతిపత్రాల సమర్పణ ఉంటుందని, ఈ నెల 20 నుండి ఆర్టీసీ ఉద్యోగులందరి సంతకాల సేకరణ చేస్తామని జెఎసి నేతలు తెలిపారు.జులై 30న విజయవాడలో ఆర్టీసీ ఉద్యోగ సంఘాల జెఎసి రాష్ట్ర సమావేశం ఉంటుందని, ఆ రోజు మూడో దశ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని జెఎసి నేతలు వెల్లడించారు. విద్యుత్ బస్సులను ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా నడపొద్దని జెఎసి ఈ సందర్భంగా డిమాండ్ చేసింది. మూసివేసిన నాలుగు ఆర్టీసీ డిపోలను వెంటనే పునరుద్ధరించాలని జెఎసి డిమాండ్ చేసింది. మొత్తం 30 డిమాండ్లతో గత నెల 11న యాజమాన్యానికి వినతిపత్రం జెఎసి సమర్పించింది.జూలై 6, 7, 9 తేదీల్లో అధికారులు జెఎసి మధ్య పలుమార్లు చర్చలు కూడా జరిపింది. డ్రాఫ్ట్ మినిట్స్‌లో స్పష్టమైన హామీలు లేకపోవడంతో రెండో దశ ఉద్యమం కొనసాగించాలని జెఎసి నిర్ణయించింది. ఇవాళ మరోమారు గూగుల్ మీట్‌లో జరిగిన జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఉద్యమం కొనసాగింపుపై ఏకగ్రీవ నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగులు, ఆర్టీసీ, ప్రయాణికుల ప్రయోజనాల పరిరక్షణే జెఎసి లక్ష్యమని తెలిపారు.





ఆదివారం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో జానకి భౌతిక కాయంవద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు

# మహాగాయని జానకికి కన్నీటి వీడ్కోలు

## ప్రభుత్వ లాంఛనాలతో మైసూరులో అంత్యక్రియలు

### ఆమె వ్యవసాయ క్షేత్రంలోనే అంతిమ సంస్కారం జరిపిన కుటుంబ సభ్యులు

**మైసూరు,జులై 12:** ప్రముఖ గాయని, గాన కోకిల ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. ఆమె అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు. జానకి కోరిక మేరకు కణియనహుండి లోని ఆమె ఫామ్‌హౌస్‌లో కుటుంబ సభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. తెలుగు బ్రాహ్మణ సంప్రదాయాల ప్రకారం జానకి అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మనవరాలు చితికి నిప్పంటించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డికె శివకుమార్ ప్రకటించారు. వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 యేళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48వేలకు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు. జానకి అంతిమయాత్రలో సినీ, రాజకీయ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. బాధాతప్త హృదయాలతో ఆమెకు కన్నీటి వీడ్కోలు పలికారు.

# రేపు విశాఖకు జగన్

**విజయవాడ,జూలై12 ప్రభాతవార్తప్రతినిధి:** వైసీపీ అధినేత జగన్ విశాఖపట్నంలో పర్యటించనున్నారు. ఇటీవల సముద్రంలో జరిగిన పడవ ప్రమాదంలో గల్లంతైన ఆరుగురు మత్స్యకారుల కుటుంబాలను ఆయన పరామర్శించనున్నారు. ఈ నెల 14వ తేదీన జగన్ పర్యటన ఖరారైంది. ఈ పర్యటన వివరాలను వైసీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆదివారం వెల్లడించారు. జూలై 14న ఉదయం 10:30 గంటలకు జగన్ విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి నేరుగా దక్షిణ నియోజకవర్గంలోని జబ్బరుపేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలను ఓదార్చుతారని తెలిపారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కరి చిన్నాతో పాటు అతని కుటుంబ సభ్యులతోనూ జగన్ మాట్లాడతారని చెప్పారు. ఈ సందర్భంగా కేకే రాజు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తీరానికి కేవలం 8 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినా, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరడానికి 20 గంటల సమయం పట్టిందని ఆరోపించారు. కోస్ట్ గార్డ్, నేవీ, మెరైన్ పోలీసు, మత్స్య, రెవెన్యూ శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగానే ఆరుగురు మత్స్యకారులు గల్లంతయ్యారని అన్నారు. గల్లంతైన వారి ఆచూకీ లభించకముందే రెస్క్యూ ఆపరేషన్‌ను నిలిపివేయడాన్ని ఆయన తప్పుబట్టారు. జిల్లాకు చెందిన హోం మంత్రి అనిత బాధితులను పరామర్శించకపోవడం దారుణమన్నారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేష్, అచ్చెన్నాయుడు ఈ విషాదంపై మౌనంగా ఉన్నారంటూ విమర్శించారు.

## జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**దేవరపల్లి, జులై 12 (ప్రభాతవార్త ):** తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలంలోని యర్నగూడెం జాతీయ రహదారిపై ఆర్.కన్వెన్షన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు మృతి చెందారు. దేవరపల్లి నుండి నల్లజర్ల వైపు పుల్లలు లోడ్ చేసుకుందునేందుకు వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు వెనుక బాగాన్ని వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది.ట్రాక్టర్ ట్రక్కుకు సైడ్ డోర్లు లేకపోవడంతో వెనుక నుంచి వాహనం ఢీకొన్న ప్రభావానికి ట్రక్కులో ప్రయాణిస్తున్న ముగ్గురిలో ఇద్దరు వ్యక్తులు ఎగిరి రోడ్డుపై పడిపోవడం జరిగింది.ఈ ప్రమాదంలో రోడ్డు తాకిడికి తలలకు తీవ్ర గాయాలు కావడంతో సంఘటనా స్థలంలోనే సదరు ఇద్దరు వ్యక్తులు మృతి చెందడం జరిగింది.అదృష్టవశాత్తు ట్రక్కులోని మరో వ్యక్తి,ట్రాక్టర్ డ్రైవర్ ఈ ప్రమాదం నుండి సురక్షి తంగా బయటపడ్డారు.మృతులు దేవరపల్లి గ్రామానికి చెందిన కుక్కల శ్రీను (40) కళ్ళే రాజు (40)గా పోలీసులు గుర్తించారు.సమాచారం అందుకున్న హైవే మొబైల్ పార్టీ, దేవరపల్లి పోలీసు సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా రక్షణ చర్యలు చేపట్టారు.

# జానకికి సిఎం, డి.సిఎం, లోకేష్ నివాళులు

**విజయవాడ,జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** తుది శ్వాస విడిచిన గాన కోకిల, ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకమ్మకు సిఎం చంద్రబాబు నివాళుల అర్పించారు. క్యాంప్ కార్యాలయంలో జానకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు నేలపై జన్మించిన జానకమ్మ ఆరు దశాబ్దాలకు పైగా తన అపూర్వగానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు.

**తెలుగు గాయనీమణుల్లో ఆణిముత్యం: డి.సిఎం పవన్**

గాయని జానకి మృతి పట్ల ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ప్రఖ్యాత గాయని జానకి మరణం అత్యంత విచారకరం. తెలుగు గాయనీమణుల్లో ఆమె ఒక ఆణిముత్యం. జానకమ్మ పాడిన అజరామరమైన గీతాలు తెలుగువారి మదిలో ఎప్పటికీ మెదులుతూనే ఉంటాయి. జానకి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని పవన్ తన సంతాప సందేశంలో వెల్లడించారు.

**ఎస్.జానకి మృతిపట్ల మంత్రి నారా లోకేశ్ సంతాపం**

ప్రముఖ గాయని ఎస్.జానకి మృతిపట్ల మంత్రి నారా లోకేష్ సంతాపం వ్యక్తం చేశారు. "సంగీత ప్రియుల హృదయాల్లో జానకి చెరగని ముద్రవేశారు. ఎస్.జానకి తెలుగునేలపై జన్మించడం మనందరికీ గర్వకారణం" అని లోకేశ్ అన్నారు.

# ప్రకృతి సేద్యాన్ని పెంచండి

>> నాయుడు ఆదేశించారు. ప్రత్యేకించి కూరగాయలు, పండ్ల ఉత్పత్తులు నేరుగా వినియోగదారుకు చేర్చేలా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్ల ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ సహా తక్కువ వ్యయంతో ఇంటి వద్దకే చేరేలా ఈ కొత్త వ్యూహం ఉపయోగపడుతుందని అన్నారు. కరవు ప్రాంతాలతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా వేర్వేరు చోట్ల పశువుల దాణా పండించేలా చూడాలన్నారు. వ్యవసాయ యాంత్రీకరణతో పాటు ఆధునీకరణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు చేసి ఏ పంటకు భూములు అనువుగా ఉన్నాయన్నది రైతులకు తెలియచేయాలన్నారు. భూసార పరీక్షలు చేసి వాటి వివరాలను రైతులు పొందేలా ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచాలని తెలిపారు. కృష్ణా, గోదావరి డెల్టా సహా వివిధ ప్రాంతాల్లో పంటలకు సాగునీటిపై దృష్టి పెట్టాలని సిఎం సూచించారు. పంట తెగుళ్లను నియంత్రించేలా పురుగుమందుల వినియోగం ఏమేరకు రాష్ట్రంలో తగ్గించగలిగామో అంచనా వేయాలని సిఎం స్పష్టం చేశారు. రసాయన ఎరువుల వినియోగం తగ్గించి మైక్రో న్యూట్రియంట్లను పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. యుద్ధ ప్రభావం నేపథ్యంలో రసాయన ఎరువుల లభ్యత పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని.. ఈ నేపథ్యంలో ప్రకృతి సేద్యం వైపుగా రైతుల్ని ప్రోత్సహించాలన్నారు. నేచురల్ ఫార్మింగ్‌పై వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యార్థులు కూడా క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసేలా యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అధికారులకు సిఎం నిర్దేశించారు. వ్యవసాయ యాంత్రీకరణపై క్లస్టర్ల వారీగా ప్రణాళికలు చేపట్టటంతో పాటు రైతు సాధికార సంస్థ ద్వారా హార్వెస్టర్లు, విత్తన యంత్రాలు, ఇతర పరికరాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఫార్మర్ యాప్ ద్వారా అన్ని అంశాలనూ ఇంటిగ్రేట్ చేయాలని డ్రోన్లు, ఫార్మింగ్ యంత్రాల వినియోగం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమ ప్రాంతాన్ని ఉద్యాన హబ్‌గా మార్చేందుకు రూ.40 వేల కోట్లతో పూర్వోదయ పథకం అమలులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల కనెక్టివిటీ, గోదాములు సహా మౌలిక సదుపాయాల నిర్మాణంతో పాటు రూ.60 వేల కోట్ల ప్రైవేటు పెట్టుబడులతో అభివృద్ధి చేయనున్నట్టు సిఎం వివరించారు. తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లి సమీపంలో యడవోలు వద్ద కోకో సిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి సూచించారు. జూలై నాటికి మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు శంకుస్థాపన చేయనున్నట్టు సిఎం వెల్లడించారు. పశు దాణాతో పాటు సైలేజ్‌ను తక్కువ వ్యయానికే అందుబాటులోకి తేవటంతో పాటు తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా పౌల్ట్రీలో కోళ్లు చనిపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమలో అరటికి కోల్డ్ స్టోరేజి సౌకర్యం కల్పించాలని సిఎం అధికారులను ఆదేశించారు.రైతు బజార్లు, ప్రైవేటు మార్కెట్లలో ప్రకృతి సేద్యం ద్వారా పండిన ఉత్పత్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందులలో సెంట్రల్ ఫుడ్ టెస్టింగ్ ల్యాబొరేటరీని పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి అవసరమైన రూ.3కోట్లను తక్షణమే విడుదల చేసి కార్యకలాపాలు ప్రారంభించాలని సిఎం నిర్దేశించారు. ఆక్వా జోన్లలో ఆక్వా సాగు చేసే రైతులకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీ అంశంపైనా సిఎం కీలకమైన ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం ఆక్వా రంగానికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున విద్యుత్ విద్యుత్ సబ్సిడి ఇస్తున్నామని అన్నారు.ఇప్పటికే ఇచ్చిన 50 వేల కనెక్షన్లతో పాటు కొత్తగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న 12,680 ఆక్వా కనెక్షన్లకూ ఈ సబ్సిడీ వర్తింప చేయాలని ఆదేశించారు. ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1,100 కోట్ల ఇస్తోందని తెలిపారు. కొత్తగా ఇచ్చే కనెక్షన్లకు కూడా రూ.188 కోట్ల అదనపు సబ్సిడీని ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. రాష్ట్రంలో సాగవుతున్న 4 లక్షల ఎకరాలు ఆక్వా జోన్ పరిధిలోకి రావాలని సీఎం స్పష్టం చేశారు. ఆక్వా రంగంలో క్వాలిటీ సర్టిఫికేషన్‌తో పాటు ట్రేసబిలిటీ తీసుకురావాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

# 7 బస్సులు దగ్ధం

>>చేశారు. తమ ప్రాణాలకు తెగించి సుమారు 10 బస్సుల వరకు సురక్షితంగా బయటకు తీశారు. దీంతో మరింత భారీ నష్టం తప్పింది. ఈలోగా మూడు ఫైరింజన్లు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఇక, ఈ ప్రమాదంలో గ్యారేజీలో నిలిపి ఉంచిన ఏడు బస్సులు దగ్ధం అయ్యాయి. పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని తెలిపారు.

## పవన్ ఆరోగ్యంపై కోకిలాబెన్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్

**విజయవాడ, జూలై12,ప్రభాతవార్తప్రతినిధి:** పవన్ ఆరోగ్యంపై కోకిలాబెన్ ఆస్పత్రి హెల్త్ బులెటిన్‌ను ఆదివారం విడుదల చేసింది. పవన్ కుడి భుజంలోని రొటేటర్ కఫ్‌కు తీవ్రగాయం అయింది. రెండు ప్రధాన టెండన్లు చిట్లినట్లు వైద్యుల నిర్ధారణ చేసారు.నిన్న విజయవంతంగా శస్త్రచికిత్స పూర్తి చేసాం.ప్రస్తుతం నిలకడగా పవన్‌కల్యాణ్ ఆరోగ్యం ఉంది.కొంతకాలం పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యుల సూచించారు. విశ్రాంతి అనంతరం షోల్డర్ రిహాబిలిటేషన్ ప్రారంభించడం జరుగుతుంది.

**వారం - వర్జ్యం**

13-07-2026, సోమవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, పునర్వసు కార్తె
చతుర్దశి సా.6.50,
ఆరుద్ర రా.2.52
వర్జ్యం : మ.1.06-మ.2.31
దు.మ.12.38-మ.1.30,
2) మ.3.15-సా.4.07
రాహుకాలం - ఉ.7.30-9.00

**వార్తాఫలం**

**మేషం :** కోర్టుకేసుల పరిష్కార దశకు చేరుకుంటాయి. ఊహించని విధంగా ఉద్యోగావకాశాలు దరికి చేరుతాయి.

**వృషభం:** చేపట్టిన పనులు సాఫీగా సాగుతాయి. ప్రముఖులను కలుసుకొని ముఖ్య విషయాలపై చర్చిస్తారు.

**మిథునం:** అకాల భోజనం, ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం తగదు. కళారంగంలోని వారికి విదేశీ పర్యటనలు వుంటాయి.

**కర్కాటకం:**సంతానం పరంగా అభివృద్ధిని సాధిస్తారు. పోటీ పరీక్షలలో అతికష్టం మీద విజయం సాధిస్తారు. వాహనసౌఖ్యం.

**సింహం:** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఋణబాధలు తొలగుతాయి.

**కన్య :**సానుకూలంగా ఆలోచించి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోండి. బంధువుల కలయిక.

**తుల :** మధ్యవర్తిత్వాలు, పంచాయితీలు లాభించవు. దేవాలయ సందర్శన చేసుకుంటారు. స్పెక్యులేషన్ లాభిస్తుంది.

**వృశ్చికం:** సన్నిహిత వర్గం నుండి ఆర్థిక సహాయ సహకారాలు నామమాత్రంగా అందుకుంటారు. పెట్టుబడులలో నిదానం అవసరం.

**ధనుస్సు:**ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లాభిస్తాయి. మానసిక ప్రశాంతత పొందుతారు.

**మకరం:**రాజకీయ రంగాలలోని వారికి విదేశీ పర్యటనలు ఉంటాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు లాభిస్తాయి.

**కుంభం:** వ్యక్తిగత సమస్యల నుండి బయటపడతారు. సకుటుంబ సమేతంగా ప్రయాణాలు చేస్తారు.వస్త్ర లాభం.

**మీనం :** ఎదుటి వారి విషయంలో జోక్యం వద్దు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అదుపుతప్పిన కారు

>> ఘటనాస్థలిలో ఒక్కసారిగా భయాందోళనలు నెలకొన్నాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు సహాయం అందించడంతో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ ప్రమాదంలో చెత్త ఆటో, ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మరో ముగ్గురు స్వల్ప గాయాలపాలయ్యారు. వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదంకారణంగా కొంతసేపు మంగమూరు రోడ్డుపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకువచ్చారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి సంబంధించిన ఆధారాలను సేకరించారు. ప్రమాదానికి గురైన కారు, ఇతర వాహనాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. కారులోఉన్న మహిళా వైద్యులు సురక్షితంగా బయట పడినట్లు అధికారులు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారు ఒంగోలులో జరుగుతున్న గైనకాలజిస్టుల రాష్ట్ర సదస్సుకు హాజరైన మహిళా వైద్యులుగా పోలీసులు గుర్తించారు. ఆదివారం ఉదయం కాఫీ షాప్‌కు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రమాద సమాచారంఅందుకున్న జిల్లాఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తాలూకా సిఐ టి. విజయ్ కృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా లేదా ఇతర సాంకేతిక కారణాలున్నాయా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధులకు హాజరవుతున్న సమయంలో ఎఆర్ కానిస్టేబుల్ మరియదాసు మృతి చెందడంపై విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పందించారు. బాధిత కుటుంబానికి సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజుకు సూచించారు. అలాగే మృతుడి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం, తగిన సహాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

# పవన్‌ను పరామర్శించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై12,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముంబైలోని ఒక ప్రముఖ ఆస్పత్రిలో తన కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు సిఎం చంద్రబాబు నాయుడు ఆదివారం ముంబైలోని ఆ ఆస్పత్రికి వెళ్లి పవన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌తో సమావేశమై ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముంబైలో తన కుడి భుజానికి నిన్న శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆయన సర్జరీ విజయవంతం అయినట్లు వైద్యులు ప్రకటించారు.ఈ క్రమంలో ఆయన ఆరోగ్య స్థితిని తెలుసుకునేందుకు సిఎం చంద్రబాబు ముంబాయి చేరుకున్నారు.పవన్ ఉన్న ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.ఈ సందర్భంగా ఇద్దరు నేతల మధ్య రాష్ట్ర అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. పవన్ కల్యాణ్ ఆరోగ్యంపై జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నిరంతరం సమాచారం తెలుసుకుంటూ ఉండగా, ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లి పరామర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంత్రి నారాయణ కూడా పవన్ కల్యాణ్‌ను పరామర్శించారు.

**పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతం : సిఎం చంద్రబాబు**

పవన్ కల్యాణ్‌కు శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని సిఎం చంద్రబాబు అన్నారు. పవన్‌ను పరామర్శించిన అనంతరం ఆయన 'ఎక్స్'లో చేసిన పోస్టులో ఈ విషయం తెలిపారు. సుమారు మూడున్నర గంటలపాటు వైద్యులు ఈ ఆపరేషన్ చేశారన్నారు. ఆయన రెండో చేతికి కూడా స్వల్ప సమస్య ఉందని, ప్రస్తుతానికి ఫిజియోథెరపీ చేస్తామని డాక్టర్లు చెప్పారన్నారు. ఒకవేళ అవసరమైతే ఆ చేతికి కూడా ఆపరేషన్ చేస్తామన్నారు. పవన్ కనీసం మూడు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సీఎం చంద్రబాబు వెల్లడించారు. ఆయనకు ఎక్కువ విశ్రాంతి అవసరమని, పవన్ త్వరగా కోలుకోవాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు చంద్రబాబు తెలిపారు.



శనివారం రాత్రి సిమ్లాలో కురిసిన భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడిన దృశ్యం

# జీవన భృతి 10 వేలకు పెంపు

>> నుంచి రూ.60 వేలకు పెంచింది. 2024 జూన్ 12వ తేదీ తర్వాత ఒప్పందం చేసిన రైతులకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. పదేళ్ల పాటు యాన్యుటీ చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. ల్యాండ్ పూలింగ్ స్కీమ్ నిబంధనల్లో సవరణ చేసింది. రూ.10 వేల చొప్పున మెట్ట, జరీబు భూముల యాన్యుటీని ఎపి ప్రభుత్వంపెంచింది. గుంటూరు, పల్నాడు జిల్లాల 7 గ్రామాల్లో డెట్ వేవర్ స్కీమ్‌కు ఎపి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎపిసిఆర్‌డిఎ కమిషనర్‌కు రుణమాఫీ అమలు అధికారాలను ప్రభుత్వం కల్పించింది. ల్యాండ్ పూలింగ్ పరిధిలోని రైతుల వ్యవసాయ రుణాల మాఫీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రుణమాఫీ అమలుకు ప్రత్యేక కార్యాచరణ మార్గదర్శకాలను ఎపిసిఆర్‌డిఎ రూపొందించనుంది. జూన్ 2026 నాటికి ఉన్న వ్యవసాయ రుణాలకే అర్హత కల్పించాలని స్పష్టం చేసింది. ఎపిసిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 55(4) తొలి నోటిఫికేషన్ తేదీనే కట్‌ఆఫ్‌గా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్148ను ప్రభుత్వం జారీ చేసింది.పట్టణ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,122.86 కోట్ల ప్రాజెక్టులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మున్సిపల్ బాండ్ల ద్వారా రూ.1,010.58 కోట్లు సమీకరించనుంది. పూల్డ్ మున్సిపల్ బాండ్ ఇష్యూ ఫ్రేమ్‌వర్క్‌కు సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. పట్టణాభివృద్ధి నిధుల సమీకరణకు మార్కెట్ ఆధారిత విధానానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎపియుఐఎఎంఎల్ పూల్డ్ మున్సిపల్ బాండ్ కార్యక్రమానికి ప్రోగ్రామ్ మేనేజర్‌గా నియమించింది. మర్చంట్ బ్యాంకర్ ఎంపికకు స్క్రీనింగ్ కమిటీ ఏర్పాటు చేసింది. బాండ్ జారీకి ముందు పాల్గొనే పట్టణ స్థానిక సంస్థలకు క్రెడిట్ రేటింగ్ తప్పనిసరి అని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వ గ్యారంటీ లేకుండానే బాండ్ జారీ ప్రక్రియ చేయాలని నిర్ణయించింది. బాండ్ రుణాల చెల్లింపు బాధ్యత పూర్తిగా సంబంధిత పట్టణ స్థానిక సంస్థలదేనని తేల్చిచెప్పింది. ఈ క్రమంలోనే పట్టణ మౌలిక వసతుల ప్రాజెక్టులకు ప్రత్యామ్నాయ నిధుల సమీకరణపై ప్రభుత్వం దృష్టిసారించింది.

# సెప్టెంబరు, అక్టోబరులో స్థానిక ఎన్నికలు

>> స్థాయిల్లో విస్తృత సమన్వయం ఉండాలని స్పష్టంచేశారు. కూటమి పార్టీల రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని ఈ నెల 15న నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ ఇన్‌ఛార్జులు లేని నియోజకవర్గాల్లో త్వరలోనే నియామక ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్టీఆర్ భవన్‌లో సీఎం చంద్రబాబు పార్టీ ముఖ్య నేతలు, జోనల్ కోఆర్డినేటర్‌లతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ మీడియా వేదికగా గొడ్డలి పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టడం, ఓటర్ల జాబితాల సవరణ, పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై నేతలకు సీఎం దిశానిర్దేశం చేశారు. రాయలసీమలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, ఏర్పాటు చేస్తున్న పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వంటి అంశాలపై 'రాయలసీమ రైజింగ్' పేరుతో విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు.

# సిఎం చంద్రబాబు నేడు కోనసీమ జిల్లాల పర్యటన

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పర్యటన, జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో విస్తృతంగా పర్యటించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10:25 గంటలకు గుంటూరు జిల్లా ఉండవల్లిలోని తన నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు తూర్పుగోదావరి జిల్లా వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారుల స్వాగతం పలుకుతారు. అనంతరం ఉదయం 11.10కి రోడ్డు మార్గంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజ్‌కు ఉదయం 11.25 చేరుకుని, బ్యారేజ్ నంబర్ 1 గేటును అధికారికంగా ప్రారంభిస్తారు. అనంతరం ఉ.11.40కు అక్కడ నుంచి బయలుదేరి ఉ .11.50 ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై రైతులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొని,వారి సమస్యలు, సూచనలు తెలుసుకుంటారు. రైతులతో సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి మ.12.50కు అక్కడ నుంచి బయలుదేరి మ.12.55కి వేమగిరి హెలిప్యాడ్‌కు చేరుకుని, అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు ప్రాంతానికి బయలు దేరుతారు. మ.1:20 గంటలకు ప్రాజెక్టు ప్రాంతానికి చేరుకుని ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 2:05 గంటల నుంచి సాయంత్రం 5:15 గంటల వరకు పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. ఈ సందర్భంగా ఇసిఆర్ఎఫ్ గ్యాప్ 2 పనులు, పవర్ హౌస్ నిర్మాణ పనుల పురోగతిని నిశితంగా పరిశీలిస్తారు. పరిశీలన అనంతరం పోలవరం సాగునీటి ప్రాజెక్టు పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అనంతరం ప్రాజెక్టు తాజా పరిస్థితి, ప్రభుత్వం చేపట్టనున్న తదుపరి చర్యలపై మాట్లాడతారు. అనంతరం సాయంత్రం 5:25 గంటలకు పోలవరం ప్రాజెక్టు ప్రాంతం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, సాయంత్రం 6:05 గంటలకు ఉండవల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

## తెలంగాణ సిఎం రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు

### గుంటూరులో వైసీపీ నేత నాగార్జున యాదవ్ అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జులై12:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం నాడు ఎపిలోని గుంటూరులో ఉన్న ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, ఆయన్ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, సిఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి నాగార్జున యాదవ్ చేసిన కొన్ని వ్యాఖ్యలపై కేసు నమోదైంది. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు చేస్తున్న తెలంగాణ పోలీసులు ఆదివారం గుంటూరుకు చేరుకున్నారు. నాగార్జున యాదవ్‌ను అరెస్ట్ చేస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం, తమ వివరాలను, అరెస్ట్ సమాచారాన్ని స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు తెలియజేస్తామని చెప్పి ఆయన్ను తమతో తీసుకెళ్లారు. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ నేతను, మరో రాష్ట్ర పోలీసులువచ్చి అరెస్ట్ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఒక టివి ఛానల్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎమ్మెల్యేగా కూడా రేవంత్ సమర్థంగా పనిచేయలేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యల కారణంగానే ఆయనపై కేసు నమోదై, అరెస్ట్ జరిగిట్టు తెలుస్తోంది.

# డ్రగ్స్ విక్రయంపై పోలీసుల దాడి

## ముగ్గురు యువకులు అరెస్ట్

### వారిలో ఒకరు టిటిడి ఉద్యోగి?

**రేణిగుంట, జులై 12 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా రేణిగుంట అర్బన్ పోలీసులు జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు రేణిగుంట డిఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో రెండు రోజుల క్రితం శుక్రవారం రేణిగుంట రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద గంజాయి అమ్మే ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద 62 గ్రాముల మెత్ డ్రగ్, నాలుగు సెల్ ఫోన్లు, రెండు బుల్లెట్ ద్విచక్ర వాహనాలు, రెండు డిజిటల్ వేయింగ్ మిషన్లు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు. అరెస్ట్ అయిన వారిలో ఒకరు తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన ఉద్యోగిగా భావిస్తున్నారు. అర్బన్ పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు అర్బన్ సిఐ జయచంద్ర, ఎస్సైలు ధర్మారెడ్డి, శ్రీనివాసులు తమ సిబ్బందితో రేణిగుంట రైల్వే స్టేషన్ కార్ పార్కింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. తిరుపతి జిల్లా తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన తెల్ల గుణశేఖర్ (26), తిరుపతి కొర్లగుంటకు చెందిన అశ్విన్ కుమార్ (30), అదే ప్రాంతానికి చెందిన రాహుల్ యాదవ్ (30) గా పోలీసులు నిర్ధారించారు. వీరిలో ఒక వ్యక్తి తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన తిరుపతి శ్రీగోవిందరాజు స్వామి గుడి అనుసంధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవ అవాస్తవాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## నందిగామ గురుకుల వసతిగృహం విద్యార్థిని అదృశ్యం

**విజయవాడ.జులై12,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా నందిగామ గురుకుల వసతిగృహం విద్యార్థిని అదృశ్యమవడం స్థానికంగా కలకలం రేపింది. నందిగామ జడ్పీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న జోషిక అనే విద్యార్థిని కనిపించకుండా పోయింది. వీరులపాడు మండలం చెన్నారావుపాలెంకు చెందిన బాలికగా అధికారులు గుర్తించారు. బాలిక ఆర్టీసీ బస్సు ఎక్కి కంచికచర్ల బస్టాండ్‌లో దిగినట్లు సిసి ఫుటేజ్‌లో గుర్తించారు. బాలిక స్వగ్రామానికి పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసులు వెళ్లారు.

# ధవళేశ్వరం బ్యారేజీకి నూతన జీవం

● 117 వరద గేట్ల మార్పిడికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు శ్రీకారం

● గోదావరి డెల్టా భద్రత, సాగునీటి భవిష్యత్తుకు చరిత్రాత్మక అడుగు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 12 ప్రభాతవార్త:** ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ, తాగునీటి అవసరాలకు దాదాపు రెండు శతాబ్దాలుగా జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది. సుమారు రూ152.95 కోట్ల వ్యయంతో 117 పాత వరద గేట్ల స్థానంలో అత్యాధునిక వరద గేట్ల ఏర్పాటు పనులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో పిచ్చుకలంక గేట్ నెంబర్ ఒకటి వద్ద సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. గోదావరి డెల్టా సాగునీటి భద్రత, ఆనకట్ట దీర్ఘకాలిక సంరక్షణ దిశగా ఇది అత్యంత కీలకమైన మైలురాయిగా అధికారులు పేర్కొంటున్నారు.

1847లో ప్రారంభమై 1852లో పూర్తయిన ధవళేశ్వరం ఆనకట్టతో గోదావరి జలాలను సక్రమంగా వినియోగించేందుకు మార్గం సుగమమైంది. అప్పటి వరకు సముద్రంలో కలిసిపోయే వరద జలాలను వ్యవసాయానికి మళ్లించి,గోదావరి డెల్టాను దేశంలోనే అత్యంత సారవంతమైన ప్రాంతాల్లో ఒకటిగా తీర్చిదిద్దడంలో సర్ ఆర్థర్ కాటన్ పాత్ర చారిత్రాత్మకంగా నిలిచింది. ఈ కృషికి గుర్తింపు గా గోదావరి ప్రాంత రైతులు నేటికీ ఆయనను కృతజ్ఞతాభావంతో స్మరిస్తుంటారు. కాలక్రమేణా పాత ఆనకట్ట వయోభారానికి లోనవడంతో, 1963 వరదల అనంతరం ఆధునిక బ్యారేజీ నిర్మాణ అవసరం ఏర్పడింది. 1969లో ప్రారంభమైన సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నిర్మాణం 1984లో పూర్తయింది. దాదాపు 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ ప్రస్తుతం 10.13 లక్షల ఎకరాలకు సాగునీటిని అందించడంతో పాటు లక్షలాది మంది ప్రజలకు తాగునీటి ప్రధాన ఆధారంగా కొనసాగుతోంది. వరద నియంత్రణ, డెల్టా వ్యవసాయ పరిరక్షణలోనూ ఇది కీలక పాత్ర పోషిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగం, భారీ వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల సహజ శిథిలీకరణ నేపథ్యంలో బ్యారేజీ భద్రతపై కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రోమెకానికల్ నిపుణుల కమిటీలు పలు దఫాలు పరిశీలనలు నిర్వహించాయి. వాటి సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది. 201415లో తొలి దశలో 175 వరద గేట్లలో 58 గేట్లను రూ.31.77 కోట్లతో మార్చగా, ఇప్పుడు మిగిలిన 117 గేట్ల మార్పిడి, అన్ని 175 గేట్లకు కొత్త రబ్బర్ సీల్స్, రోలర్ అసెంబ్లీలు, వైర్ రోపులు, మాస్టర్ కంట్రోల్ ప్యానెల్స్, విద్యుత్ కేబుళ్ల మార్పిడి, శాండ్ బ్లాస్టింగ్, పెయింటింగ్ వంటి సమగ్ర పనులు చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే బ్యారేజీ భద్రత, వరద నిర్వహణ సామర్థ్యం మరింత మెరుగుపడుతుందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ప్రభుత్వం 2025లో ఈ పనులకు పరిపాలనా అనుమతి మంజూరు చేయగా, సాంకేతిక ఆమోదం అనంతరం ఎంఎస్ బికెం ఇన్ ఫ్రా ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థకు పనులు అప్పగించారు. రెండు సంవత్సరాల్లో పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టు అమలవుతోంది.

ఈ కార్యక్రమం కేవలం గేట్ల మార్పిడితో పరిమితం కాకుండా, గోదావరి డెల్టా భవిష్యత్తుకు భద్రత కల్పించే దీర్ఘకాలిక పెట్టుబడిగా భావిస్తున్నారు. ముఖ్యంగా తూర్పు, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల రైతాంగంతో పాటు మత్స్యకారులు, గ్రామీణ ప్రజల జీవనోపాధి మరింత స్థిరపడే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన గోదావరి ప్రాంత వారసత్వ సంపద సంరక్షణ దిశగా కూడా ఈ ఆధునీకరణ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. చారిత్రక విలువ కలిగిన బ్యారేజీ నిర్మాణ వారసత్వాన్ని పరిరక్షిస్తూనే, ఆధునిక సాంకేతికతతో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దే ప్రయత్నంగా దీనిని భావిస్తున్నారు. సర్ ఆర్థర్ కాటన్ సృష్టించిన జలవనరుల వారసత్వాన్ని సంరక్షి స్తూ, భవిష్యత్ తరాలకు సురక్షితమైన సాగునీటి వ్యవస్థను అందించాలనే లక్ష్యంతో చేపడుతున్న ఈ కార్యక్రమం గోదావరి డెల్టా చరిత్రలో మరో సువర్ణ అధ్యాయంగా నిలవనుందని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.



# జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4 మహిళల కాంపౌండ్ ఈవెంట్‌లో రజతం సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ముఖ్యమంత్రి చంద్రబాబ అభినందనలు తెలిపారు. యువ అథ్లెట్లకు రాష్ట్ర ముద్దుబిడ్డ జ్యోతి సురేఖ స్ఫూర్తిగా నిలుస్తున్నారని కొనియాడారు. ఛాంపియన్లను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ టోర్నమెంట్‌లో టీమ్ ఇండియా మరిన్ని విజయాలు సాధించాలన్నారు.

**కీడ్రా మంత్రి అభినందన:** ఆర్చరీ వరల్డ్ కప్ స్టేజ్4లో పతకాలను సాధించిన జ్యోతి సురేఖ, ప్రీతిక ప్రదీప్, చికిత తానిపర్తికి ఎపి క్రీడా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి అభినందించారు. వారు మంచి విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. వారు విలుక్రీడలో రాణించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రోత్సాహన్ని అందిస్తుందన్నారు.

# హంద్రీనీవా విస్తరణకు శ్రీకారం

● రూ.790 కోట్ల పనులు ప్రారంభించిన మంత్రి నిమ్మల రామానాయుడు



**హిందూపురం, జులై 12 ప్రభాతవార్త:** హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తూ మడకశిర బ్రాంచ్ కెనాల్ వరకు విస్తరించే అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ శంకుస్థాపన చేశారు. హిందూపురం పర్యటనకు వచ్చిన సందర్భంగా బాలయ్య రాచపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం భూమి పూజ చేసి ప్రారంభించగా రాష్ట్ర జలవనరుల అభివృద్ధి శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడు, ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, ఎమ్మెస్ రాజు, అమిలినేని సురేంద్రబాబు హాజర య్యారు. ఈ సందర్భంగా లాంఛనంగా కాలువ వెడల్పు పనులను స్వయంగా బాలకృష్ణ హిటాచి వాహనం నడుపుతూ ప్రారంభించడం విశేషం. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి నిమ్మల మాట్లాడుతూ ఐదేళ్ల గొడ్డలి పార్టీ పాలనలో రాయలసీమకు చేసిందేమీ లేదని, సీమ ద్రోహులుగా మిగిలిపోయారని ఘాటుగా విమర్శించారు. తమ ప్రభుత్వం రాయలసీమ రతనాల సీమగా మార్చుతోందని అన్నారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ కృషితోనే 790 కోట్ల రూపాయల నిధులు హంద్రీ నీవా పనులకు విడుదల అయ్యాయని చెప్పారు. తమ ప్రభుత్వంలో రూ. 3,800 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ హిందూ పురం ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. అనంతరం పట్టణంలో ఎంజీఎం క్రీడా మైదాములో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంను బాలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురం ప్రజల రుణం తీర్చుకోలేనిదని అభివృద్ధి పనులు చేస్తూ ప్రజలకు అండగా ఉంటామని వివరించారు. కష్టపడిన పార్టీ కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ఇండోర్ స్టేడియం ప్రారంభంతో ఎంతో కాలంగా ఉన్న సమస్య తీరిందని దేహ దారుడ్యానికి క్రీడలు ఎంతో కీలకం అన్నారు. అనంతరం బాలయ్యతో పాటు ఎంపీ పార్థసారథి, కలెక్టర్ శ్యాంప్రసాద్, చైర్మన్ రవి నాయుడు షటిల్ బ్యాడ్మింటన్ ఆడారు. అదేవిధంగా టేబుల్ టెన్నిస్ కూడా ఆడుతూ క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు. రాచపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి హాజరు అయ్యారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శిలు డాక్టర్ సురేంద్రబాబు, శ్రీనివాసరావు, వీరయ్య, బాలాజీ తోపాటు మున్సిపల్ మాజీ చైర్మన్లు అనిల్ కుమార్, రమేష్ కుమార్, పట్టణ టిడిపి అధ్యక్షులు వెంకటేష్ మొదలగు వారు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి సవిత

# విద్యకు అధిక ప్రాధాన్యత: మంత్రి సవిత

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** బిసి విద్యార్థుల విద్యకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని మంత్రి సవిత వ్యాఖ్యానించారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం అందిస్తున్నామని పేర్కొన్నారు. డైట్ ఛార్జీల బిల్లులు 10శాతం పెంచబోతున్నామని తెలిపారు. బిసి బిడ్డలకు రుచికరమైన, కడుపు నిండేలా భోజనం అందిస్తున్నామని చెప్పుకొచ్చారు. బిసి విద్యార్థులు అత్యున్నత స్థానాల్లో నిలవాలన్నదే సిఎం చంద్రబాబు లక్ష్యమని ఉద్ఘాటించారు. ఆదివారం ఎన్టీఆర్ జిల్లా వత్సవాయి మండల కేంద్రంలో మంత్రి సవిత పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వత్సవాయి ఎంజెపి గురుకుల పాఠశాలలో పి4 విధానంలో రూ.75 లక్షలతో నిర్మించిన డైనింగ్ హాల్, డార్మెటరీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజగోపాల్, మాజీ మంత్రి, కెడిసిసి బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడారు. సిఎం చంద్రబాబు ఆశయాన్ని కొనసాగిస్తూ పి4 విధానంలో వత్సవాయి ఎంజెపి స్కూల్‌ను అభివృద్ధి చేసిన ఎన్ఆర్ఐ చిరుమామిళ్ల రాంబాబు దంపతులను అభినందించారు. చిరుమామిళ్ల రాంబాబు ఎంతో మంది దాతలకు స్ఫూర్తిగా నిలిచారని ప్రశంసించారు. బిసి గురుకులాలను స్థాపించిన ఘనత దివంగత మాజీ సిఎం నందమూరి తారక రామారావుది అని తెలిపారు. సిఎం చంద్రబాబు వందలాది బిసి గురుకులాలను ఏర్పాటు చేశారని ప్రస్తావించారు. సమాజం నుంచి పేదరికాన్ని పారదోలాలని సిఎం చంద్రబాబు పి4 విధానం తీసుకువచ్చారని పేర్కొన్నారు. మన చుట్టు పక్కల ఉన్న పేదల కోసం ధనవంతులు ఎంతో కొంత సాయం చేయాలనే సదుద్దేశంతో పి4 విధానాన్ని సిఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని ప్రస్తావించారు. కార్పొరేట్ విద్యాసంస్థల కంటే ఎంజెపి సీట్లకే డిమాండ్ ఎక్కువగా ఉందని వెల్లడించారు. పదోతరగతి, ఇంటర్‌లో ఎంజెపి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని మంత్రి సవిత ప్రశంసించారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఫొటోతో కూడిన విద్యామిత్ర కిట్లను అందజేస్తున్నామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీసుకొస్తున్న సంస్కరణల ఫలితంగా పదోతరగతి, ఇంటర్‌లో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది ఫలితాలు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం ఎపిలో 109 గురుకులాలు ఉండగా, ఈ యేడాది కొత్తగా మరో 10 గురుకులాలను ప్రారంభించామని చెప్పుకొచ్చారు. 6 ఎంజెపి బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశామని వెల్లడించారు. రూ.500 కోట్ల సాస్కీ నిధులతో ఎంజెపి గురుకులాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేశామని అన్నారు. కొత్తగా బిసి హాస్టళ్లకు బదులు గురుకులాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని చెప్పారు. ఎంజెపి స్కూళ్లు, బిసి హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ఆర్వో ప్లాంట్లు, సిసిటివి కెమెరాలు, ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామని మంత్రి సవిత పేర్కొన్నారు.

# వలసల నివారణకే పలాస ఎయిర్‌పోర్ట్

● 500 ఎకరాల్లో పరిశ్రమల స్థాపన ● కేంద్ర మంత్రి రామ్మోహాన్ నాయుడు


● భూసేకరణపై రైతులకు గరిష్ఠ పరిహారం: కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**పలాస (శ్రీకాకుళం జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** శ్రీకాకుళం జిల్లాను వెనుకబడిన ప్రాంతమనే ముద్ర నుంచి దూరం చేసి, ఉపాధి వలసలను శాశ్వతంగా నివారించడమే లక్ష్యంగా పలాస ప్రాంతంలో ప్రతిపాదిత విమానాశ్రయాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. ఆదివారం పలాసలో విమానాశ్రయ ఏర్పాటు, భూసేకరణ, పరిహారం చెల్లింపులపై స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా ప్రవేశపెట్టిన ఉడాన్ పథకం కింద ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిధులతో ఈ విమానాశ్రయం పూర్తి ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మితమవుతుందని, ప్రైవేటుకి కట్టబెడతారనే అపోహలను ఎవరూ నమ్మవద్దని కోరారు. జిల్లాలో విమానాశ్రయం కేవలం ప్రయాణికుల కోసమే కాదని, దీనితో పాటు సేకరించే భూముల్లో దాదాపు 500 ఎకరాలను ప్రత్యేకంగా పరిశ్రమల స్థాపన కోసం కేటాయిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. పరిశ్రమల స్థాపన ద్వారానే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. విమానాశ్రయం, పరిశ్రమల వల్ల వచ్చే ఉద్యోగాలలో స్థానిక ప్రజలకే మొదటి ప్రాధాన్యత దక్కేలా ఒక పక్కా క్రమబద్ధమైన విధానాన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. భోగాపురం ఎయిర్‌పోర్ట్ కారణంగా అక్కడ భూముల ధరలు పెరగడం, హోటళ్లు, రవాణా రంగాల ద్వారా వేలాది మందికి ఉపాధి లభించిన విషయాన్ని ఆయన ఉదాహరణగా గుర్తుచేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలోని మూలపేట పోర్ట్ పనులు అత్యంత వేగంగా సాగుతున్నాయని మంత్రి రామ్మోహన్ నాయుడు కొనియాడారు. మూలపేట ప్రాంత ప్రజలు ప్రాజెక్టు కోసం భూత్యాగం చేయడం వల్లే ఈరోజు ప్రపంచ స్థాయి కంపెనీలు అక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని, అదే తరహాలో పలాస విమానాశ్రయానికి కూడా ప్రజలు సహకరించాలని కోరారు. రాబోయే 20, 30, 40 ఏళ్లలో మన పిల్లల భవిష్యత్తు బాగుండాలన్నా, ఉపాధి కోసం దుబాయ్, గల్ఫ్, సింగపూర్ వంటి దేశాలకు వలస వెళ్లే దుస్థితి తప్పాలన్నా ఈ ప్రాజెక్ట్ ఒక కేంద్ర బిందువుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, విమానాశ్రయ భూసేకరణ ప్రక్రియలో ఏ ఒక్క గ్రామాన్ని కూడా ఖాళీ చేయించడం లేదా తరలించడం జరగదని స్పష్టం చేశారు. భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు, భూములు కోల్పోతున్న బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయమైన, గరిష్ఠ పరిహారాన్ని పారదర్శకంగా అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజల పూర్తి అంగీకారం, సమన్వయంతోనే ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా, ఆర్డీఓ కృష్ణమూర్తి, పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీషలతో పాటు పలువురు స్థానిక నాయకులు, శాఖల ఉన్నతాధికారులు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భూసేకరణపై రైతులు అడిగిన పలు సందేహాలను అధికారులు ఈ సందర్భంగా నివృత్తి చేశారు.

# సర్ ప్రక్రియ పారదర్శకంగా ముగించండి

● తిరుపతిలో తనిఖీల్లో కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్



**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని భారత ఎన్నికల కమిషన్ కార్యదర్శి నవీన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఆదివారం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆర్. గోవిందరావు, ఇన్‌చార్జి కమిషనర్ శారదాదేవి, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమోళి తదితర అధికారులతో కలిసి ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షి ంచి అవసరమైన సూచనలు చేశారు. సమీక్ష అనంతరం ఎన్నికల కమిషన్ బృందం సెక్షన్ ఆఫీసర్ అనిత కుక్రేజా, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ ఉదిత్ కుమార్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. తిరుపతిలోని రామకృష్ణ థియేటర్ సర్కిల్, లక్ష్మీపురం, వైకుంఠపురం ప్రాంతాలతో పాటు చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని తిరుచానూరు, చిన్నగొట్టిగల మండలం భాకరాపేట, ఎర్రావారిపాలెం మండలం నెరబైలు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించి ప్రత్యేక సవరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్లు, బిఎల్ఒలను కలిసి వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్య, సేకరించిన ఎన్యూమరేషన్ ఫారాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ పనితీరును పరిశీలించి సచివాలయ సిబ్బంది, బీఎల్‌పలతో మాట్లాడారు. తిరుచానూరు ప్రాంతంలో ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన పలువురు తిరిగి వెళ్లిపోవడంతో 2002 ఓటర్ల జాబితాతో పోల్చడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని అధికారులు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని బీఎల్‌ఏలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. అనంతరం వైకుంఠపురంలోని 250వ పోలింగ్ కేంద్ర పరిధిలో ఇంటింటి సర్వేలో పాల్గొని స్థానిక ఓటర్లతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్డీవో రామ్మోహన్, తిరుపతి అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు, తిరుపతి రూరల్ తహసీల్దార్ జనార్దన్‌రాజు, సచివాలయ సిబ్బంది, బిఎల్ఒలు, బిఎల్ఎలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి

**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం నేడు (సోమవారం) ఉదయం 10 గంటల నుండి నుంచి మధ్యాహ్నం 12.30 గంటలవరకు "డయల్ యువర్ సిఎండి" కార్యక్రమాన్ని ఎస్పీడీసీఎల్ నిర్వహించనుంది. తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి వినియోగదారులు 89777 16661 నంబర్‌కు కాల్‌చేసి తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురావచ్చు. ఈ కార్యక్రమం ద్వారా తమ విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకురాదలచిన వినియోగదారులు తమ వద్ద విద్యుత్ సర్వీసు నంబరు అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. కాగా జిల్లాస్థాయిలో తమ విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకువచ్చేందుకు వీలుగా వినియోగదారులు ఈ నంబర్లకు కాల్ చేయాల్సి ఉంటుంది. తిరుపతి: 87126 52679, చిత్తూరు: 79931 47979, నెల్లూరు: 08612 320427, అన్నమయ్య: 94408 17449, కడప: 08562 242457, కర్నూలు: 73826 14308, నంద్యాల: 73826 18976, అనంతపురం: 91547 90350, శ్రీసత్యసాయి: 99637 07847 కాల్‌చేసి విద్యుత్ సమస్యలను ఎస్ఇల దృష్టికి తీసుకురావచ్చు.

# విశాఖను కుదిపిన భూప్రకంపనలు

● రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత నమోదు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచనలు



**విశాఖపట్నం, జులై 12 ప్రభాతవార్త:** విశాఖనగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన భూప్రకంపనలు ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. ఉదయం 5:05:46 గంటలకు నమోదైన ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రతతో నమోదైనట్లు అధికారికంగా నిర్ధారణ అయింది. సాగర్‌నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. భూప్రకంపనలతో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు. ఈ సందర్భంగా మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రజలు భూకంపం సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. 'డ్రాప్-కవర్-హోల్డ్' విధానాన్ని పాటించాలని, లిఫ్ట్‌లను ఉపయోగించకుండా మెట్ల ద్వారానే బయటకు రావాలని, కిటికీలు, భారీ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం అనంతరం గ్యాస్ లీకేజీ, విద్యుత్ సరఫరాను తనిఖీ చేయాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రాధాన్యంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రొయ్యల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ● సిఎం చంద్రబాబుకు బహిరంగ లేఖ



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో తీవ్ర ఆక్వా సంక్షోభం నెలకొని రొయ్యల రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, వారిని తక్షణమే ఆదుకునేందుకు ప్రభుత్వం అత్యవసర చర్యలు చేపట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ముఖ్యమంత్రి చంద్రబాబును డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆక్వా రైతులను ఆదుకోవాలని కోరుతూ సీఎంకి ఈశ్వరయ్య ఆదివారం బహిరంగ లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 6 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, లక్షలాది కుటుంబాలు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. అయితే ఇటీవల కాలంలో పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు, పడిపోతున్న రొయ్యల ధరలు, నాసిరకం సీడ్, కల్తీ మందులు, విద్యుత్ సమస్యలు, ఎగుమతుల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల సీపీఐ బృందం పశ్చిమగోదావరి, అంబేద్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో పర్యటించి రొయ్యల రైతులతో మాట్లాడిందని ఈశ్వ రయ్య తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు అత్యంత ఆందోళనకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. కేవలం రెండు నెలల వ్యవధిలోనే రొయ్యల మేత ధర టన్నుకు రూ.10 వేల నుంచి రూ.12,500 వరకు పెరిగిందని, ముఖ్యమంత్రి సమక్షంలో మేత ధరలను కిలోకు రూ.4 తగ్గించాలని ప్రభుత్వం సూచించినప్పటికీ కంపెనీలు కేవలం రూ.2 మాత్రమే తగ్గించి, ప్రస్తుతం ఆ తగ్గింపును కూడా అమలు చేయడం లేదని ఆరోపించారు. ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని కంపెనీలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నారని విమర్శించారు. అదేవిధంగా వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి 100 కౌంట్ రొయ్యల ధరను కిలోకు రూ.260 నుంచి రూ.235కు తగ్గించడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. మార్కెట్లో నాణ్యతలేని రొయ్య పిల్లలు విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని, ఒక్క ఎకరానికి లక్ష నుంచి 1.15 లక్షల పిల్లలు వదిలినా అందులో సగం మాత్రమే జీవిస్తున్నాయని పేర్కొన్నారు. కల్తీ మందుల అమ్మకాలను అరికట్టడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఆక్వా, నాన్‌ఆక్వా జోన్లతో సంబంధం లేకుండా యూనిట్ విద్యుత్‌ను రూ.1.50కే అందిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు కాలేదని ఈశ్వరయ్య గుర్తు చేశారు. పైగా పవర్ ఫ్యాక్టర్ పేరుతో తీసుకొచ్చిన జీవో నంబర్ 169 వల్ల సబ్సిడీ పొందే అర్హత ఉన్న రైతులు కూడా నష్టపోతున్నారని విమర్శించారు.

# దక్షిణ కొరియా పర్యటనలో ప్రధాన ఆకర్షణగా శ్రీసిటీ

● శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి



**సత్యవేడు(తిరుపతి జిల్లా), జులై 12 ప్రభాతవార్త:** పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో ఈ నెల 5 నుంచి 11 వరకు సాగిన దక్షిణ కొరియా పర్యటనకు విశేష స్పందన రాగా, వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన పెట్టుబడి దారుల చర్చల్లో శ్రీసిటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ పర్యటన ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అంతర్జాతీయ పెట్టుబడుల అవకాశాలు మరింత బలోపేతం కాగా శ్రీసిటీ ప్రపంచ స్థాయి పారిశ్రామిక కేంద్రంగా విస్తృత గుర్తింపు పొందిందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తెలిపారు. శ్రీసిటీని ప్రపంచ పెట్టుబడులకు అనువైన గమ్యస్థానంగా ప్రముఖ కొరియా కంపెనీలు, పరిశ్రమల సమాఖ్యలు, ప్రభుత్వ సంస్థలకు సమర్థవంతంగా పరిచయం చేసిన మంత్రి లోకేష్‌కు రవీంద్ర సన్నారెడ్డి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సియోల్, బుసాన్ నగరాల్లో జరిగిన ఉన్నత స్థాయి సమావేశాల్లో శ్రీసిటీని ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక హబ్‌గా, ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, డిస్‌ప్లే తయారీ, ఎలక్ట్రిక్ వాహన భాగాలు, అధునాతన తయారీ కృత్రిమ మేధస్సు ఆధారిత పరిశ్రమలు, సముద్ర సాంకేతిక రంగాలకు అత్యంత అనువైన కేంద్రంగా మంత్రి లోకేష్ వివరించినట్లు వెల్లడించారు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్, సోలమ్ గ్రూప్ హ్యుండాయ్ మొబిస్, సియోల్ సెమికండక్టర్, సునిక్ సిస్టమ్స్, సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్, మోటివ్ లింక్,హ్యేసంగ్ హెవీ ఇండస్ట్రీస్ తదితర ప్రముఖ కొరియా సంస్థలతో జరిగిన చర్చల్లోను శ్రీసిటీ కీలక అంశంగా నిలిచిందన్నారు. ఈ పెట్టుబడుల ప్రచార కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు(ఈడీబీ), కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ (కేఓటీఆర్ఏ), భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ), సియోల్‌లోని భారత రాయబార కార్యాలయం తదితర భాగస్వామ్య సంస్థలకు రవీంద్ర సన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పర్యటన రాష్ట్రానికి నాణ్యమైన పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను మరింత పెంచుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

## బుచ్చి వ్యవసాయాధికారి హత్య కేసు

# ఇద్దరు నిందితుల అరెస్ట్



**నెల్లూరు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** సంచలనం సృష్టించిన బుచ్చిరెడ్డిపాలెం మండల వ్యవసాయ అధికారి నడవాటి శ్రీహరి మృతి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఇది కేవలం అనుమానాస్పద మృతి కాదని, పక్కా పథకం ప్రకారం జరిగిన హత్య అని నిర్ధారించిన పోలీసులు, ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 6న తన భర్త శ్రీహరి మృతిపై భార్య లావణ్య అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల సమగ్ర విచారణకు ఆదేశించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు నేతృత్వంలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. విచారణలో భాగంగా గోలగమూడికి చెందిన సోంపల్లి రవీంద్ర, రామతీర్థానికి చెందిన బుచ్చిగారి యానాదయ్యలను అదుపులోకి తీసుకుని విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు. వారిద్దరిని న్యాయ స్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

**ప్రధాన నిందితుడు బావమరిది:** ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కుదుముల హరికృష్ణ మృతుడికి స్వయానా బావమరిది అని పోలీసుల దర్యాప్తులో తేలింది. హరికృష్ణ ప్రస్తుతం పరారీలో ఉన్నాడని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు విస్తృతంగా గాలిస్తున్నాయని రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. హత్యతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల స్పష్టం చేశారు.

# మంట కలుస్తున్న మానవత్వం

- డబ్బుకోసం మృగాలుగా మారుతున్న మనుషులు
- శ్రీహరి మృతి హత్యగా తేలడం సంచలనం
- పోలీస్ అధికారే కేసును రూట్ మార్చాడన్న ఆరోపణలు

**బుచ్చి (నెల్లూరు), జులై 12 ప్రభాతవార్త:** బుచ్చిరెడ్డిపాళెం మండలం వ్యవసాయాధికారి శ్రీహరి మృతి మిస్టరీగా మారింది. శ్రీహరి మొదటిభార్య లావణ్య జిల్లా ఎస్పీకి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ చేపట్టడంతో తీగలాగితే డొంక కదిలినట్లు అసలు వాస్తవాలు ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయి. శ్రీహరి మృతి చెందిన రోజు స్వగ్రామమైన మినగల్లులో అంత్యక్రియలు నిర్వహించే సమయంలో శ్రీహరి మెడపైన గాయాలు ఉండడంతో దానిని పలువురు ప్రశ్నించగా కుటుంబసభ్యులు దానిని దాట వేసి, హడావుడిగా దహన సంస్కారాలు చేశారు. అప్పటి నుండి ఈకేసు విషయంలో అందరికి అనుమానంగానే ఉంది. శ్రీహరి విషయంలో అనుమానాలు వ్యక్త పరస్తున్నా పోలీసులు దీనిపైన సీరియస్‌గా తీసుకోకుండా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రంగా విమర్శలు చేశారు. ఓ పోలీస్ అధికారికి పెద్దఎత్తున ముడుపులు ముట్టాయని దాంతో ఏమి పట్టించుకోలేదని తెలుస్తొంది.

జిల్లా ఎస్పీ దృష్టికి ఒక్కోక్క విషయం బయటకు వస్తుంది. జిల్లా ఎస్పీ చొరవతో పోలీసులు అనుమానితుడ్ని విచారించగా పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. బావమరిదే కుక్క ఇంజక్షన్ మూడు సార్లు చేసి వ్యవసాయాధికారి శ్రీహరిని హత్య చేసి గుండెపోటుగా చిత్రీకరించారని తెలుస్తొంది. సొంత బావమరిదే ఈ ఘటనకు పాలుపడటంతో ఇంక మానవత్వం ఎక్కడుందని పలువురు విస్తుపోతున్నారు. బావమరిది బ్రతకకోతాడని పెద్దలు చెబుతుంటారు.కాని ఇక్కడ బావమరిదే హతమార్చాడు,మృతి చెందిన రోజే పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసి వుంటే అప్పడే వాస్తవాలు బయటపడేవని పలువురు విమర్శలు చేస్తున్నారు. వివాద రహితుడుగా మండలంలో మంచి పేరు తెచ్చుకున్న శ్రీహరిని ఇలా చేయడం దారుణమని పలువురు ఖండిస్తున్నారు. మొదటి భార్య చొరవతోనే అసలు విషయాలు బయటకు రావడం విశేషం.



# సిఆర్‌యస్‌లో భారీ అగ్నిప్రమాదం

**రేణిగుంట, జులై 12 ప్రభాతవార్త:** రేణిగుంట (తిరుపతి) సిఆర్‌ఎస్‌లో ఆదివారం మధ్యాహ్నాం పెను అగ్నిప్రమాదం సంభవించింది. ఉవ్వెత్తున మంటలు ఎగసిపడటంతో స్థానికంగా ఉన్న ప్రజలు భయంతో పరుగులు తీశారు. అగ్ని ప్రమాదం ఎలా సంభవించిందనే విషయాన్ని అధికారులు బయటకు పొక్క నివ్వలేదు. సిఆర్‌ఎస్ ప్రాంగణంలో ఉన్న స్క్రాప్ అగ్నికి ఆహుతి అయిందంటున్నారు. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియదు గానీ చిన్నగా రాజుకున్న మంటలు అంతకంతకు పెద్దవై భారీ ఎత్తున అగ్ని కీలలు ఎగిసి పడ్డాయి. ప్రాంగణంలో ఉన్న జామాయిల్ చెట్ల వరకు మంటలు వ్యాపించాయి. నల్లటి పొగలు ఆ ప్రాంతాన్ని చుట్టూ ముట్టాయి. ఫైర్ సర్వీస్ అధికారులు సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని మంటలను ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిమాపక యంత్రాలు పనిచేసినప్పటికీ రాత్రి వరకు మంటలు అదుపులోకి రాలేదు. ప్రహరీ గోడ బయట వైపు ఉన్న చెట్లు, కంపలు కూడా మంటలకు ఆహుతి అయ్యే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.

# దుర్గమ్మ ఆలయంలో వేదోక్తంగా సూర్యఉపాసన



**ఇంద్రకీలాద్రి, జులై 12 ప్రభాతవార్త:** ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం సూర్యోపాసన సేవ వేదోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం మరియు భక్తుల క్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులందరూ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు అరుణ పారాయణం, మహా సౌర పారాయణం, సూర్య అష్టోత్తర శతనామావళిని పఠిస్తూ సూర్య భగవానుడికి ప్రత్యేక అర్చనలు చేశారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్లకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు.

సూర్యోపాసన అనంతరం కనకదుర్గమ్మ వారికి ప్రత్యేక హారతులు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర్యోపాసన వంటి ఆర్జిత సేవల్లో పాల్గొనాలనుకునే భక్తులు ముందస్తుగా అధికారిక మనమిత్ర వాట్సాప్ సేవలు ద్వారా లేదా దేవస్థానం కౌంటర్ల వద్ద టికెట్లు పొందవచ్చునని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు.

**భక్తుల విరాళం:** దుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న ఉచిత ప్రసాదము పంపిణీ పథకమునకు తిరుపతి జిల్లా పనగలూరుకు చెందిన జి.సుబ్రహ్మణ్యం రెడ్డి తమ కుటుంబీకులతో కలిసి రు.1,00,116ల విరాళాన్ని ఆదివారం ఆలయ డిఇఓ కిషోర్‌కుమార్‌కు అందించారు. మచిలీపట్నంకు చెందిన సిహెచ్ శ్రీలలిత కుటుంబ సభ్యులతో కలసి నిత్యాన్నదాన పథకమునకు రూ.1,00,000లు ఆలయాధికారి డివివి సత్యనారాయణకు అందచేశారు. దాతలకు అమ్మవార్ల దర్శనం కల్పించి, దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం చేసి ప్రసాదము అమ్మవారి చిత్రపటము అందచేశారు.

**ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ:** దుర్గమ్మవారిని దర్శించుకోడానికి ఆదివారం సెలవురోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచే భక్తుల రాక విపరీతంగా పెరిగింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు డిఈవో కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది క్యూలైన్లు పర్యవేక్షణ చేయగా భక్తులకు కావలసిన అన్ని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సాధారణ భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించేందుకు అధికారులు ఉదయం 10.30 గంటల నుండి అంతరాలయ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నాం 3 గంటల వరకు అన్ని రకాల వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశారు. దీనివల్ల క్యూ లైన్లలోని సామాన్య భక్తులకు అమ్మవారి దర్శనం అత్యంత వేగంగా, సులభంగా లభించింది. ఆలయ పరిసరాల్లో నిరంతరాయంగా ఉచిత ప్రసాదం, అన్నదానం విరివిగా పంపిణీ చేశారు.

**భక్తుల సేవలో పాలకమండలి, అధికారులు:** మధ్యాహ్నాం 3 తర్వాత భక్తుల రద్దీ క్రమంగా తగ్గింది. ధర్మకర్తల మండలి సభ్యులతో స్వయంగా క్యూలైన్లలో పర్యటించి భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. భక్తులతో కలిసి ఉంటూ వారి అవసరాలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు సిబ్బందితో క్యూ లైన్లను క్రమబద్ధీకరించేం



దుకు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎప్పటికప్పుడు తగు ఆదేశాలు ఇస్తూ పాలకమండలి, అధికారుల సమన్వయం, కఠిన శ్రమ కారణంగా ఇంతటి భారీ రద్దీలోనూ భక్తులకు ఎక్కడా ఎటువంటి ఇబ్బంది కలగకుండా అమ్మ దర్శనం ప్రశాంతంగా జరిగింది.

**ఇంద్రకీలాద్రిపై వైభవంగా ధర్మపథం:** ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో భక్తులకు ఆధ్యాత్మిక భావనను పెంపొందించేలా నిర్వహిస్తున్న "ధర్మపథం" సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం జరిగిన నృత్య ప్రదర్శనలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విజయవాడకు చెందిన సత్యవాణి శిష్య బృందం అత్యంత ప్రతిభావంతంగా ఈ నృత్యార్చనను గావించారు. దుర్గమ్మ సన్నిధిలో శాస్త్రీయ నృత్య రీతులతో దేవతా మూర్తులను కీర్తిస్తూ చేసిన నృత్య ప్రదర్శనలు భక్తులను మంత్రముగ్ధులను చేశాయి. విఘ్నేశ్వరుని స్తుతిస్తూ చేసిన నర్తనగణపతం అమ్మవారి వైభవాన్ని చాటే అన్నపూర్ణే విశాలాక్షి, వచ్చెను అలమేలు మంగ, అన్నమయ్య సంకీర్తన ఒకపరి కొకపరి, నగుమోము, శివపంచాక్షరి, భో శంభో, పలుకే బంగారమాయెనా వంటి మొత్తం 12 విశిష్టమైన ఆధ్యాత్మిక అంశాలపై కళాకారులు అద్భుతంగా నృత్యం చేశారు. ప్రదర్శన ఇచ్చిన కళాకారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు.

**15 నుండి ఆషాఢమాస ఉత్సవాలు:** దుర్గమ్మవారిని తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తూ ఆషాఢమాసంలో భక్తులు ఆరాధించే ఆషాఢమాస ఉత్సవాలు ఈనెల 15 నుండి ఆగస్టు 12 వరకు నిర్వహిస్తామని ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ అమ్మవారికి ఆషాఢమాస సారెను పలు భక్తబృందాలు అందిస్తాయని, ఆషాఢమాస ఉత్సవాల్లో భక్తులు పాల్గొనాలన్నారు. దుర్గమ్మవారికి ఈనెల 15న మొదటి సారెను ఆలయ స్థానాచార్య విష్ణుబొట్ల శివప్రసాద్ నేతృత్వంలో అర్చకస్వాములు, పండితులు వైదిక బృందం సమర్పిస్తారన్నారు.

# షాబాద్ నిందితుని కోసం కొనసాగుతున్న గాలింపు

## షాద్‌నగర్ సమీపంలో నందిగామ వద్ద కారు స్వాధీనం

**హైదరాబాద్, జులై 12, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన షాబాద్‌లో ఆరు హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ కోసం పోలీసుల వేట కొనసాగుతోంది. తనపై పోక్సో కేసు పెట్టి జైలుకు పంపినందుకు శుక్రవారం అర్థరాత్రి సమయంలో బాలికతోపాటు ఆమె తల్లి, నానమ్మలను చంపిన నిందితుడు ఆ తరువాత తన భార్య సరితతోపాటు ఇద్దరు కొడుకులను కత్తితో పొడిచి హత్య చేయడం తెలిసిందే. ఈ ఘటన షాబాద్‌లో తీవ్రఉద్రిక్తతలకు దారితీయగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని శాంతిభద్రతలు అదుపు తప్పకుండా ఉండేందుకు అదనపు బలగాలను మొహరించారు. పోక్సో కేసులో నెలన్నరపాటు జైల్లో ఉండి శుక్రవారమే బెయిల్‌పై విడుదలైన రాజ్‌కుమార్ అనంతరం కారును సెల్ఫ్‌డ్రైవింగ్ పేరిట అద్దెకు తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం అదే కారులో అర్థరాత్రి వరకు బయట తిరిగి చిత్తుగా మద్యం సేవించాడు. అనంతరం పక్కాగా వ్యవహరించి మొదట తనపై ఫిర్యాదు చేసిన మైనర్ బాలికను, ఆమె తల్లి, నానమ్మలను చంపాడు. ఈ ముగ్గురిని చంపడంతో ఆ కుటుంబంలో మిగిలిన మానసిక దివ్యాంగురాలు అనాథగా మారింది. దీని తరువాత కొంతదూరంలో వున్న తన ఇంటికి వెళ్లి భార్య, ఇద్దరు పిల్లలను చంపి కారులో పారిపోయాడు. ఇతని కోసం శని వారం అంతా గాలించినా ప్రయోజనం కలగలేదు. ఆరుగురిని చంపిన తరు వాత తాను కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేశాడు. దీంతో అతను ఒకవేళ ఏదైనా రైలు కింద ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావించిన పోలీసులు ఆ దిశగా విచారణ చేబట్టగా సమీప ప్రాం తాల్లో గల రైలు పట్టాలపై ఎలాంటి మృతదేహం లభించలేదు. అటవీ ప్రాం తంలో ఏదైనా గుర్తుతెలియని శవం వుంటే వాకబు చేయాలని ఆయా ప్రాం తాల పోలీసులను కోరినా ఎక్కడా ఎలాంటి మృతదేహం కనపించలేదు. దీంతో నిందితుడు బతికే ఉన్నాడని, తప్పించుకుని పారిపోయాడని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అతని కోసం గాలింపు చేబట్టారు. హత్యల సందర్భంగా అతను వాడిన కారును షాద్‌నగర్ సమీపంలో గల నందిగామ వద్ద బెంగ ళూరు జాతీయ రహదారిపై తిమ్మాపూర్ రైల్వేస్టేషన్‌కు సమీపంలో ఉండగా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని షాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఇతన్ని పట్టుకునేందుకు 12 ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలో దించారు. నిందితుడి ఆచూకి చెప్పిన వారికి రెండు లక్షల రూపా యల రివార్డు ఇస్తామని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్‌జోషి ప్రకటించడం తెలిసిందే. మరోవైపు నిందితుడి ఫొటోను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు పంపి బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లలో గాలింపు చేబట్టారు. రాజ్‌కుమార్ శ్రీశైలంకు పారిపోయి ఉండవచ్చని అనుమానాలు రావడంతో అక్కడికి ఓ బృందాన్ని పంపారు. హత్యలకు ముందు ఇతను వాడిన సెల్‌ఫోన్‌లోని సిమ్‌కార్డుల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇతని ఫోన్‌కాల్ డేటాను పరి శీలిస్తు న్నారు. ఈ కేసును కమిషనర్ తరుణ్ జోషితోపాటు చేవెళ్ల డిసిపి యోగేష్ గౌతం స్వయంగా విచారిస్తున్నారు.

## రాజ్‌కుమార్ చిక్కలేదు : చేవెళ్ల డిసిపి యోగేష్‌గౌతమ్

# పోలీసుల అదుపులో షాబాద్ నిందితుడు?

**చేవెళ్ల, జులై 12, ప్రభాతవార్త:** శనివారం రాత్రి షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల నిందితుడు రాజ్‌కుమార్‌ను ఆదివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు ప్రచారమవుతోంది. ఆరుగురి దారుణ హత్యల ఉదంతం తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ మారణ హోమానికి ఒడిగట్టిన ప్రధాన నిందితుడు రాజ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కొత్తూరు మండలం కుమ్మరిగూడెం గ్రామానికి చెందిన బండారు సుధాకర్ తాను నిందితుడు రాజకుమార్‌ను ప్రత్యక్షంగా చూశానని వెల్లడించారు. ప్రత్యక్ష సాక్షి బండారు సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే క్రమంలో కుమ్మరిగూడెం పరిసర ప్రాంతాల్లో తిరిగడని తెలిపారు. తాను రోడ్డుపై వెళ్తుండగా ఒక వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడని, పరిశీలించి చూడగా ఆరుగురిని చంపిన కిరాతకుడు రాజ్‌కుమార్ కావడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని బండారు సుధాకర్ తెలిపారు.. ఇంత దారుణానికి ఒడిగట్టి కూడా ఎలాంటి భయం లేకుండా తిరుగుతున్న అతడినిచూసి ఏం చేయాలో తెలియలేదని సుధాకర్ వెంటనే క్షణాల వ్యవధిలో చుట్టుముట్టిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకున్నారు. వ్యూహాత్మకంగా వ్యవహరించిన పోలీసులు నిందితుడు రాజ్‌కుమార్ తప్పించుకునే అవకాశం ఇవ్వకుండా చుట్టుముట్టారని చెప్పారు. నిందితుడి కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు క్షణాల వ్యవధిలోనే రంగంలోకి దిగి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ పోలీసులకు చిక్కాడంటూ జరుగుతున్న ప్రచారంపై చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతం స్పందించారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ షాబాద్ ఆరు హత్యల కేసులో దర్యాప్తును వేగవంతం చేశామని తెలిఏపారు. నిందితుడి కోసం మొత్తం తొమ్మిది బృందాలతో గాలిస్తున్నామని. నిందితుడు చేగురు రైల్వే ట్రాక్ దాటి అడవి ప్రాంతంలోకి వెళ్లినట్లు అనుమానిస్తున్నామన్నారు. రాజ్‌కుమార్ తన మొబైల్ ఫోన్‌ను శుక్రవారం రాత్రి 11:47 స్విచ్ ఆఫ్ చేశాడు. అతడి కోసం రైల్వే పోలీస్, ట్రాకింగ్ టీమ్, హ్యూమన్ ఇన్వెస్టిగేషన్, టెక్నికల్ టీమ్స్‌తో 9 బృందాలు గాలిస్తున్నాయి. రాజ్ కుమార్ పోలీసులకు చిక్కినట్టు మీడియాలో వస్తున్న విషయం వాస్తవం కాదని స్పష్టం చేశారు.



## అమెరికాలో గూగుల్ సీనియర్ టెక్నాలజీ అధికారిణి హత్య

**అట్లాంటా, జులై 12:** అమెరికాలో భారత మూలాలున్న గూగుల్ సీనియర్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ షీతల్ వ్రెజ్సియన్ (57)ను ఆమె భర్త కాల్చిచంపాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన ఈ కాల్పుల ఘటనలో వారి కుమారుడు జాసన్ వ్రెజ్సియన్ కూడా గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అట్లాంటా సమీపంలోని కాబ్ కౌంటీలో ఈ ఘటన చోటుచేసుకుంది. నిందితుడు కిర్క్ బి. వ్రెజ్సియన్ (56)ను పోలీసులు మంగళవారం రాత్రి నివాసంలోనే అరెస్ట్ చేశారు. ప్రస్తుతం అతడిని కాబ్ కౌంటీ అడల్ట్ డిటెన్షన్ సెంటర్‌లో బెయిల్ లేకుండా నిర్బంధించారు. ఈ ఘటన కుటుంబ హింసకు సంబంధించినదిగా పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు కొనసాగుతోందని, ప్రస్తుతం మరెవరిని అరెస్ట్ చేయలేదని తెలిపారు.

# 'బలవంతపు భూసేకరణ తగదు'

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రైతులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండించిన సిపిఐ(యం) రైతులకు న్యాయంగా నష్టపరిహారం ఇవ్వాలి రాజధాని అమరావతిలోని ఉండవల్లిలో రెండున్నర ఎకరాలకు పైగా రైతుల భూమిని దౌర్జన్యంగా సేకరించడాన్ని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. వారంతా పేద రైతులు. భూమి తప్ప మరో దిక్కు లేదు. హైకోర్టు ఆర్డర్‌పై రైతులతో సామరస్యంగా చర్చలు జరిపి వారికి న్యాయంగా నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నది. పంటలను ధ్వంసం చేసి, రైతులపై దౌర్జన్యం చేసిన, మహిళలని చూడకుండా అవమాన కరంగా మాట్లాడిన, పోలీసు, రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది. ఉండవల్లిలో ఎకరం భూమి ఐదు నుండి ఏడు కోట్ల రూపాయలకు పైగా ఉండగా, ఎకరం విలువ కోటి 18 లక్షలుగా లెక్క గట్టి, రెండు కోట్ల 62 లక్షల రూపాయలకు అవార్డు ఇచ్చి, ఆగ మేఘాల మీద దౌర్జన్యంగా భూములు లాక్కోవటం అక్రమం. మహిళలతో సహా రైతులను నిర్బంధించి, చేతికొచ్చిన పంటను నాశనం చేసి బుల్డోజర్లతో అప్పటికప్పుడే రోడ్డు వేయడానికి ప్రయత్నించటం అన్యాయం. ప్రభుత్వం, సిఆర్‌డిఏ రైతులతో చర్చలు జరిపి న్యాయమైన పరిహారాన్ని రైతులకు చెల్లించి భూములు స్వాధీనం చేసుకుని రోడ్డు వేసుకోవటానికి అవకాశం ఉన్నప్పటికీ, దౌర్జన్య పూర్వకంగా వ్యవహరించడం గర్హనీయం. ఇప్పటికైనా రైతులతో చర్చలు జరిపి, వారికి మార్కెట్ విలువకు అనుగుణంగా న్యాయమైన పరిహారం చెల్లించాలి.

# చెరువులో పడి బాలుడు మృతి

## త్రిపురాంతకం మండలం గొల్లపల్లిలో విషాద ఛాయలు



**త్రిపురాంతకం, జులై 12 ప్రభాతవార్త:** మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. సరదాగా చెరువుకట్టపై విహారిస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి సమ్మర్ స్టోరేజ్ (చెర్వు)లో పడి ఓ బాలుడు మృతి చెందాడు. ఈ ఘటనతో ఆగ్రహానికి గురైన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.

మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉప్పలపాటి పిచ్చయ్య, జ్యోతి కుమారుడు తిరుమల బాబు (15) స్థానిక చెరువులో పడగా, చెరువు లోతుగా ఉండటం వలన నీటిలో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే చెరువులోకి దిగి బాలుడిని బయటకు తీసినప్పటికీ అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. బాలుడి మృతితో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. దీంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వినుకొండ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసన సభ చీఫ్ విప్, వినుకొండ నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే జివి ఆంజినేయులు సంఘటన స్థలం వద్ద ఆగి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడి బంధువులకు అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కలెక్టర్‌కు విషయం తెలిపి ప్రభుత్వం పరంగా ఆ కుటుంబానికి సహాయం చేస్తానని వారితో చెప్పి సంఘటన స్థలం నుండి వెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# కురుబలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి

- కర్ణాటక మాజీ మంత్రి రేవన్న
- జబ్బల శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని సమావేశ తీర్మానం

**తిరుపతి(హెల్త్), జూలై 12, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కురుబ కురుమ కురుబన్ కురువం అండ్ దంగల్ సంఘం ఆత్మీయ సమావేశం స్థానిక లీలా మహల్ సర్కిల్లోని సాయి ఎంజీఎం గార్డెన్‌లో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా కర్ణాటక మాజీ ఎమ్మెల్సీ, మాజీ మంత్రి, ఐదు సూత్రల ఛైర్మన్ హెచ్‌ఎం రేవన్న, మహారాష్ట్ర రాజ్యసభ నూతన ఎంపీ రామ్ రావ్ జాఖరన్, కర్ణాటక, తెలంగాణ, నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రేవన్న మాట్లాడుతూ ఇంత వరకు ఆంధ్రప్రదేశ్లో ఎమ్మెల్సీలుగా కురుబలకు అవకాశం ఇవ్వలేదని, ఈ సారి తప్పకుండా రెండు ఎమ్మెల్సీలు, నామినేటెడ్ పోస్టులు, స్థానిక సంస్థల ఎన్నికలలో తగిన ప్రాతినిధ్యం కల్పించాలని, తిరుపతి పట్టణంలో ఐదు ఎకరాల భూమి, 5 కోట్ల నిధులు మంజూరు చేయాలని, కనక మండపం కనక హాస్టల్ మరియు కనక భవనం నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. కురుబ కులం కోసం పోరాడుతున్న సౌత్ ఇండియా కురుబ సంఘం మరియు ఓబిసి సౌత్ ఇండియా అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులుకి ఎమ్మెల్సీ పదవి కేటాయింపు కోసం సభ మొత్తం ఏకవాక్య తీర్మానం చేశారు.

జబ్బల శ్రీనివాసులకి ఎమ్మెల్సీ కేటాయింపుపై తొందరలోనే సౌత్ ఇండియా కురుబ సంఘం నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని, టిడిపి జాతీయ




వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌ని కలిసి విన్నవించనున్నారని తెలిపారు.

మహారాష్ట్ర ఎంపీ రామారావ్ మాట్లాడుతూ బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నవీన్‌ని, హోం మంత్రి అమిత్ షాని కలిసి ఎమ్మెల్సీగా జబ్బల శ్రీనివాసులుకి అవకాశం కల్పించాలని విన్నవించు నున్నానని తెలిపారు. సౌత్ ఇండియా కురుబ సంఘం అధ్యక్షులు జెబ్బల శ్రీనివాసులు మాట్లాడుతూ సౌత్ ఇండియా కురువ సంఘం ఆధ్వర్యంలో త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి కుప్పంలో ఇచ్చిన హామీ ప్రకారం రెండు ఎంఎల్సి స్థానాలు కేటాయించాలని, ప్రతి గుడిలోనూ మెంబెర్స్‌గా, డైరెక్టర్లుగా అవకాశాలు కల్పించాలని, స్థానిక సంస్థలలో రాజకీయ ప్రాముఖ్యత ఇవ్వాలని, అలాగే కురువులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని, కురుబల అభివృద్ధి కోసం నిత్యం శ్రామిస్తున్న జబ్బల శ్రీనివాసులకి ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని, తొందరలో నాయకులు అందరిని కలుపుకొని ముఖ్యమంత్రిని కలవనున్నారని తెలిపారు. అతిథులను సౌత్ ఇండియా కురువ సంఘం అధ్యక్షులు జబ్బల శ్రీనివాసులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కర్ణాటకకు చెందిన షెఫర్డ్ ఇంటర్నేషనల్ సీఎం నాగరాజా, కర్ణాటక కురుబ సంఘం శ్రీకాంత్, తమిళనాడు కురువ సంఘం నారాయణ, తెలంగాణ కురుమ సంఘం వెంకట్, గోవా దంగల్ సమాజం కట్టన్న,సౌత్ ఇండియా ఉపాధ్యక్షులు కొల్లే రెడ్డి కుమార్ గౌడ్, కోటే రవిశంకర్, గుంటూరుకు చెందిన పరమేష్, ధనుంజయ్, సుబ్బయ్య, ఉమ్మడి చిత్తూరు జిల్లా కురుబ సంఘం మహిళా నాయకురాలు కొల్లే భాగ్యలక్ష్మి, లక్ష్మిదేవి, రాజకుమారి, మీనాక్షి, కామాక్షి, తదితరులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

**నెల్లూరు క్రైమ్, జులై 12, ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలం, ఆకుతోట సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. అతివేగంగా దూసుకొచ్చిన కారు, ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనపై నెల్లూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు తెలిపిన వివరాల మేరకు, నెల్లూరు సిటీ, జెండా వీధికి చెందిన షేక్ నవాజ్ (34) తన ద్విచక్ర వాహనంపై ఆదివారం తెల్లవారుజామున ఆసుపత్రిలో ఉన్న తన బిడ్డను చూసేందుకు బయలుదేరారు. అదే సమయంలో, నవాజ్ సోదరుడు షేక్ పర్వేజ్ తన స్నేహితుడితో కలిసి మరో మోటార్ సైకిల్ పై వెనుక వస్తున్నారు. ఆకుతోటలోని పిఎస్‌ఆర్ కల్యాణ మండపం, రాక్స్ బ్రూవరీ కిచెన్ ఎదురుగా, నెల్లూరు ముత్తుకూరు రోడ్డుపై నవాజ్ వెళ్తుండగా నెల్లూరు - ముత్తుకూరు వైపు నుండి అతివేగంగా, అజాగ్రత్తగా దూసుకొచ్చిన కారు నవాజ్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నవాజ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యలోనే మరణించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. సమాచారం అందుకున్న నెల్లూరు రూరల్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మృతుడి సోదరుడు షేక్ పర్వేజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

## రాష్ట్రస్థాయి వైద్య విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్

# విజేతగా శ్రీవెంకటేశ్వర వైద్య కళాశాల విద్యార్థుల జట్టు

**తిరుపతి హెల్త్, జులై 12, ప్రభాతవార్త:** డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి చంద్రశేఖర్, ఎస్వీ వైద్య కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్లను ఈ నెల 7న ప్రారంభించినారు. ఐదు రోజులుగా కొనసాగిన ఈ హోరాహూరిగా రాష్ట్రస్థాయి వైద్యకళాశాలలు, దంత కళాశాలలు, వైద్య విద్యార్థులు ఈ క్రికెట్ టోర్నమెంట్లో పాల్గొన్నారు. దాదాపు 48 జట్లు తిరుపతిలోని నాలుగు క్రికెట్ మైదానంలో క్రికెట్ క్రీడలు నిర్వహించిన, అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపాల్ డాక్టర్ జి రవి ప్రభు, ఈ క్రికెట్ మ్యాచ్లు ఆయన పర్యవేక్షణలో నిర్వహించారు. శనివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్ కర్నూల్ వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు, ఎస్వీ వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు హోరా హోరీగా జరిగిన మ్యాచ్ సాయంత్రం 6:30 గంటలకు ముగిసిన టోర్నమెంట్ మ్యాచ్, ఎస్వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ఫైనల్ విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రర్ డాక్టర్ టి.సాయి సుధీర్ మాట్లాడుతూ వైద్య విద్యార్థులకి ఇదొక ఆటవిడుపుగా ఉండాలే కాని, ఓడిన వారు గెలిచిన వారిని వేరువేరుగా చూడకూడదు ఇది డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విజేతలుగా నిర్ణయించుకోవాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు వైద్య విద్య సంచాలకులు, డాక్టర్ జి రవి ప్రభు మాట్లాడుతూ ఫైనల్ విజేతగా నిలిచిన ఎస్వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులకు కప్పులు, ప్రశంస పత్రాలు, గోల్డ్ మెడల్స్ అందించి, వారిని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్యం విశ్వావిద్యాలం రిజిస్టర్ డాక్టర్ టి. సాయి సుధీర్ ద్వారా వైద్య విద్యార్థులను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసారు. రుయా ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ బి మనోహార్, డాక్టర్ తులసి రామ్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ వెంకట రమణ, డాక్టర్ రోజా రమణి, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్రీడల విభాగం డాక్టర్ త్రిమూర్తులు, డాక్టర్ శరవణ, ఎస్ వి వైద్య కళాశాల వైద్య విద్యార్థులు, పిఆర్ఓ వీర కిరణ్ పాల్గొన్నారు.

13-7Pg5.qxd:13-7Pg5.qxd 1/1/02 6:11 AM Page 1



# హార్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత



## గల్ఫ్ దేశాలలోని అమెరికా బేస్‌లపై ఇరాన్ దాడులు

### పశ్చిమాసియాలో మళ్లీ వార్ ఉధృతం

**టెహ్రాన్,జులై 12:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరాయి. హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడికి ప్రతీకారంగా, తెల్లవారు జామున అమెరికా సైన్యం ఇరాన్‌పై మరోసారి భీకర దాడులు జరిపింది. వారం వ్యవధిలో ఇరాన్‌పై అమెరికా దాడులకు దిగడం ఇది మూడోసారి కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అమెరికా సెంట్రల్ కమాండ్ వెల్లడించిన వివరాల ప్రకారం, తెల్లవారుజామున 5:45 గంటలకు ఇరాన్‌లోని పలు లక్ష్యాలపై అమెరికా బలగాలు దాడులు చేశాయి. అంతకు ముందు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ), హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న ఎమ్/వి జిఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై దాడి చేసింది. ఈ ఘటనలో నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతిని మంటలు చెలరేగాయి. ఒక సిబ్బంది కూడా అదృశ్యమయ్యాడు. వాణిజ్య నౌకలపై దాడులు చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేందుకే అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాల మేరకు ఈ దాడులు జరిపినట్లు సెంట్‌కామ్ స్పష్టం చేసింది. ఈ దాడులపై అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ ఇరాన్ తప్పుడు నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు దానికి తగిన మూల్యం చెల్లించుకుంటోందని తీవ్రంగా హెచ్చరించారు. అమెరికా దాడులకు కొన్ని గంటల ముందే ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన వాణిజ్య రవాణా మార్గమైన హార్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ ప్రాంతంలో అమెరికా జోక్యం ఆగిపోయే వరకు ఏ అంతర్జాతీయ నౌకను అనుమతించేది లేదని ఐఆర్‌జిసి నేవీ స్పష్టం చేసింది. దశాబ్దాలుగా ఇది అంతర్జాతీయ జలమార్గంగా ఉన్నప్పటికీ, తమ సార్వభౌమ ప్రాంతంగా పరిగణిస్తూ నౌకల నుంచి పన్నులు వసూలు చేస్తామని ఇరాన్ వాదిస్తోంది. అమెరికా దాడుల తర్వాత ఇరాన్‌లోని ఖేష్మ్ ద్వీపం, బందర్ అబ్బాస్, సిరిక్‌లలో భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామాలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పందిస్తూ, అమెరికానే తమ మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఇరాన్‌చమురు అమ్ముకోవ డానికి ఇచ్చిన మినహాయింపులను అమెరికా ఏకపక్షంగా రద్దు చేయడమే దీనికి కారణమన్నారు. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ దాడులకు పాల్పడటం వల్లే చమురు మినహాయింపులు రద్దు చేశామని అమెరికా వాదిస్తోంది. ఈ పరస్పర దాడులు, ఆరోపణలతో పశ్చిమాసి యాలో యుద్ధ వాతావరణం మరింతగా ముది రింది. మరోపక్క ఇరాన్‌కూడా గల్ఫ్‌దేశాల్లోని అమెరికా స్థావరాలపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తోంది. ఈ దాడులతో ఇపుడు గల్ఫ్‌దేశాల్లోకూడా కలవరం వ్యక్తం అవుతోంది.



## 23న జనం మధ్యకు ఖమేనీ!

### తండ్రి స్మారక కార్యక్రమంలో పాల్గొనే అవకాశం

**టెహ్రాన్,జులై 12:** ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఎట్టకేలకు ప్రజల ముందుకు రానున్నారు. తన తండ్రి, దివంగత సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్మారకార్థం ఈనెల 23న టెహ్రాన్‌లో నిర్వహించనున్న కార్యక్రమంలో ఆయన పాల్గొంటారని అధికారిక వర్గాలు వెల్లడించాయి. సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొజ్తబా బహిరంగంగా కనిపించనుండటం ఇదే తొలిసారి కావడంతో ఈ పరిణామంపై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తి నెలకొంది. టెహ్రాన్‌లో సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమానికి దేశంలోని కీలక నేతలు హాజరుకానున్నారు. ఈ యేడాది ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఈ సంఘటన తర్వాత ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. తండ్రి మరణా నంతరం మొజ్తబా ఖమేనీని ఇరాన్ కొత్త సుప్రీంలీడర్‌గా ప్రకటించారు. అప్పటి నుంచి ఆయన అజ్ఞాతంలోనే ఉన్నారు. భద్రతా కారణాల రీత్యా ఆయన బయటకు రావడం లేదని అధికారులు తెలిపారు. ఇజ్రాయెల్ నుంచి హత్యకు గురయ్యే ప్రమాదం ఉందన్న ఆందోళనల నేపథ్యంలో ఆయన తనతండ్రి, భార్య అంత్య క్రియలకు సైతం హాజరుకాలేదు. ఇదే సమయంలో మొజ్తబా ఆరోగ్యంపై కూడా తీవ్రస్థాయిలో ఊహాగానాలు వ్యాపించాయి. ఫిబ్రవరి 28 దాడిలో ఆయన గాయపడ్డారని, చికిత్స తీసుకుంటున్నారని వార్తలు వచ్చాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం ఆయన ఆరోగ్యంపై సందేహాలు వ్యక్తం చేశారు. దాడుల్లో ఆయన ముఖం రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని అన్నారు. అయితే, ఈ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. మొజ్తబా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని స్పష్టం చేస్తూ, ఇరానియన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఇటీవల ఆయన కొత్త ఫోటోను కూడా విడుదల చేసింది.

## దాడులు ఆపకపోతే తీవ్ర పరిణామాలు

### ఇరాన్‌ను హెచ్చరించిన అమెరికా



**వాషింగ్టన్,జులై 12:** హార్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులను వెంటనే నిలిపివేయా లని, లేకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్‌ను అమెరికా హెచ్చరించింది. హార్మూజ్ జలసంధి అంతర్జాతీయ నౌకాయానానికి పూర్తిగా తెరిచి ఉంటుందని, వాణిజ్య నౌకలపై ఎలాంటి దాడులు జరగవని పేర్కొంటూ 24 గంటల్లోగా ఇరాన్ బహిరంగ ప్రకటన చేయాలని వాషింగ్టన్ స్పష్టం చేసినట్లు సమాచారం. గడువులోగా చెప్పినట్లు చేయకుంటే తీవ్రమైన సైనిక, ఆర్థిక చర్యలు తీసుకుంటామని అమెరికా హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ హెచ్చరికను మధ్యవర్తుల ద్వారా ఇరాన్‌కు అమెరికా చేరవేసినట్లు సమాచారం. నౌకలపై కాల్పులు ఆపేస్తామని బహిరంగంగా చెప్పాలి. అలాగే తాము తప్పు చేశామని వాళ్లు కనీసం పరోక్షంగానైనా అంగీకరించాలని మేము కోరుకుంటున్నాం. కాల్పులు ఆపేస్తామనేదే రేపు వారి ప్రకటన కావాలని, లేకపోతే వారికి అది మంచి రోజు కాబోదని అమెరికా అధికారి హెచ్చరించినట్లు తెలుస్తోంది. ఈ ఉద్రిక్త పరిస్థితుల మధ్య ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ఒమాన్‌లో మధ్యవర్తిత్వ చర్చల్లో పాల్గొననున్నారు. ఈ సమావేశం అనంతరం ఇరాన్ అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉందని అమెరికా అధికారులు భావిస్తున్నారు. అయితే గడువులోగా స్పష్టమైన హామీ రాకపోతే పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



## ముగిసిన 3 దేశాల ప్రధాని మోడీ పర్యటన

### ఇండొనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాధినేతలతో ద్వైపాక్షిక చర్చలు, పలు కీలక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, జులై 12:** ప్రధాని మోడీ ఇండోనేసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో తన ఆరు రోజుల విజయవంతమైన పర్యటనను ముగించుకుని న్యూఢిల్లీకి తిరిగి వచ్చారు. తన మూడు దేశాల పర్యటనలో భాగంగా తొలి అంచెలో మోడీ ఇండోనేసియాలో పర్యటించారు. ఈ పర్యటన సందర్భంగా, ఇండోనేషియాలో, ప్రధాని మోడీ సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటోతో చర్చలు జరిపారు. ఈ పర్యటన సందర్భంగా, ప్రధాన మంత్రి మోడీకి ఇండోనేసియా అత్యున్నత పౌర పురస్కారం 'బింటాంగ్ ఆదిపూర్ణను ప్రదానం చేశారు. ఉమ్మడి సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతూ, పునరుద్ధరించిన ప్రంబనన్ ఆలయాన్ని సంయుక్తంగా ప్రారంభించారు.

ఆ తర్వాత ప్రధాని మోడీ ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌కు వెళ్లారు, అక్కడ నిర్వహించిన మూడవ వార్షిక భారత్-ఆస్ట్రేలియా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌ను మోడీ కలిశారు. ఈ పర్యటన సందర్భంగా, ఆస్ట్రేలియన్ సూపర్ సంస్థ భారతదేశ జాతీయ పెట్టుబడి, మౌలిక సదుపాయాల నిధికి ఐదు వందల మిలియన్ల ఆస్ట్రేలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది. ఈ పర్యటన "బంధాలను మరింత బలపరిచి, భాగస్వామ్యాలను పటిష్టం చేసి, ఉమ్మడి భవిష్యత్తుకు రూపునిచ్చింది" అని, వాణిజ్యం, భద్రత, సాంకేతికత, ప్రాంతీయ సహకారం వంటి రంగాలలో గణనీయమైన ఫలితాలు సాధించిందని విదేశాంగ మంత్రిత్వశాఖ అభివర్ణించింది. అనంతరం ప్రధాని మోడీ ఆక్లాండ్‌ను సందర్శించారు. ఈ పర్యటన సందర్భంగా, భారత, న్యూజిలాండ్ వాణిజ్యం, రక్షణ, సాంకేతికత, విద్య, ఆవిష్కరణలు, పర్యాటకం, ప్రజల మధ్య సంబంధాలపై దృష్టి సారిస్తూ 'రోడ్‌మ్యాప్ టు 2030ని ఆమోదించాయి. రక్షణ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, విపత్తు నిర్వహణ, వ్యవసాయం, పర్యాటకం, ఆహార సాంకేతికత, స్వచ్ఛఇంధనం రంగాలను కవర్‌చేస్తూ ఇరు దేశాలు 18 ఒప్పందాలను ప్రకటించాయి. ఈ ఏడాది ప్రారంభంలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో, 2030 నాటికి ద్వైపాకిక వాణిజ్యాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు.

## జమ్ము కాశ్మీర్‌లో బిజెపి ఆపరేషన్ లోటస్

### ఒక్కో ఎన్సీ ఎమ్మెల్యేకు 30 కోట్ల నగదు ఆఫర్

**శ్రీనగర్,జులై 12:** జమ్మూకశ్మీర్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఆపరేషన్ లోటస్‌కు తెరలేపిందని, తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ఆరోపణలు చేశారు. శ్రీనగర్‌లోని హజ్రత్‌బాల్‌లో జరిగిన ఓ బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ బిజెపికి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేక పోయారు. రూ.100 కోట్లుఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా



భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బిజెపి చూస్తోందని తీవ్రంగా విమర్శించారు. ఒమర్ ఆరోపణలను బిజెపి జమ్మూకశ్మీర్ సీనియర్ నేత రవీందర్ రైనా ఖండించారు. ఈ వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని, భ్రమ కలిగించేలా ఉన్నాయని కొట్టిపారేశారు.

కేంద్రం నిధులు ఇవ్వకపోతే ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేమని కొద్దిరోజుల క్రితం స్వయంగా ముఖ్యమంత్రే అన్న విషయాన్ని రైనా గుర్తుచేశారు. ప్రస్తుతం 90 స్థానాలున్న అసెంబ్లీలో 41 మంది ఎమ్మెల్యేలతో నేషనల్ కాన్ఫరెన్స్ బలంగా ఉంది. కాంగ్రెస్ (6), స్వతంత్రులు (5), సిపిఎం (1) బయటి నుంచి మద్దతు ఇస్తుండటంతో ఒమర్ ప్రభుత్వానికి ఎలాంటి ప్రమాదం లేదు. మరోవైపు, జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై కేంద్రం అనుసరిస్తున్న వైఖరిని ఒమర్ అబ్దుల్లా తప్పుబట్టారు. "సరైనసమయం వచ్చినప్పుడు రాష్ట్ర హోదా ఇస్తామని కేంద్రం చెబుతోంది. ఆ సరైన సమయం ఎప్పుడు వస్తుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో, రాష్ట్ర హోదా కోసం ఈనెల 20న న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ప్రకటించారు. రాజకీయ విభేదాలను పక్కనపెట్టి, గులాం నబీ ఆజాద్ సహా ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధు లందరూ ఈ నిరసనలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఒమన్ తీరంలో సైప్రస్‌జెండా ఉన్న నౌకపై దాడి

### 11 మంది భారత సిబ్బందిలో పదిమంది సురక్షితం, ఒకరు గల్లంతు..

**సనా,జులై 12:** పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఒమన్ తీరంలోని హోర్ముజ్ జలసంధిలో సైప్రస్ జెండాతో ప్రయా ణిస్తున్న జిఎఫ్ఎస్ గెలాక్సీ అనే వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేసింది. ఈ ఘటనలో నౌకలో ఉన్న 11 మంది భారత సిబ్బందిలో ఒకరు గల్లంతయ్యా రని, మిగిలిన 10 మందిని సురక్షితంగా కాపాడా మని భారత విదేశాంగ శాఖ ధృవీకరించింది. దాడి తర్వాత నౌకలో మంటలు చెలరేగి భారీగా దెబ్బ తినడంతో సిబ్బంది ప్రాణాలతో బయటపడేందుకు నౌకను విడిచిపెట్టినట్లు తెలుస్తోంది.

ఈ దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండిం చింది. ఒమన్ తీరంలో జిఎఫ్ఎస్ గెలాక్సీ వాణిజ్య నౌకపై జరిగిన దాడిని ఖండిస్తున్నాం. నౌకలోని 11 మంది భారతీయులలో 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. గల్లంతైన భారతీయుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుం టోందని తెలిపింది. ఈ ప్రాంతంలో వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరమని, ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని భారత్ పిలుపునిచ్చింది. గల్ఫ్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం జరుగుతున్న చర్చలను ముగించి, దౌత్య పరమైన పరిష్కారం కనుగొనాలని భారత్ సూచించింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం వాణిజ్య నౌకలు, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోరాదని, అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, రవాణాకు ఎలాంటి ఆటంకాలు ఉండరాదని స్పష్టం చేసింది.

మరోవైపు నౌక అనధికార మార్గంలో ప్రయాణిం చడం వల్లే దారి మళ్లించే చర్యగా దాడి చేశామని ఇరాన్ తన చర్యను సమర్థించుకుంది. ఈ ఘటన తర్వాత హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. దీనికి



ప్రతిస్పందనగా, అమెరికా ఇరాన్‌పై కొత్తగా మూడుసార్లు దాడులు ప్రారంభించింది. నౌకపై దాడి తర్వాత ఒక సిబ్బంది గల్లంతైనట్లు, నౌక ప్రయాణాన్ని కొనసాగించలేని విధంగా దెబ్బతిన్నట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ ధ్రువీకరించింది. ఇప్పటికే పలు దాడులకు పాల్పడిన ఇరాన్‌కు మరో అవకాశం ఇచ్చినా నిబంధనలను ఉల్లంఘించింది. అందుకే, పౌర నావికులపై దాడి చేసే ఇరాన్ సామర్థ్యాన్ని దెబ్బతీసేలా భారీ మూల్యం చెల్లించేలా చేస్తున్నా మని యూఎస్ సెంట్రల్ కమాండ్ హెచ్చరించింది. ఇరాన్, ఒమన్ విదేశాంగ మంత్రులు సమావేశమైన మరుసటి రోజే ఈ దాడి జరగడం, ఇరుపక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు పెరగడం మధ్యప్రాచ్యంలో శాంతి ప్రయత్నాలకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది.

## సంక్షిప్త వార్తలు

### రష్యాకు షాక్.. సిజ్రాన్ రిఫైనరీపై ఉక్రెయిన్ మెరుపుదాడి




**కీవ్, జులై 12:** రష్యాకు ఉక్రెయిన్ మరో షాక్ ఇచ్చింది. సమర రీజియన్‌లోని సిజ్రాన్ చమురుశుద్ధి కర్మాగారంపై కీవ్ డ్రోన్లు మెరుపు దాడి చేశాయి. దీంతో ఆయిల్ రిఫైనరీకి భారీ నష్టం వాటిల్లింది. ఈ నెల 11,12 తేదీల మధ్యలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి. ఈ విషయాన్ని ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఈ రిఫైనరీ యేటా 8.5 మిలియన్ మెట్రిక్ టన్నుల చమురును ప్రాసెస్ చేయగలదు. ఇక్కడి నుంచి సమర రీజియన్‌కు అవసరమైన పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ ఫ్యూయల్ వెళతాయి. వీటిని రష్యా సైనిక దళాలు కూడా వినియోగిస్తాయి. దీనిని రోస్‌నెఫ్ట్ కార్పొరేషన్ నిర్వహిస్తోంది. తాజా దాడితో ఇక్కడ కార్యకలాపాలను నిలిపివేశారు.

### బావిలో విషవాయువులు లీక్.. ఐదుగురు దుర్మరణం

**షిల్లాంగ్, జులై 12:** మేఘాలయ రాజధాని షిల్లాంగ్‌లో ఓ విషాద ఘటన చోటుచేసుకుంది. ఒక ప్రైవేట్ నిర్మాణ స్థలంలోని ఓ బావిలో విషవాయువుతో ఐదుగురు మృతి చెందారు. తూర్పు ఖాసీ హిల్స్ జిల్లా పోలీసు అధిపతి వివేక్ సియెమ్ తెలిపిన వివరాల ప్రకారం.. లాపాలాంగ్ ప్రాంతంలోని ప్రైవేట్ స్థలంలో ఉన్న బావిలో నలుగురు కూలీలు నీళ్లు తోడుతున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ప్రమాదం సంభవించింది. బావిలో ఉన్న జనరేటర్ నుంచి విషపూరిత వాయువు వెలువడింది. ఈ విషవాయువు కారణంగా వారికి ఊపిరాడక అక్కడే కుప్పకూలారు.

### అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం కన్నుమూత



**వాషింగ్టన్, జులై 12:** అమెరికా సెనెటర్, ట్రంప్ సన్నిహితుడు లిండ్సే గ్రాహం (71) కన్నుమూశారని ఆయన కార్యాలయం వెల్లడించింది. ఇటీవల ఆయన అనార్యోగానికి గురై చికిత్స తీసుకుంటుండగా శనివారం సాయంత్రం స్వగృహంలో ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపింది. అయితే ఆయన అనారోగ్యానికి కారణాలు వెల్లడించలేదు. 2003 నుంచి యుఎస్ సెనేట్‌లో సౌత్ కరోలినాకు ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. జాతీయ భద్రత, విదేశాంగ విధాన చర్చలు వంటి వాటిలో చురుకుగా వ్యవహరిస్తూ.. దేశంలోని కీలక నేతల్లో ఒకరిగా పేరు పొందారు. అమెరికాకు చెందిన అనేక కీలక అంశాల్లో ట్రంప్‌కు బలమైన మద్దతుదారుగా వ్యవహరించారు. ఇటీవల అమెరికా-ఇరాన్ మధ్య పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన సమయంలోనూ ఇస్లామాబాద్‌పై లిండ్సే గ్రాహం తీవ్ర విమర్శలు చేశారు.

### అమర్‌నాథ్ యాత్రీకుల బస్సు బోల్తా, 16 మందికి గాయాలు

**సిమ్లా,జులై 12:** అమర్‌నాథ్ యాత్రికులతో వెళ్తున్న బస్సు బోల్తా పడటంతో 16 మంది గాయాలపాల య్యారు. వారిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లాలో చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో మొత్తం 57 మంది ప్రయాణికులు ఉన్నట్లు తెలుస్తోంది. జమ్మూ నుంచి డెహ్రాడూన్‌కు వెళ్లేందుకు యాత్రికులు ఈ ప్రైవేట్ బస్సును అద్దెకు తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

### ఇండోర్‌లో కళాశాల విద్యార్థిని ఆత్మహత్య

**ఇండోర్,జులై 12:** మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ కళాశాల విద్యార్థిని తాను అద్దెకు ఉంటున్న గదిలో ఆత్మహత్యకు పాల్పడింది. చనిపోయే ముందు ఆమె తన గది గోడపై చాక్‌పీస్‌తో రాసిన సూసైడ్ నోట్ సంచలనం రేపుతోంది. తన చావుకు తన తండ్రి, నానమ్మే కారణమని అందులో పేర్కొనడం కలకలం సృష్టిస్తోంది. పోలీసుల వివరాల ప్రకారం బాధితురాలిని రాజ్‌గఢ్ జిల్లాకు చెందిన వైష్ణవి బనావడే (20)గా గుర్తించారు. ఆమె ఇండోర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. చదువు నిమిత్తం ఎంఐజీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో అద్దె గదిలో ఒంటరిగా ఉంటోంది. వైష్ణవి గత ఏడాదిగా ఓ యువకుడితో ప్రేమలో ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.

## వీసాగడువు ముగిసినా భారత్‌లోనే ఉన్న పాకిస్థానీయుల అరెస్టు

**బెంగళూరు,జులై 12:** కర్ణాటకలో గత 22 ఏళ్లుగా అక్రమంగా నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులైన తల్లి, కుమారుడిని పోలీసులు అరెస్టు చేశారు. చిక్కబళ్లాపూర్ జిల్లా బాగేపల్లి తాలూకాలో శనివారం ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. వీసా గడువు ముగిసినప్పటికీ దేశం విడిచి వెళ్లకుండా, నకిలీ పత్రాలు ద్వారా భారత ప్రభుత్వ గుర్తింపు కార్డులు పొందారనే ఆరోపణలపై వారిని అదుపులోకి తీసుకున్నారు. బాగేపల్లి సమీపంలోని దాసగరిపల్లి గ్రామంలో నివసిస్తున్న ఫర్హానాజ్ (52), ఆమె కుమారుడు మహమ్మద్ ఫర్దీన్ (21) రేషన్ కార్డు పొందడంతో పాటు ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేయించుకోవాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. వారు సమర్పించిన పత్రాలను పరిశీలించిన రెవెన్యూ అధికారులకు అనుమానం కలగడంతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈ విచారణలో వారు భారత పౌరసత్వంలేని పాకిస్థాన్ జాతీయులని నిర్ధారణ అయింది.వీసా గడువు ముగిసిన తర్వాతకూడా వారు పాకిస్థాన్‌కు తిరిగి వెళ్లకుండా, బెంగళూరు చిరునామాలను ఉపయోగించి నకిలీ ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు సృష్టించి బ్యాంకు ఖాతాలు కూడా పొందినట్లు అధికారులు గుర్తించారు.

## క్షిపణుల తయారీ ప్రైవేట్‌కు!

### రక్షణ మంత్రిత్వ శాఖ సన్నద్ధం, ఆస్ట్రా మార్క్ 2 క్షిపణిలకు బిడ్‌లు

### ఎగుమతులు పెంచడం, పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడమే లక్ష్యం

**న్యూఢిల్లీ, జులై 12:** తన రక్షణ ఉత్పత్తి విధానంలో అతిపెద్ద సంస్కరణలలో భాగంగా, క్షి పణి తయారీని ప్రైవేట్ కంపెనీలకు తెరవడానికి భారత్ సిద్ధమవుతోంది. రక్షణ పరిశోధన- అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) ఆస్ట్రా క్షి పణిని కొనుగోలు చేసేందుకు ఇండోనేషియా ఆసక్తి చూపడంతో, పెరుగుతున్న ఎగుమతి డిమాండ్‌ను తీర్చడానికి దేశీయ తయారీ సామర్థ్యాన్ని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయిం చింది. విమానాలు, డ్రోన్లు, ఫిరంగి, నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల వంటి రంగాలలో భారత్ ఇప్పటికే ప్రైవేట్ భాగస్వామ్యాన్ని అనుమతించినప్పటికీ, క్షి పణి తయారీ మాత్రం చాలా వరకు ప్రభుత్వ ఆధీనంలోని రక్షణ సంస్థల కిందనే ఉంది. రక్షణ మంత్రిత్వ శాఖ నివేదిక ప్రకారం, ఆస్ట్రా మార్క్ 2 బియాండ్ విజువల్ రేంజ్ (బివిఆర్) గగనతల నుంచి గగనతల క్షి పణిని తయారు చేయడానికి భారతీయ ప్రైవేట్ కంపెనీలను ఆహ్వానిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రతిపాదనల కోసం అభ్యర్థన (ఆర్‌ఎఫ్‌ఆర్) జారీ చేయనుంది. ఇందులో పాల్గొనే కంపెనీలలో ఐకామ్(ఐసిఒఎంఎం), అదానీ, భారత్ ఫోర్జ్, టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్ ఉన్నాయని భావిస్తున్నారు. భారత సాయుధ దళాల నుండి, అలాగే మిత్ర దేశాల నుండి పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఈ



నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ప్రస్తుతం ఈ డిమాండ్‌ను పూర్తిగా తీర్చలేకపోతోందని నివేదిక పేర్కొంది. డిఆర్‌డిఒ అభివృద్ధి చేసిన ఆస్ట్రా మార్క్ 2, 180-200 కిలోమీటర్ల దాడి పరిధిని కలిగి ఉంది. ఆపరేషన్ సింధూర్‌కు ముందు పాకిస్థాన్‌కు చైనా సరఫరా చేసిన పిఎల్-15ఇ దీర్ఘశ్రేణి గగనతల నుంచి గగనతల క్షిపణిని ఎదుర్కోవ డానికి దీనిని రూపొందించారు. ఈ క్షిపణిని తేజస్ మార్క్ 1ఎ, మిగ్29, ఎస్‌యు30 ఎంకెఐ, రఫేల్ మెరైన్ యుద్ధ విమానాలతో అనుసంధానించ నున్నట్లు భావిస్తున్నారు.

**తదుపరి ప్రళయ క్షిపణి:**

డిఆర్‌డిఒ వర్గాల కథనం ప్రకారం, అభివృద్ధి, తయారీ రెండింటికీ ప్రైవేట్ కంపెనీలకు తెరవబడే తదుపరి కిపణి వ్యవస్థ ప్రళయ వ్యూహాత్మక బాలిస్టిక్ క్షిపణి అయ్యే అవకాశం ఉంది. ప్రళయ క్షిపణి సుమారు 500 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. ఇది ధ్వని వేగం కంటే ఆరు రెట్లు వేగంతో ప్రయాణించగల రెండుదశల క్షిపణి. ఇది లాంగ్‌రేంజ్ ల్యాండ్ అటాక్ క్రూయిజ్ మిస్సైల్ (ఎల్ఆర్ ఎల్ఎసిఎం), తదుపరి తరం బ్రహ్మోస్ క్షిపణి, విస్తృతశ్రేణి పినాకా రాకెట్ వ్యవస్థతో పాటు భారత దేశపు సమీకృత రాకెట్ దళాలలో భాగంగా ఉంది.

**'ఆపరేషన్ సింధూర్ష్ రక్షణ ప్రాధాన్యతలతోనే:**

స్టాండ్‌ఆఫ్ ప్రెసిషన్ ఆయుధాల ప్రాముఖ్యత పెరుగుతోందని ఆపరేషన్ సింధూర్ నుండి నేర్చుకున్న పాఠాల నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని నివేదిక పేర్కొంది. నిరోధక శక్తిని బలోపేతం చేయడానికి భారతదేశపు క్షి పణి, రాకెట్ నిల్వలను వేగంగా విస్తరించడంపై, అదే సమయంలో క్షిపణి రక్షణ సామర్థ్యాలను పెంచ డంపై కేంద్రం ఇప్పుడు దృష్టి సారించింది. ఇటీవలి ఇరాన్-అమెరికా సంఘర్షణ కూడా క్షిపణులు, వాయు రక్షణ వ్యవస్థల వ్యూహాత్మక ప్రాముఖ్యతను బలపరిచిందని, కీలకమైన మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు ఎంత నష్టం కలిగించగలవో ఇది స్పష్టం చేసిందని నివేదిక పేర్కొంది.

13-7Pg6exHMNWJQE.qxd:13-7Pg6exHMNWJQE.qxd 1/1/02 6:13 AM Page 1



# మంగళం ఆర్టీసి డిపోను ప్రైవేట్‌కు కట్టబెట్టొద్దు

## • 500 మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడొద్దు



**తిరుపతి, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసిని, సంబంధించిన ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు పంచి పెడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ద్రోహం చేస్తున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి తీవ్రంగా విమర్శించారు. వందల కోట్ల విలువ చేసే 10 ఎకరాలపైనే ఉన్న మంగళం ఆర్టీసి డిపో భూములను పూణేకి చెందిన పినాకిల్ సంస్థకు కట్టబెట్టడం దారుణమని అన్నారు. 95 బస్సులు, 500 మందికి పైగా ఉద్యోగుల తో ఉన్న మంగళం డిపోను చెల్లా చెదురుచేసి బస్సులను, ఉద్యోగులను వివిధ డిపోలకు బదిలీ చేసి డిపోను 24 బస్సులకు పరిమితం చేశారని ఆరోపించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయలేదని రోజూ ప్రకటనలు చేస్తూనే, మొదటి దశలో 12 డిపోలు, రెండవ దశలో 19 డిపోలను ప్రైవేటుపరం చేయటానికి దశలవారీగా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని పేర్కొన్నారు. తిరుపతి మంగళం డిపోను ప్రైవేటుపరం చేస్తున్న మొదటి డిపోగా ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని 129 డిపోలను ఎలక్ట్రిక్ బస్సుల డిపోలుగా మార్చాలని, ఈ బస్సులన్నిటిని పూణేకి చెందిన పినాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ కంపెనీ ద్వారా నడిపించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నదని వివరించారు. ఒక్కో బస్సుకు కేంద్ర ప్రభుత్వం రూ.35 లక్షలు సబ్సిడీని అందిస్తున్నదని ఆ సబ్సిడీ తీసుకొని రాష్ట్ర ప్రభుత్వమే బస్సులను కొనుగోలు చేసి నడపాల్సింది పోయి, పినాకిల్ సంస్థకు ఆర్టీసీని అప్పజెప్పడమే కాకుండా ఇష్టారీతిన అద్దె ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం ఆర్టీసీకి కిలోమీటర్‌కు రూ.45ల ఆదాయం వస్తుండగా పూణే సంస్థతో 12 మీటర్ల బస్సును కిలో మీటర్‌కు రూ..72.55లకు 9 మీటర్ల బస్సును కిలో మీటర్‌కు రూ.62.17లకు ఒప్పందాలు చేసుకున్నారని మండిపడ్డారు. ఈ కారణంగా రానున్న కాలంలో ఆర్టీసీ తీవ్రంగా నష్టపోతుందని, సంస్థ అదృశ్యమయ్యే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వెలిబుచ్చారు. చార్జింగ్ పాయింట్లు ఏర్పాటు చేయటానికి ప్రభుత్వ డిపోను కొట్టివేసి కొత్త నిర్మాణాలు ఆర్టీసీ చేపట్టిందని ఓ ప్రైవేటు సంస్థ కొరకు ప్రభుత్వం ప్రజల ఆస్తులను ధ్వంసం చేసే అధికారం ఎవరిచ్చారని కందారపు మురళి ప్రశ్నించారు. మంగళం డిపోను ప్రైవేటు సంస్థకు అప్పజెప్పే చర్యలను మానుకోకుంటే పెద్ద ఎత్తున నిరసనను వ్యక్తం చేయాల్సి వస్తుందని కందారపు మురళి హెచ్చరించారు.

## వియత్నాం ఘటనపై జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వియత్నాంలోని హాలాంగ్ బే వద్ద జరిగిన ఘోర బోటు ప్రమాదంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు పర్యాటకులు దుర్మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ విచారం వ్యక్తం చేశారు. వియత్నాం పర్యటనకు వెళ్లిన భారతీయ పర్యాటకుల బృందం ప్రయాణిస్తున్న బోటు ప్రమాదానికి గురికావడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. వియత్నాంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వారుండటం మరింత బాధాకరమన్నారు.

ముఖ్యంగా కడప, బందరు ప్రాంతాలకు చెందిన పలువురు మొబైల్ డిస్ట్రిబ్యూటర్లు ఈ ప్రమాదంలో మృతి చెందడం ఎంతో కలిచి వేసిందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని ఆ కుటుంబాలకు భగవంతుడు ప్రసాదించాలని ప్రార్థించారు. ప్రమాదంలో గాయపడిన వారంతా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైయస్ జగన్, ప్రస్తుతం వియత్నాంలో చిక్కుకుపోయిన తెలుగు రాష్ట్రాల పర్యాటకులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రమాదంలో గల్లంతైన వారి ఆచూకీ కోసం ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టి, బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా నిలవాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ విపత్కర పరిస్థితిలో చిక్కుకున్న తెలుగు వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్ విజ్ఞప్తి చేశారు.

# రాజధానిపై విషం చిమ్మడం వైసిపి పని

## • టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధానిపై విషం చిమ్మడం ప్రత్యర్ధిపార్టీ ఆపటం లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆరోపించారు. "అమరావతికి కనెక్టివిటీ రాకుండా చేసేందుకు రైతులను అడ్డుపెట్టి జగన్ పార్టీ కుట్రలు చేస్తున్నారు. అమరావతిని అడ్డుకోవడానికే అర శాతం మంది రైతులను జగన్ వాడుకుంటున్నారు. అమరావతిని ఆపేందుకు గొడ్డలి పార్టీ నానా తంటాలు పడుతోంది. అమరావతికి 99.50 శాతం మంది రైతులు భూములను త్యాగం చేశారు. భూములివ్వని అర శాతం రైతులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్సీపీ కుతంత్రాలు పన్నుతోంద్ధి అని నక్కా ఆనందబాబు ఆరోపించారు. ఈ సందర్భంగా సిఆర్‌డిఎ సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణం, భూసేకరణ వంటి అంశాలపై మీడియా సమావేశంలో నక్కా ఆనంద బాబు పలు వాస్తవాలను తెలియజేశారు. సిఆర్‌డిఎ చేపట్టిన ఇ3 సీడ్ యాక్సెస్ రోడ్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ ప్రక్రియ పూర్తిగా నిబంధనల ప్రకారమే జరిగిందని స్పష్టం చేశారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేయాలనే ఉద్దేశంతోనే వైసిపి వ్యవహరిస్తోందని ఆనంద బాబు పేర్కొన్నారు. 2014 నుంచి 2019 వరకు అమరావతి అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్పుడు ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన గొడ్డలి పార్టీ, 2019 నుంచి 2024 వరకు మూడు రాజధానుల పేరుతో రాజధానిని పూర్తిగా నిర్వీర్యం చేసిందని ఆగ్రహించారు. రాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పడంతో ఆ పార్టీ 11 అసెంబ్లీ స్థానాలకు పరిమితమైందని, కూటమి ప్రభుత్వం అమరావతే రాష్ట్ర రాజధాని అని పార్లమెంటులో స్పష్టం చేసినా వైసిపి వైఖరిలో మార్పు రాలేదని అన్నారు. రాజధాని అమరావతికి కనెక్టివిటీ కోసం నిర్మిస్తున్న ఇ3 సీడ్ యాక్సెస్ రోడ్ కోసం చేపట్టిన 2.725 ఎకరాల భూసేకరణ అంశాన్ని బూచిగా చూపే ప్రయత్నం ఆ పార్టీ చేస్తోందన్నారు. భూసేకరణకు ముందు అధికారులు పలుమార్లు రైతులతో సమావేశాలు నిర్వహించి, ల్యాండ్ పూలింగ్‌లో చేరితే కలిగే ప్రయోజనాలను వివరించారని ఆనంద బాబు చెప్పారు. నోటిఫికేషన్ జారీ చేసిన తర్వాత కూడా ల్యాండ్ పూలింగ్‌కు అవకాశం కల్పిస్తూ రైతులను ఒప్పించే ప్రయత్నాలు కొనసాగించారని పేర్కొన్నారు.

# రాజకీయ కుట్రలకు దళితులను వాడుకోవద్దు

## • హిందూ సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నాలను తిప్పికొట్టాలి • బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్



**విజయవాడ, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఎన్‌డియే ప్రభుత్వం దళిత సంక్షేమం, సాధికారతకు పెద్దపీట వేస్తూ ఎస్సీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ అన్నారు. జడ శ్రవణ్, ప్రకాష్‌రాజ్ పై ఉపా యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పనతల సురేష్ నేరుగా డిమాండ్ చేశారు. రావణ్ హైందవ ధర్మంపై మాటల యుద్ధం ప్రారంభం చేసిన 24గంటల తరువాత జడ శ్రవణ్ ఇదే వ్యాఖ్యలు చేశారు మరో 48గంటలు దాటిన తర్వాత ప్రకాష్‌రాజ్ తన వైఖరిని వెల్లడించాడు. ఆ తర్వాత రోజు సిపిఐ నేత రామకృష్ణ స్పందించారు. వైసిపి వీరందరి వ్యాఖ్యలకు అండగా నిలుస్తూ మీడియా ముందు వ్యక్తం చేస్తూ వచ్చిందని తీవ్ర ఆరోపణలు గుప్పించారు. దళితులపై ఎలాంటి అన్యాయం జరిగినా బిజెపి ఎస్సీ మోర్చా అండగా నిలుస్తుందని ఆయన స్పష్టంచేశారు. విజయవాడలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశం లో ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నినాదమైన "సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్" స్ఫూర్తితో సమాజంలోని చివరి వ్యక్తికీ ప్రభుత్వ పథకాల ఫలాలు చేరేలా ఎన్డీఏ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దళితులను అన్ని రంగాల్లో అగ్రగాములుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అయితే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుండటాన్ని జీర్ణించుకోలేక జగన్‌మోహన్ రెడ్డి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దళితుల మధ్య విభేదాలు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. దేవాలయాలు, హిందూ సంస్థలు, హిందూ విశ్వాసాలపై జరుగుతున్న దాడులను బిజెపి ఎస్సీ మోర్చా తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రావణ్ పేరుతో రాజకీయాలు చేస్తున్న వ్యక్తి వెనుక వైసిపి నాయకత్వం ఉందని, జడ శ్రవణ్ కుమార్ వంటి వ్యక్తులను వైసిపి ప్రోత్సహిస్తూ దళితుల పేరుతో సమాజంలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తోందన్నారు. దళిత హిందువులు ఇలాంటి కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని అడ్డుకునేందుకే కొందరు ఉద్దేశపూర్వకంగా వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ప్రజలు వైఎస్సార్‌సిపిని 11 అసెంబ్లీ స్థానాలకే పరిమితం చేసి తమ తీర్పు ఇచ్చారని అన్నారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు జరిగాయని ప్రభుత్వం భావిస్తే, సంబంధిత చట్టాల ప్రకారం సమగ్ర దర్యాప్తు జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి ఎస్సీ మోర్చా డిమాండ్ చేస్తోందన్నారు. ఈ నెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా దళిత నాయకులతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి దళిత సమాజానికి సంబంధించిన వివిధ అంశాలపై విస్తృతంగా చర్చిస్తామని పనతల సురేష్ వెల్లడించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు, వల్లూరి గంగాధర్, కంతేటి బ్రహ్మయ్య, జోనల్ ఇంచార్జీ మేకల లక్ష్మణ్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు సర్వశుద్ధి రాజు తదితరులు పాల్గొన్నారు.

# రజకులను డిఎన్‌టిలో చేర్చాలి

## • ఆర్థికంగా బలోపేతం కావాలి • రాష్ట్రస్థాయి సదస్సులో వక్తలు




**గుత్తి, జులై 12 ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన రజకుల అభ్యున్నతి దృష్ట్యా రజకులను డిఎన్‌టిలో చేర్చాలని తద్వారా కేంద్రం అందించే పథకాలు అందుబాటులోకి వస్తాయని రాజ్యసభ సభ్యులు సత్యనారాయణ, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు దువ్వాడపు రామారావు, కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడుయాదవ్, టిడిపి గుంతకల్లు ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి తదితరులు పేర్కొన్నారు. రజకులు ఆర్థికంగా బలోపేతం కావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారు అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని విరూపాక్షిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయిలో ఆరవ రజక ఆకాంక్ష సభ నిర్వహించారు. అంతకుముందు గుత్తి పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం రజక సంక్షేమ ఫెడరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ సావిత్రి అధ్యక్షతన భారీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రజకులు ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ల్యాండ్రీలు నిర్వహిస్తున్న రజకులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని, 50 యేళ్లకే పెన్షన్ ఇవ్వాలని, రజక కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలని, జిఒ నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ధోబి పోస్టు భర్తీ చేయాలని, తెలంగాణ తరహాలో ఆధునిక ధోబి ఘాటు నిర్మించాలని, రజకులను బిసి-ఎ నుండి ఎస్సి క్యాటగిరీకి మార్చాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రజకుల అభ్యున్నతికి చేయూత ఇవ్వాలని వారు కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కెసి హరి, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, రజక అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి కమ్మన్న, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి నాగప్ప, గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పత్తి హిమబిందు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఎంకె చౌదరి, స్థానిక నాయకులు కిరణ్, తిప్పడు శీన, మల్లికార్జున, నాగేంద్ర, చెర్లపల్లి సురేష్, సూరి, భూషణ్, నారాయణస్వామి, సుంకన్న, జయరాం, లక్ష్మినారాయణ, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం



## కొండపై భక్తుల రద్దీ

### గోవిందుని దర్శనానికి 30గంటలు

**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** వరుసగా రెండురోజులు వారాంతం సెలవులు రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. అలిపిరి టోల్ గేట్ నుంచే రద్దీ కనిపిస్తోంది. ఆదివారం సాయంత్రానికి సర్వదర్శనానికి 30 గంటల పైగానే సమయం పడుతోంది. భక్తులు పూర్తిగా సిబ్బందికి సహకరించాలని, సంయమనంతో దర్శనం చేసుకోవాలని టిటిడి ప్రచారం చేస్తోంది. క్యూ లైన్ లలో ఉన్న వారికి శ్రీవారి సేవకులు అన్న ప్రసాదం, మజ్జిగ, మంచినీరు, పాలు అందిస్తున్నారు. తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్ట్ మెంట్లు భక్తులతో నిండిపోయాయి. భక్తుల క్యూ లైన్ బాటగంగమ్మ ఆలయం వరకూ విస్తరించింది. శనివారం రాత్రి వరకు 92,017 మంది భక్తులు దర్శించుకున్నారు. కానుకల రూపంలో శ్రీవారి హుండీకి 3.93 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చింది. ఆదివారం సాయంత్రానికి 43వేలమంది భక్తులకు మహాలఘులో స్వామివారి దర్శనం చేయించారు. రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల క్యూ లైన్లలో భక్తుల నిరీక్షణ తప్పడంలేదు.

## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.10 లక్షలు విరాళం



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న ఎస్వీప్రాణదాన ట్రస్ట్‌కు విరాళాలందుతున్నాయి. హైదరాబాద్ సరూర్ నగర్‌కు చెందిన కె వెంకటేశ్వర్లు పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉపయోగపడే ప్రాణదాన ట్రస్ట్‌కు సహకారం అందించారు. హైదరాబాద్ క్యాంప్ కార్యాలయంలో టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును కలిసి రూ.10లక్షలు విరాళం డిడిని అందజేశారు.

## రెండు రోజులు విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంలో ఆణివార ఆస్థానం రానున్న శుక్రవారం జరగనుంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని రేపు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా ఇతరులకు టిటిడి రెండు రోజుల పాటు విఐపి బ్రేక్ దర్శనాలను రద్దు చేసింది. నేడు సోమవారం, 16వ తేదీ గురువారం విఐపి బ్రేక్ దర్శనాలకు సంబంధించిన సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. జూలై 17న కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవలను రద్దు చేసింది. ఈ విషయాలను దృష్టిలో పెట్టుకొని సహకరించవలసినదిగా భక్తులకు టిటిడి విజ్ఞప్తి చేసింది.

## శ్రీవారి ఆలయంలో మహద్వారం - బంగారువాకిలి

# బంగారుమయం చేయరా!?



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన బంగారువాకిలిలో ద్వారపాలకులుగా ఉన్న జయవిజయుల తలుపులు బంగారు తాపడం చేయాల్సిన పనులకు నాలుగేళ్ళు గా 'బ్రేక్' పడిందా? అనే అనుమానాలు టిటిడి వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడో పూర్తిచేయాల్సిన ఈ పనులు ఇంకా నాన్చుతూనే ఉన్నారు. ఇప్పటికే తిరుమలేశుని ఆలయంలోపల మహా ద్వారం వాకిలి, గోపురం, ఆనందనిలయం బంగారుమయం వంటి బంగారుతాపడం పనులు చేపట్టాలని గతంలో అనేక పాలక మండళ్ళు నిర్ణయించినా ఆ దిశగా ఇప్పటివరకు పనులు మొదలుకాలేదు.


గత ధర్మకర్తల మండలి రూ.1.69కోట్ల అంచనాతో బంగారు వాకిలిలో ఉన్న జయవిజయుల తలుపులు బంగారుతాపడం చేయాలని నిర్ణయించింది. ఈ వైదిక పనులు ఎప్పుడో పూర్తికావలసి ఉన్నా గత ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఎక్కడ కక్కడే ఆగిపోయాయి. ఈ పనులు పూర్తయితే ఆలయం లోపల బంగారు వాకిలి తరహాలో జయవిజయులు కొలువైన తలుపులు కూడా మరింత తళతళ మెరిసిపోతాయి.

ఆలయ పవిత్రత పెంపొందించడంలో భాగంగా బంగారుమయం పనులు చేయాలని నిర్ణయించినా ఇంతవరకు ఆ దిశగా కార్యాచరణ ముందుకు సాగలేదు. ప్రస్తుతం రోజువారీగా ఒక లక్ష మంది వరకు భక్తులు అన్ని రకాల దర్శనాలలో (ఉదయం వేళ సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ తప్ప)మహాలఘు విధానం జయ విజయుల వరకే అనుమతిస్తున్నారు. భక్తులు తదేకంగా గోవిందా... గోవింద నామాలతో కులశేఖరపడికి సమీపంలో కొలువైన దివ్య మంగళరూపాన్ని వీక్షించి తమ జీవితం ధన్యం చేసుకుంటున్నారు. రోజువారీగా 75వేలమంది వరకు భక్తులు ఆ వేంకన్న దర్శనం చేసుకోగలు గుతున్నారు. వీరంతా కూడా జయవిజయుల వరకే అనుమతించబడుతున్నారు. ఇక్కడ తలుపులు కూడా కొంత బంగారుపూత తగ్గిందనేది భక్తుల సమాచారం.

### మహద్వారం, బంగారువాకిలి స్వర్ణమయం ఏదీ!?

బంగారుస్వామిగా కీర్తింప బడుతున్న తిరుమల ఆలయంలో ద్వారాలు బంగారు తాపడం మయం చేయాల్సిన పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయనేది భక్తుల్లో వినిపిస్తున్న ప్రశ్నలు. వెంకన్న ఆలయంలో మహద్వారం నుంచి బంగారు వాకిలి, గోపురం బంగారు తాపడం చేయాలని, ఈ పనులు వైఖానస ఆగమోక్తంగానే చేపట్టేందుకు కూడా పాలక మండలి నిర్ణయించింది. ప్రధానమైన మహద్వారం ప్రవేశం నుంచి వెండివాకిలి, బంగారు వాకిలి, ఆలయ గోపురాలు ముఖ్యమైనవి, ఇందులో మహద్వారం గడపలకు, తలుపులు ఎప్పుడో కొన్ని దశాబ్దాల క్రిందట బంగారు తాపడం చేశారు. దీంతో ఇప్పుడు ఇవి చూడటానికి కొంత పేలవంగా కనిపిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఏడుకొండల వెంకన్న బ్రహ్మోత్సవాలు మొదలు కానున్నాయి. ఈ సమయంలో ఈ బంగారు తాపడం పనులు ఎంతవరకు సాధ్యమవుతుందనేది ప్రస్తుతం టిటిడి వర్గాల్లో చర్చ మొదలైంది. రేపు జరిగే టిటిడి బోర్డు ఏం నిర్ణయం తీసుకోనుందో చూడాల్సిందే.

## 18న అక్టోబర్ దర్శన కోటా ఆన్‌లైన్‌లో విడుదల



**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల (సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ)కు సంబంధించిన అక్టోబర్ నెలకోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు 20వతేదీ నుండి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయి. ఇక కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఈనెల 21న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

**వర్చువల్ సేవల కోటా విడుదల:** వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను 21న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. అంగ ప్రదక్షిణ టోకెన్ల కోటాను 23న ఉదయం 10 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను 23న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను 23న మధ్యాహ్నం 3 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను 24న ఉదయం 10 గంటలకు టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. ఇక చివరగా తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను 24న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. భక్తులు టిటిడిదేవస్థానమ్స్.ఎపి.జిఒవి.ఇన్ వెబ్‌సైట్ ద్వారా మాత్రమే శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి తెలిపింది.

## టిటిడి ఇఒ నకిలీ మెయిల్‌తో నగదు కాజేత

**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** విదేశాల్లోని జోహానెస్‌బర్గ్‌లో శ్రీనివాస కళ్యాణం కార్యక్రమానికి ప్రసాదాల సామాగ్రి కోసం నగదు పంపాలంటూ ఎన్నారైకి ఓ సైబర్ నేరస్తుడు మాయమాటలతో నమ్మించాడు. ఏకంగా ఆ మాటలకు నమ్మిన ఓ భక్తుడు నుండి రూ.37వేలు కాజేశాడు. టిటిడి ఇఒ నకిలీ మెయిల్ ఐడితో ఈ దగా చేశాడు. దక్షిణాఫ్రికాలోని ఇండియా కేర్స్ సంస్థ ప్రతినిధి వెంకటప్రసాద్‌తో ఓ సైబర్ నేరస్తుడు సంప్రదించాడు. ఆ సంస్థ ప్రతినిధి నుండి రూ.37 వేలు నగదు యూపీఐ అకౌంట్ ద్వారా కాజేశాడు. ఆ వెంటనే టిటిడి అధికారులనుఇండియా కేర్స్ ప్రతినిధి సంప్రదించాడు. టిటిడి ఎటువంటి నగదు అడగలేదని, రశీదులు తప్పుడువని నిర్ధారించిన టిటిడి దీనిపై ఎవిఎస్ఒ చంద్ర ఫిర్యాదుతో తిరుపతి ఈస్ట్ సిఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు.

# వెంటాడుతున్న వర్షాభావ పరిస్థితులు!

## • శేషాచలంలో ఎండిన కుంటలు • కాలినడక మార్గాల్లోకి చిరుతలు







**తిరుమల, జులై 12 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడాదికాలంగా కురవని వర్షాలు...శేషాచలం కొండల్లో నిండని కుంటలు వెరసి అడవిలో ఉండాల్సిన చిరుత పులులు, ఏనుగుల, ఎలుగుబంట్లు ఆహారం నీటి కోసం దారితప్పి కాలినడక మార్గాల్లో సంచరిస్తున్నాయి. భక్తుల సంచారం ఉండే అలిపిరి, శ్రీవారిమెట్టు మార్గంతో బాటు తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోనూ చిరుతలు సంచారం పెరిగింది. భక్తులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పుడు, అప్పుడు కాదు తరచుగా దశాబ్ధకాలంగా తిరుమల కాలినడక మార్గాల్లో, ఘాట్‌రోడ్లలో భక్తులపై చిరుతపులులు దాడులు చేసిన విషాద ఘటనలు కూడా ఉన్నాయి. తిరుమల శేషాచలం అటవీ ప్రాంతాన్ని ఆనుకునే అలిపిరి, శ్రీవారిమెట్టు నడక మార్గాలు ఉన్నాయి. తిరుమలకు ఉన్న మొదటి, రెండో ఘాట్‌రోడ్లు చాలావరకు అటవీప్రాంతం మధ్యలోనే ఉండటంతో వన్యప్రాణులు సంచారం ఉంది. ఐదేళ్ళ క్రిందట రెండోఘాట్‌లో చివరి మలుపు వద్ద తిరుమల ట్రాఫిక్ పోలీసులు, స్థానికులు ద్విచక్ర వాహనంలో వస్తుండగా వెంబడించి దాడిచేసిన ఘటన తెలిసిందే. శ్రీవారిమెట్టు మార్గంలో ఏకంగా బాలుడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. మొదటి ఘాట్‌లో మోకాళ్ళ పర్వతం సమీపంలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి సమీపంలో నడకదారిలో వస్తున్న భక్తులపై దాడికి ప్రయత్నించి వాహనాల రాకతో పరుగులు తీసింది. మూడేళ్ళ క్రిందట 7వ మైలు వద్ద చిరుతపులి కర్నూలుకు చెందిన బాలుడ్ని నోట కరచుకుని తీసుకెళ్ళి గాయపరిచింది. ఈ ఘటనతో తిరుమలకు వచ్చే భక్తులకు చిరుతల భయం పట్టుకుంది. శేషాచలం అటవీ ప్రాంతంలో గత ఏడాది వరకు దాదాపు 300వరకు చిరుతపులులు ఉన్నట్లు వాటి పాదాల అడుగుల ద్వారా అటవీశాఖ గణన చేసింది. ఏడాదికేడాది చిరుతల సంఖ్య పెరుగుతోంది. ఆహారం కోసం అడవిలో దారితప్పి నడక మార్గాల్లో, ఘాట్ రోడ్లపై వస్తుంటాయని, ఆ సమయంలో మనుషులు గుంపుగా ఉంటే ప్రమాదం లేదని, అక్కడక్కడా ఇద్దరు ముగ్గురు వస్తుంటే దాడి చేస్తున్నాయనేది అటవీశాఖ వర్గాల సమాచారం. ఇటీవల శనివారం వేకువజామున మొదటిఘాట్‌కు ఆనుకుని ఉన్న అలిపిరి కాలినడక మార్గంలో చిరుతపులి పొదల్లో దాక్కుని మెట్లమార్గంలోకి రావడంతో భక్తులు చెల్లాచెదురై భయంతో పరుగులు తీశారు. కొందరు ఏకంగా శబ్దాలు చేయడంతో చిరుత అడవిలోకి వెళ్ళింది. ఒక్కసారిగా ఈ ఘటనతో ఆ ప్రాంతమంతా ఆందోళనకరంగా మారింది. అలిపిరి నడక మార్గాన్ని వందకోట్ల పైగా వెచ్చించి ఆధునికంగా పునర్నిర్మాణం చేశారు. అయితే కాలినడక భక్తుల భద్రతకు తగిన జాగ్రత్తలు తీసుకోలేకపోయారు. అటవీప్రాంతాన్ని ఆనుకుని వున్న నడకమార్గాల్లో రక్షణ గోడల చుట్టూ ఇనుపకంచె ఏర్పాటుచేస్తే ఇలాంటి ప్రమాదం ఉండదనేది భక్తుల నుండి అభిప్రాయం. తిరుమల మొదటి ఘాట్‌లో అధికభాగం అటవీ ప్రాంతానికి, నడక మార్గానికి ఆనుకునే ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో భక్తుల రక్షణకు చర్యలు తీసుకుంటే తప్ప చిరుతల ప్రమాదం నుంచి భద్రత కల్పించలేరనేది భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తిరుమలకు రోజుకు 90వేల మంది వరకు భక్తులు వస్తుంటే ఇందులో కాలినడక మార్గాల్లో సాధారణ రోజుల్లో 20 వేల మంది వరకు, వారాంతంలో 30వేలమంది వరకు భక్తులు వస్తున్నారు. మధ్యాహ్నం తరువాత అలిపిరి నడకమార్గంలో భక్తులు కొండకు రావడం కనిపిస్తుంది. ఇలా అర్ధరాత్రి వరకు ఏకధాటిగా భక్తుల సంచారం ఉంటుంది. అయితే భక్తుల ప్రాణాల రక్షణకు టిటిడి తీసుకుంటున్న చర్యలు మాత్రం శూన్యమనే భక్తులు చెబుతున్నారు. పైగా అటవీప్రాంతానికి ఆనుకుని ఉన్న నడకమార్గాల్లో బలమైన ఇనుపకంచె వేయడం, భద్రతపరంగా చర్యలు తీసుకోవడం చేయాలని సూచిస్తున్నారు. రేపు జరిగే బోర్డు సమావేశంలో ఆ దిశగా మరిన్ని చర్యలకు ఉపక్రమిస్తారని ఆశిద్దాం.

విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు
26
వార్త
సోమవారం 13, జూలై 2026


# స్పీకర్ ప్రత్యేక చొరవతో 'హెల్త్ క్లినిక్'లకు మహర్దశ!




- అసంపూర్తిగా మిగిలిన 22 భవనాల పూర్తికి రూ. 291.35 లక్షలు మంజూరు..
- యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు స్పీకర్ ఆదేశం

విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త :

గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో అర్ధాంతరంగా నిలిచిపోయిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలకు శాసనసభ స్పీకర్ గారి ప్రత్యేక చొరవతో మహర్దశ పట్టింది. ప్రజల ఆరోగ్యానికి, మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్న స్పీకర్ గారు, సగం పనులతో నిరుపయోగంగా పడి ఉన్న ఈ భవనాలను ఎలాగైనా పూర్తి చేయాలన్న పట్టుదలతో అధికారులతో ప్రత్యేకంగా సమీక్షించి అవసరమైన నిధులను మంజూరు చేయించారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో స్పీకర్ గారు ఈ వివరాలను వెల్లడిస్తూ.. నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో ఆగిపోయిన 22 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను పూర్తి చేయడానికి ఏకంగా (తరువాయి 8వ పేజీలో)

## విశాఖను కుదిపిన
# భూప్రకంపనలు

- రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రత నమోదు..
- తెల్లవారుజామున ఒక్కసారిగా కంపించిన భూమి అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచనలు



విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త:

నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున సంభవించిన భూప్రకంపనలు ప్రజలను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేశాయి. ఉదయం 5:05:46 గంటలకు నమోదైన ప్రకంపనలు రిక్టర్ స్కేల్‌పై 4.5 తీవ్రతతో నమోదైనట్లు అధికారికంగా నిర్ధారణ అయింది. సాగర్‌నగర్, తాటిచెట్లపాలెం, సీతమ్మధార, మాధవధార, లాసన్స్ బే కాలనీ, పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, హెచ్‌బీ కాలనీతో పాటు నగరంలోని (తరువాయి 8వ పేజీలో)

# ప్రముఖ గాయిని జానకి మృతి పట్ల కెజీహెచ్ డాక్టర్ నవీన్ ఘన నివాళులు



విశాఖపట్నం, జులై 12 ప్రభాత వార్త

ప్రముఖ సినీ గాయని, గానకోకిల ఎస్.జానకి పరమపదించడం పట్ల నగరానికి చెందిన ప్రముఖ శ్వాశ కోస వైద్య నిపుణుడు, కెజీహెచ్ క్రిటికల్ కేర్ విభాగం ఇంచార్జి డాక్టర్ పి.నవీన్ ఒక ప్రకటనలో తన ప్రగాఢ సంతాపాన్ని, దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. 1983లో టివీకె శాస్త్రి విశాఖపట్నం రైల్వే గ్రౌండ్స్ లో నిర్వహించిన ఆర్కెస్ట్రాలో శ్రీ వేంకటేశ్వర కళ్యాణము సంగీత కచేరీ జరిగిందని పేర్కొన్నారు. ఆనాటి కచేరీలో జానకమ్మ పాడిన పాటలకు వాద్య సహకారం అందించే భాగ్యం తనకు కలింగిందని డాక్టర్ నవీన్ ఈ సందర్భంగా తెలిపారు (తరువాయి 8వ పేజీలో)

## ఆరోగ్యమస్తు...!
## వీఎంఆర్డీఏ ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమానికి
# అధిక ప్రాధాన్యత

**ఉద్యోగ భవన్ ఆవరణలో అత్యాధునిక హంగులతో జిమ్ ఏర్పాటు**




విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త :

ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ విధుల్లో మునిగిపోయే ఉద్యోగులు తమ శారీరక, మానసిక ఆరోగ్య సంరక్షణపై దృష్టిసారించటానికి వీలులేని పరిస్థితి నెలకుంది. దీంతో ఇటు ఒత్తిడి, అలసట వంటి వాటితో బాధపడుతూ సరైన జీవన విధానాన్ని అనుసరించని పరిస్థితి. ఉద్యోగులు తమ ఆరోగ్యం పట్ల దృష్టి సారించలేని పరిస్థితుల్లో అనేక మంది ఊబకాయం, ఇతర హృద్రోగ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో వీఎంఆర్డీఏలో పనిచేస్తున్న ఉద్యోగుల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్పాలనే ఉద్దేశ్యంతో వీఎంఆర్డీఏ ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ లు అత్యాధునిక హంగులతో కూడిన వ్యాయామశాలను అందుబాటులోకి (తరువాయి 8వ పేజీలో)

## ఏపీ ఆర్థోస్కోపీ అసోసియేషన్
# తొలి రాష్ట్ర సదస్సు

**మెడికవర్ వైద్యుల శాస్త్ర చికిత్సా విధానాలు ప్రదర్శన**




ఆరిలోవ, జులై 12, ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ ఆర్థోస్కోపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తొలి రాష్ట్ర సదస్సు ఈనెల 11, 12 తేదీలలో నోవోటెల్ హోటల్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సదస్సుకు దేశవ్యాప్తంగా 25 మందికి పైగా మాస్టర్ ఫ్యాకల్టీ, 40 మంది రీజినల్ ఫ్యాకల్టీ హాజరయ్యారు. విశాఖపట్నంలోని మెడికవర్ ఆసుపత్రిలో మోకాలు, భుజం ఆర్థోస్కోపీకి సంబంధించిన 6 ప్రత్యక్ష శస్త్రచికిత్సలు (లైవ్ సర్జరీస్) నిర్వహించి, పాల్గొన్న వైద్యులకు అత్యాధునిక శస్త్రచికిత్సా విధానాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ఇండియన్ ఆర్థోస్కోపీ సొసైటీ అధ్యక్షులు డా. ఎస్.ఆర్. సుందరరాజా, ఉపాధ్యక్షులు డా. పరాగ్ సంచేటితో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు హాజరై సదస్సుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రముఖ ఆర్థోస్కోపీ నిపుణులు డా.సచిన్ తపస్వి, డా. భూషణ్ సబ్నీస్, డా. రోషన్ వాడే, డా.పూర్ణచంద్ర తేజస్వి, డా.అయ్యప్పన్ నాయర్ ప్రత్యక్ష శస్త్రచికిత్సలను నిర్వహించి తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా నిర్వహించిన ఈ రాష్ట్రస్థాయి ఆర్థోస్కోపీ సదస్సును డా. అస్లాం ఆరిఫ్, డా. కె.ఎస్. ప్రవీణ్ కుమార్, డా. శ్రీధర్ గంగవరపు, డా. ఎన్. ఆశిష్ కుమార్లతో కూడిన ఆర్గనైజింగ్ కమిటీ విజయవంతంగా నిర్వహించారు.

## పదవులకు రాజీనామా చేశాకే
# పార్టీలు మారాలి


- యువత రాజకీయాల్లోకి రావాలి.. సిద్ధాంత రాజకీయాలే దేశానికి శ్రేయస్కరం : వెంకయ్య నాయుడు
- ఉచితాల కంటే అభివృద్ధే ముఖ్యం: స్పీకర్ అయ్యన్నపాత్రుడు
- మాటల తూటాలతో చరిత్ర సృష్టించిన మహానేత వెంకయ్య నాయుడు: హోంమంత్రి అనిత




విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త:

పార్టీ మారాలనుకునే ప్రజాప్రతినిధులు ముందుగా తమ పదవులకు రాజీనామా చేసిన తర్వాతే పార్టీలు మారాలని, ఇందుకోసం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ నిబంధనల్లో మార్పులు అవసరమని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సూచించారు. రాజకీయాల్లో విలువలు, నైతిక ప్రమాణాలు పెంపొందాలని, యువత సిద్ధాంతపరమైన రాజకీయాలతో ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం విశాఖలోని సాయి ప్రియా రిసార్ట్స్‌లో సీనియర్ పాత్రికేయుడు మాశర్మ రచించిన 'వెంకయ్య నాయకుడు' పుస్తక పరిచయ కార్యక్రమంలో వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రాజకీయాల్లో విలువలు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు హుందాగా వ్యవహరించాలని, సంస్కారవంతమైన భాషను ఉపయోగించాలని సూచించారు. పార్టీలు మారడం ప్రజాస్వామ్య హక్కే అయినప్పటికీ, ఆ పార్టీ ద్వారా లభించిన పదవులకు ముందుగా రాజీనామా చేయడం రాజకీయ నైతికత అని పేర్కొన్నారు. ఈ అంశంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. యువత రాజకీయాల్లోకి రావాలని, క్రమశిక్షణ, సమయపాలన, ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పనిచేయాలని వెంకయ్య నాయుడు సూచించారు. నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తని, వారిలో స్ఫూర్తి నింపాలనే ఉద్దేశంతో ఇప్పటికీ దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని చెప్పారు. విశాఖపట్నంతో తనకు విడదీయరాని అనుబంధం ఉందని, విద్యార్థి నాయకుడిగా ఎదిగే అవకాశం ఇక్కడే లభించిందని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ ప్రస్థానానికి విశాఖపట్నమే పునాది వేసిందన్నారు. ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భాన్ని ప్రస్తావిస్తూ, రాజ్యసభలో కీలక బిల్లుల ఆమోదానికి సమర్థ నాయకత్వం అవసరమని భావించి తనను ఆ బాధ్యతలకు ఎంపిక చేశారని తెలిపారు. ఆర్టికల్ 370 రద్దు బిల్లును ఎలాంటి (తరువాయి 8వ పేజీలో)









## లక్ష్యానికి చేరువలో
# 'సర్' ప్రక్రియ

- జిల్లాలో వంద శాతం ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
- 80శాతంకు పైగా ఫారాల డిజిటలైజేషన్ పూర్తి
- సర్ డిజిటలైజేషన్ ప్రగతి లో పెందుర్తి అగ్రస్థానం
- లక్ష్యం పూర్తి కి ఇక 2 రోజులే గడువు



విశాఖపట్నం, జులై 12, ప్రభాత వార్త :

విశాఖ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ శర వేగంగా సాగుతోంది. జిల్లాలో గత నెల జూన్ 15 నుండి ప్రారంభమైన సర్ ఎన్యూమరేషన్ ప్రక్రియ ఈ నెల 14 వ తేదీ తో ముగియనుది. ఇంకా లక్ష్యాన్ని చేరుకునేందుకు కేవలం రెండు రోజులు గడువు మాత్రమే ఉండడంతో ఆదివారం నుంచి ప్రక్రియ స్పీడ్ ను మరింతగా పెంచింది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా అధికార యంత్రాంగం సర్ ప్రక్రియను అత్యంత ప్రతిష్టత్మాకంగా తీసుని గడువు లోగా లక్ష్యాన్ని చేరుకొనే విధంగా ముమ్మరం చేసింది. విశాఖ జిల్లా జీవీఎంసీ పరిధిలోని భీమునిపట్నం, గాజువాక, పెందుర్తిలతో పాటు నగరంలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో సర్ సిబ్బంది, అధికారులు శత శాతం మేరకు 20,23,009 మంది ఓటర్లకు ఎలక్టోరల్ ఫారాలు (ఈఎఫ్ ఎస్ )ను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయగా, ఓటర్ల నుంచి పూరించిన అనంతరం ఇప్పటి వరకు 80శాతంకు పైగా 18,86,941ఈఎఫ్ఎస్ దరఖాస్తు ఫారాలు వెనుకకు రావడంతో వాటిని డిజిటలైజెషన్ చేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో సర్ ఎన్యూమరేషన్ ఫారాలను శత శాతం పంపిణి ని పూర్తి చేయగా వాటిలో పెందుర్తి నియోజకవర్గం 84.64 శాతం మేరకు డిజిటలైజెషన్ ను పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. ద్వితీయ స్థానంలో భీమిలి నియోజకవర్గం 80.76 శాతం, త్రితీయ స్థానంలో గాజువాక నియోజకవర్గం 80.19 శాతం మేరకు డిజిటలైజేషన్ ను నమోదు చేసుకొని లక్ష్యంకు చేరువగా పురోగతి సాధించాయి. నగరంలో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కూడా ఆదివారం సాయంత్రం నాటికి 80 శాతానికి పై బడి ఇఎఫ్ ఎస్ ఫారాలు డిజిటలైజేషన్ పూర్తి చేసినట్టు సర్ ప్రక్రియ నిర్వాహక సిబ్బంది చెప్పారు. కాగా సర్ ప్రక్రియ నిర్వహించడం కోసం ఈ ఏడాది మే 25 వ తేదీ నాటికి జిల్లాలో ఉన్న మొత్తం 20,23,009 మంది ఓటర్లకు పంపిణి చేయడం కోసం శతశాతం 20,23,009 ఎలక్టరల్ ఎన్యూమరేషన్ ఫారాలను ముద్రించి వాటిని జిల్లాలోని ఏ డు నియోజకవర్గాల పరిధిలో 1980 బీఎల్ఓ లు ఇతర సిబ్బంది ద్వారా ఇంటింటికి పంపిణి చేశారు. సర్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిషోర్, (తరువాయి 8వ పేజీలో)



## జిల్లాలో
# కోవిడ్ అలర్ట్

- జిల్లావైద్య యంత్రాంగానికి ప్రభుత్వం కీలక ఆదేశాలు
- అప్రమత్తమైన వైద్య ఆరోగ్య శాఖ
- కెజీహెచ్‌లో 17 పడకల ఐసోలేషన్ వార్డు.
- ఎయిర్ పోర్ట్‌లో ప్రయాణికులకు వైద్య పరీక్షలు.
- నిఘా చర్యలు ముమ్మరం

విశాఖపట్నం, జూలై 12 ప్రభాత వార్త :

రాష్టంలో ఇటీవల మళ్ళీ కరోనా (కోవిడ్ ) కలకలం మొదలైంది. కోవిడ్-19 కేసులు పెరుగుతుండటం, ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలో నాలుగు రోజుల క్రితం ముగ్గురు వ్యక్తులుకు కరోనా సోకాగా వారిలో ఇద్దరు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ నమోదైన కేసుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖా యంత్రాంగం అప్రమత్తమైంది.గత మూడు రోజులు గా విశాఖపట్నం విమానాశ్రయంలో ప్రయాణికులు కు ఎయిర్ పోర్ట్ అధికారులు వైద్య పరీక్షలు నిర్వహించడం మొదలు పెట్టారు. ముఖ్యం గా విదేశాలనుండి నగరంలోకి వచ్చే విదేశీ ప్రయాణికుల మరింతగా నిఘను తీవ్ర తరం చేసే విధంగా దృష్టి సారించాలని ఆదేశించారు అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా ముందస్తు జాగ్రత్తలు, నిఘా చర్యలు ను పటిష్టం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లాలోని అన్ని పిహెచ్సీలు, సీహెచ్సీ లవైద్య అధికారులతో పాటు నగర పరిధిలో ఉన్న ప్రభుత్వబోధనాసుపాత్రులు (తరువాయి 8వ పేజీలో)



## రాజకీయాలకు అతీతంగా కాపుల ఆర్థిక అభివృద్ధికి
# సమాఖ్య కృషి

**గంటా శ్రీనివాసరావు**



సాగర్ నగర్, జులై 12 ప్రభాతవార్త :

సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ - 2026 ను రాడిసన్ బ్లూ రిసార్ట్స్ లో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహారాష్ట్రలో మరాఠా ఛాంబర్ ఆఫ్ కామర్స్ మాదిరిగా సమాఖ్య ఛాంబర్ ఆఫ్ కామర్స్ కూడా సమాజాన్ని, ప్రభుత్వాలను ప్రభావితం చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జనాభాలో 27 శాతమున్న కాపుల ఆర్థిక ఎదుగుదల లక్ష్యంగా రాజకీయాలు అతీతంగా సమాఖ్య సంస్థ ఏర్పాటైందని తెలియజేశారు. కేవలం ఒకటి, రెండు శాతం జనాభా గల కులాలకున్న ఆర్థిక శక్తి కారణంగా వ్యాపార రంగాన్ని శాసిస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్ తరానికి సంస్థ మార్గదర్శనం చేస్తుందని, బెంగళూరులో ఈ నెల 19న తదుపరి సమావేశం జరుగుతుందని చెప్పారు. కాపుల్లో ఇతర సంస్థలను కలుపుకుని సమాఖ్య ముందుకు వెళ్తుందన్నారు. రాయల్ వైజాగ్ క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. యువ నాయకులు గంటా రవితేజ మాట్లాడుతూ కాపు యువత వ్యాపారాభివృద్ధికి సమాఖ్య సహకారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమాఖ్య ప్రతినిధులు (తరువాయి 8వ పేజీలో)



## స్పీకర్ ప్రత్యేక చొరవతో 'హెల్త్ క్లినిక్'లకు మహర్దశ!

(7వ పేజీ తరువాయి)

రూ. 291.35 లక్షల నిధులను సాధించినట్లు తెలిపారు. స్పీకర్ గారి కృషితో నర్సీపట్నం మండలంలోని 4 భవనాలకు రూ. 47.45 లక్షలు, నాతవరం మండలంలోని 7 భవనాలకు రూ. 88.30 లక్షలు, గొలుగొండ మండలంలోని 6 భవనాలకు రూ. 81.50 లక్షలు, మాకవరపాలెం మండలంలోని 5 భవనాలకు రూ. 74.10 లక్షలు మంజూరయ్యాయి. నిధులు మంజూరు చేయించడంతోనే సరిపెట్టకుండా, కేటాయించిన ఈ నిధులతో తక్షణమే పనులు ప్రారంభించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నర్సీపట్నం పంచాయతీరాజ్ ఈఈ, డి ఈ లను స్పీకర్ గారు ఆదేశించారు. అలాగే నిర్మాణాల్లో ఎలాంటి నాణ్యతా లోపాలు లేకుండా చూసుకునే బాధ్యతను ఆయా గ్రామాల నాయకులు తీసుకోవాలని, పనులను ఎప్పటికప్పుడు దగ్గరుండి పర్యవేక్షించి త్వరలోనే ఈ వైద్య కేంద్రాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేలా చూడాలని స్పీకర్ గారు దిశానిర్దేశం చేశారు

## విశాఖను కుదిపిన భూప్రకంపనలు

(7వ పేజీ తరువాయి)

పలు ప్రాంతాల్లో భూమి కంపించినట్లు స్థానికులు తెలిపారు. భూప్రకంపనలతో పలువురు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. అయితే ఎలాంటి ప్రాణనష్టం, ఆస్తి నష్టం జరిగినట్లు ఇప్పటివరకు సమాచారం లేదు.

ఈ సందర్భంగా మాజీ ఆంధ్ర విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్, లయన్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ వెలగపూడి ఉమామహేశ్వరరావు ప్రజలు భూకంపం సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. "డ్రాప్--కవర్--హోల్డ్" విధానాన్ని పాటించాలని, లిఫ్ట్‌లను ఉపయోగించకుండా మెట్ల ద్వారానే బయటకు రావాలని, కిటికీలు, భారీ వస్తువులకు దూరంగా ఉండాలని సూచించారు. భూకంపం అనంతరం గ్యాస్ లీకేజీ, విద్యుత్ సరఫరాను తనిఖీ చేయాలని, అధికారిక సమాచారం మాత్రమే నమ్మాలని, వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రాధాన్యంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు

## కేంద్ర గౌరీ సేవా సంఘం సేవలు అభినందనీయం..

### ప్రశంసించిన పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు



విశాఖపట్నం, జూలై 12, (ప్రభాతవార్త);

గవర జాతి విద్యార్థుల అభ్యున్నతికి కేంద్ర గౌరీ సేవా సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. ఆదివారం కంచరపాలెంలో గల ఆశీర్వాద కళ్యాణ మండపంలో కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ అధ్యక్షతన ఉత్తమ విద్యార్థినీ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవ అభినందన సభ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే గణబాబు, ప్రత్యేక అతిథులుగా ఆర్ వి ఎన్ ఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేగిరామనాయుడు, రాష్ట్ర జిఎస్టి (చిత్తూర్) డిప్యూటీ కమిషనర్ విల్లూరి పరదేశి నాయుడు హాజరై ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు, జ్ఞాపికలు అందజేసి శాలువాలతో సత్కరించి ప్రోత్సహించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు గణబాబు మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా గవర జాతి నిరక్షరాస్యత నిర్మూలనకు కేంద్ర గౌరీ సంఘం ఎంతగానో కృషి చేసి పేద విద్యార్థులను ప్రోత్సహిస్తుందన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని, ఉన్నత స్థాయి గౌరవం లభించాలంటే విద్య ఎంతో అవసరం అని అభిప్రాయపడ్డారు. కేంద్ర గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బుద్ధ శివాజీ మాట్లాడుతూ టాలెంట్ ఉండి సరైన ఆర్థిక ప్రోత్సాహం లేని గవర విద్యార్థిని విద్యార్థులను సంఘం ద్వారా ప్రోత్సహిస్తున్నామన్నారు. 20 ఏళ్ల క్రితం ఎంతోమంది విద్యార్థిని విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత స్థాయిలో నిలిచారని వారే మళ్ళీ సంఘం చేస్తున్న ఈ ప్రోత్సాహకాలకు సహాయ సహకారాలు అందించడం గర్వకారణం అన్నారు. నేడు సుమారు 480 మంది విద్యార్థిని విద్యార్థులకు జ్ఞాపికలు నగదు, ప్రోత్సహకాలు అందజేసి ఘనంగా సత్కరించామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి ఆడారి లచ్చ అప్పారావు, కోశాధికారి కె.వి.కె శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వేగి సత్యనారాయణ, బొడ్డేటి అప్పారావు, పెంటకోట సంజీవరావు నాయుడు, సహాయ కార్యదర్శులు సదరం పురుషోత్తం, ఆడారి పారుపల్లి రవి, మళ్ళ రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మళ్ళ రమణ, బొడ్డేటి దుర్గా ప్రసాద్, పి గణేష్, పీల హరిప్రసాద్, ఐతంశెట్టి సురేష్, సూరిశెట్టి కమలేశ్వరరావు, మహిళా విభాగం అధ్యక్షురాలు సూరిశెట్టి లక్ష్మి, కోశాధికారి కాండ్రేంగుల లావణ్య, ప్రధాన కార్యదర్శి బొడ్డేటి జగ్గయ్యమ్మ, అధిక సంఖ్యలో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రులు, గవర జాతీయులు, తదితరులు పాల్గొన్నారు.

## విశ్వేశ్వరాయ నగర్ అభివృద్ధికి శ్రీకారం

### మంత్రి నారాయణ, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సమీక్ష



గాజువాక,జులై 12,ప్రభాతవార్త :

స్థానిక విశ్వేశ్వరాయ నగర్ కాలనీని అన్ని రంగాల్లోనూ ఆదర్శవంతంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పి.నారాయణ, గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గాజువాక జోనల్ కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై వారు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరాయ నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.. కాలనీ అవసరాలను మంత్రికి వివరించారు. ముప్పై ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కాలనీలో ఇప్పటికే జీవీఎంసీ నిధులతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని.. ఇప్పుడు కాలనీని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు నూతన పార్కులు, యువత కోసం బాక్స్ క్రికెట్ మైదానం, ఓపెన్ జిమ్ వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి నారాయణ, జీవీఎంసీ కమిషనర్ కాలనీ అభివృద్ధి పనులకు తక్షణమే అంగీకారం తెలిపారు. కాలనీ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు అసోసియేషన్ సభ్యులు, స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జీవీఎంసీ అధికారులు,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో ప్రతి ఒక్కరికి ఓటర్ గుర్తింపు అత్యంత కీలకం

### 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు



ఆరిలోవ, జులై 12, ప్రభాతవార్త :

ప్రతి ఒక్కరికి ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటుని కాపాడుకోవ డంలో ప్రజలు ఎంతో బాధ్యత వహించాలని, ప్రతి ఒక్కరికి ఓటర్ గుర్తింపు అత్యంత కీలకమని 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆరిలోవ కాలనీలో టిడిపి పార్టీ కార్యాలయంలో సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో 2002 వాటర్ లిస్ట్ ప్రామాణికంగా సర్ (సమగ్ర వాటర్ నివేదిక) ప్రతి వార్డులో ప్రతి బూతికి బిఎల్వోల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఓటర్కు ఎనిమిరేషన్ ఫార్మ్స్ అందించే వాటిని 2002 వాటర్ లిస్ట్ ల ద్వారా మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ చేసే కార్యక్రమంలో కొంతమందికి అవగాహన లోపం వల్ల ఓటర్ ఫామ్స్ వెనక్కి ఇవ్వకపోవడంతో ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉండడంతో ఈ అవగాహన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, షేక్ ఖాదర్ భాష, కర్రీ మణి తదితరులు పాల్గొన్నారు.

## 39వ వార్డులో హ్యాపీ సండే..



విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త:

ప్రతి ఆదివారం జీవీఎంసీ ప్రతిషాత్మకంగా చేపడుతున్న 'హ్యాపీ సండే' కార్యక్రమం 39వ వార్డు పరిధి లక్ష్మీ టాకీస్ పార్క్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు కొల్లి సింహాచలం, మైలపిల్లి శ్రీను, సూరాడ రాజు, దానేష్, ఇల్లా రాజు, కింగ్ అప్పారావు, నీలి అరుణ, సూరి, సీ మెన్ శ్రీను, జీవీఎంసీ 39వ వార్డు శానిటరీ ఇన్స్పెక్టర్ రాజు తదితరులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పదవులకు రాజీనామా చేశాకే పార్టీలు మారాలి

(7వ పేజీ తరువాయి)

అంతరాయం లేకుండా రాజ్యసభలో ఆమోదింప జేయడం తన రాజకీయ జీవితంలో మరపురాని ఘట్టమని పేర్కొన్నారు. పిల్లలకు చిన్నప్పటి నుంచే చదువుతో పాటు సంస్కారం నేర్పాలని, కుటుంబ పెద్దల అనుభవాలు వారి వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని వెంకయ్య నాయుడు సూచించారు. శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఉదయగిరి నుంచి దేశ ఉపరాష్ట్రపతి స్థాయికి వెంకయ్య నాయుడు ఎదిగిన తీరు అసాధారణమని ప్రశంసిం చారు. 1972 జై ఆంధ్ర ఉద్యమం నుంచి జాతీయ రాజకీయాల వరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అసెంబ్లీలో కొత్త సభ్యుడిగా ఉన్న రోజుల్లో వెంకయ్య నాయుడు ప్రసంగాలను ఆసక్తిగా వినేవాడినని గుర్తుచేసుకున్నారు. ప్రస్తుత రాజకీయాలపై స్పందించిన అయ్యన్నపాత్రుడు, ఉచితాల రాజకీయాల కంటే అభివృద్ధి, విద్య, వైద్యం, రహదారులు వంటి మౌలిక సదుపాయాల కల్పనకే ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నిజంగా అవసరమైన పేదలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందాలని, ప్రజలు కూడా ఓటు వేసే సమయంలో అభివృద్ధిని ప్రామాణికంగా తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం యువత పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని, కొత్త తరం నాయకత్వంతోనే సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమవుతాయని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, రచయితలు, సాహితీవేత్తలు, అభిమానులు పాల్గొని వెంకయ్య నాయుడు ప్రజా జీవితం, నాయకత్వం, తెలుగు భాషాభిమానాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా హోంమంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ, ఇది కేవలం పుస్తకావిష్కరణ కాదని, ఒక మహోన్నత నాయకుడి జీవిత చరిత్రను చరిత్రలో నిలిపే సందర్భమని పేర్కొన్నారు. రైతు కుటుంబంలో జన్మించి దేశ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదిగిన వెంకయ్య నాయుడు జీవితం యువతకు ఆదర్శమని కొనియాడారు. మాటలతోనే చరిత్ర సృష్టించిన నాయకుడిగా, ప్రపంచవ్యాప్తంగా తెలుగు భాష, తెలుగు వారి గౌరవాన్ని పెంచిన వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పటి నుంచే ఆయనలో నాయకత్వ లక్షణాలు, మానవత్వం ప్రతిఫలించాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ ఎం. శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, వెలగపూడి రామకృష్ణబాబు, పంచకర్ల రమేష్‌బాబు, పి. గణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, రచయిత మాశర్మ తదితరులు పాల్గొన్నారు.

# వీఎంఆర్డీఏ ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

(7వ పేజీ తరువాయి)

తీసుకువచ్చారు.

**ఫిట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తి... ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధన దిశగా.**

ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించేలా దేశ ప్రధాని నరేంద్రమోదీ ఫిట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశకత్వంలో ఆరోగ్యాంధ్రప్రదేశ్ దిశగా చేపడుతున్న చర్యల్లో భాగంగా అన్ని ప్రభుత్వకార్యాలయాల్లోను, పలు విభాగాల్లోను ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ నేపధ్యంతో ఫిట్ ఇండియా , ఆరోగాంధ్రప్రదేశ్ నినాదంతో వీఎంఆర్డీఏ ఉద్యోగులు శారీరీక, మానసికంగా మరింత ధృఢత్వంగా ఉండాలనే ఉద్దేశ్యంతో వారిలో ఆరోగ్య చైతన్యం తీసుకు వచ్చేలా వీఎంఆర్డీఏ గతంలో వీఎంఆర్డీఏ కార్యాలయం 9వ అంతస్తులో వ్యాయామశాలను ఏర్పాటు చేశారు. అయితే ఇటీవల విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ కార్యాలయం వీఎంఆర్డీఏలో ఏర్పాటుచేయాల్సి రావటంతో 9వ అంతస్తులో ఉన్న జిమ్ ప్రాంతంలో వి ఈ ఆర్ కోసం ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఉద్యోగ భవన్ వాణిజ్య సముదాయంలో చాలాకాలంగా ఖాళీగా ఉన్న దుకాణంలో వి ఎం ఆర్ డి ఎ ఉద్యోగుల సంఘం ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని, జిమ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఖాళీగా ఉన్న దుకాణంలో పలు మార్లు వేలం వేసినా ఎవరూ ఆశక్తి చూపకపోవటంతో నిరుపయోగంగా ఉన్న ప్రాంతంలో అత్యాధునిక వ్యాయామ పరికరాలతో కూడిన జిమ్ ను సుమారు రూ.2కోట్ల తో ఆధునీకరించి, 'ఫిట్ ఇండియా జిమ్' అని నామకరణం చేశారు .

**ఇటు ఆరోగ్యం...అటు ఆదాయం...**

వీఎంఆర్డీఏ ఉద్యోగులు శారీకరంగా , మానసికంగా మెరుగైన ఆరోగ్య జీవనశైలిని అలవాటు చేసుకోవటం ద్వారా మరింత ఉత్సాహంగా పని చేసేందుకు వీలువుతుందనే ఉద్దేశ్యంతో అన్నివయస్సుల వారికి, వారి వారి వయస్సుల వారీగా వ్యాయామం చేసుకునేలా ఇక్కడ అన్నిరకాల వ్యాయామ పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. వి ఎం ఆర్ డి ఎ ఉద్యోగులకు జిమ్‌ను పూర్తిగా ఉచితంగా ఉపయోగించు కునే సదుపాయం కల్పించారు. ఉదయం 5 నుంచి 9 గంటల వరకు , సాయంత్రం 5 నుంచి రాత్రి వరకు జిమ్‌ను ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. ఆరోగ్యవం తమైన సమాజం నెలకొల్పేందుకు వీలుగా ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఉద్యోగులకు జిమ్ సేవలను ఉపయోగించుకుంటే నిర్ణయించిన రుసుములో 30శాతం రాయితీని కూడా ఇవ్వనున్నారు. ఇక సాధారణ సమయాల్లో స్థానికంగా ఉన్న ప్రజలు, యువత జిమ్‌ను ఉపయోగించుకుంటే అదనపు ఆదాయం సమకూరుతుందనే ఉద్దేశ్యంతో పాటు ఆదునిక వ్యాయామ పరికరాలతో కూడిన జిమ్ మెరుగైన నిర్వహణ నిమిత్తం పిపిపి (పబ్లిక్, ప్రైవేటు పార్టనర్షిప్) విధానంలో టెండరింగ్ వ్యవస్థ ద్వారా ప్రైవేటు సంస్థలకు అప్పగించనున్నారు. దీంతో ఇటు వీఎంఆర్డీఏ ఉద్యోగులకు ఉచితంగా అవకాశం కల్పించటం ద్వారా వారికి ఆరోగ్యకర జీవనంతో పాటు అటుసంస్థకు నెలకు రూ.2 నుంచి రూ.4లక్షల వరకు ఆదాయాన్ని సమకూర్చుకునేలా కార్యాచరణ సైతం రూపొందించారు అటవిడుపుగా. ఫిట్ ఇండియా జిమ్ కేవలం వ్యాయామ పరికరాలతో పాటు ఆటవిడుపు కలిగించేలా పలు రకాల ఇండోర్ గేమ్స్ ను సైతం అందుబాటులో ఉంచారు. చెస్, టేబుల్ టెన్నీస్, స్నూకర్, క్యారమ్స్ వంటివి ఏర్పాటుచేశారు. దీంతో పాటు ధ్యానం, యోగా చేసుకునేందుకు వీలుగా, జుంబా నృత్య సాధనకు ప్రత్యేక గదిని సిద్ధం చేశారు. మహిళా ఉద్యోగులు , మహిళలకు మెరుగైన ఫిట్నెస్ కోసం కూడా పరికరాలను అందుబాటులో ఉంచారు.

**ఆరోగ్యవంతమైన పోటీలు...**

వీఎంఆర్డీఏ ఉద్యోగుల్లో ఆరోగ్యవంతమైన జీవనవిధానాన్ని అలవరచుకునేందుకు వీలుగా ప్రతీ ఒక్కరూ జిమ్ ను ఉపయోగించు కునేందుకు వీలుగా ఆరోగ్యవంతమైన పోటీతత్వం పెంపొందించేలా ఛైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, మెట్రోపాలిటన్ కమిషనర్ తేజ్ భరత్ ఇరువురు తగినవిధంగా ప్రోత్సాహిస్తున్నారు. జిమ్ లో సాధన చేసి బరువు తగ్గటం, అవసరమైన బరువు పెరగటం, బిఎంఐ సామర్ధ్యం పెంపొందించుకోవటం వంటి వాటి విషయంలో ఉద్యోగుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని నిర్వహిస్తున్నారు . అక్టోబరు 2 నాటికి ఉద్యోగులు ఆరోగ్యపరంగా వారు ఎంపిక చేసుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా వారిని తగిన విధంగా ప్రోత్సాహించటం అభినందనీయమని ఉద్యోగులు పేర్కొంటున్నారు .

## భద్రాచలం రామయ్య దర్శనానికి మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి పాదయాత్ర



గాజువాక,జులై 12,ప్రభాతవార్త :

భద్రాచలంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్రస్వామి వారి దర్శనార్థం జీవీఎంసీ 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరారు. తుంగలాం పరిధిలోని శ్రీ విజయరాఘవస్వామి ఆలయం వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉదయం 7:30 గంటలకు ఈ పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డికి స్వాగతం పలికేందుకు వార్డులోని వివిధ యువజన సేవా సంఘాల నాయకులు, పరిసర గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో ఆలయ పరిసరాలకు చేరుకున్నారు. స్థానిక మహిళలు ఆయనకు హారతులు ఇచ్చి యాత్రకు ఘనంగా వీడ్కోలు పలికారు. సుమారు 25 మందికి పైగా భక్తులు, అనుచరులు గోవిందరెడ్డితో కలిసి ఈ పాదయాత్రలో భద్రాచలం తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో కోవిడ్ అలర్ట్

(7వ పేజీ తరువాయి)

ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల యాజమాన్యాలను ఆదేశించింది. ఈ మేరకు ముఖ్యం గా నగర పరిధిలో ని కెజీహెచ్, వీజీహెచ్( ఘోషా సుపత్రి ) ప్రభుత్వ ఛాతి ఆసుపత్రి, మానసిక, కంటి,ఇఎస్టీ ఆసుపత్రు లతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల సూపరిండెంటెంట్ లకు జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జెగదీశ్వర్రావు ఆదివారం అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు జాగ్రత్త చర్యలు లో భాగంగా పెద్దసుపత్రి కెజీహెచ్, వీజీహెచ్, ప్రభుత్వ ఛాతి ఆసుపత్రులు లో కనీసం పది పడకల తో కూడిన ఐసోలేషన్ వార్డులను అత్యవసరం గా సిద్ధం చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా కెజీహెచ్ లో ఇప్పటికే 17 పడకలతో కూడిన కరోనా ప్రత్యేక ఐసోలేషన్ వార్డును కెజీహెచ్ వైద్యఅధికారులుమూడు రోజు ల క్రితం ఏర్పాటు చేశారు . మిగిలిన ప్రభుత్వ ఆసుపత్రులు లో కూడా ఈ ఐసోలేషన్ వార్డుల ఏర్పాటుకు సంబధిత ఆసుపత్రుల వైద్య అధికారులు సన్నాహాలు ను మొదలు పెడుతున్నారు. ఇవి ?వెంటనే అమలులోకి వచ్చేలా జిల్లా వైద్య ఆరోగ్య శాఖా సర్వేలెన్స్ అధికారులు వెంటనే పర్యవేక్షిణ లు ప్రారం భించారు. అయితే ఇప్పటి వరకు నిర్వహించిన కరోనా వైద్య పరీక్షల్లోఎవరికీ పాజిటివ్ రాలేదని అధికారులు చెబుతున్నారు.ఇనేపథ్యంలో ప్రభుత్వం జారీ చేసిన ముఖ్యమైన మార్గదర్శకాలుఇలా ఉన్నాయి.

◀ తీవ్ర శ్వాసకోశ సమస్యలపై నిఘా

అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆరోగ్య కేంద్రాల్లో ఇన్ఫ్లుయెంజా వంటి లక్షణాలు,తీవ్రమైన శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్, కేసులపై నిఘా పెంచాలి. ◀ సత్వర కోవిడ్ పరీక్షలు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనుమానిత లక్షణాలు ఉన్న బాధితుల నుంచి వెంటనే శాంపిల్స్ సేకరించి కోవిడ్ పరీక్షలు నిర్వహించాలి. ◀ పోర్టల్‌లో నమోదు ల్యాబ్‌లో కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన ప్రతి కేసును ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే 'ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్' తో పాటు నిర్దేశిత పోర్టల్స్‌లో నమోదు చేయాలి.

◀ వైద్య వసతులు, మందుల లభ్యత రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీ–పీసీఆర్ టెస్టింగ్ కిట్లు, శాంపిల్ కలెక్షన్ మెటీరియల్, వీటీఎం, పీపీఈ కిట్లు, మాస్కులు, శానిటైజర్లు, ఆక్సిజన్ అవసరమైన అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలి.

◀ ఆసుపత్రుల సన్నద్ధత అన్ని వైద్యశాలల్లోని ఐసోలేషన్ వార్డులు, ఆక్సిజన్ బెడ్లు, ఐసీయూ బెడ్లు, వెంటిలేటర్ల సన్నద్ధతను నిరంతరం సమీక్షించుకోవాలి.

◀ ప్రజల్లో అవగాహన శ్వాసకోశ పరిశుభ్రత, చేతులు శుభ్రం చేసుకోవడం పై ప్రజలకు అవగాహన కల్పించాలి. ప్రజలు అనవసరంగా భయాందోళనలకు గురికాకుండా చూస్తూనే, లక్షణాలు కనిపిస్తే వెంటనే పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలి.

◀ ప్రత్యేక అంబులెన్స్ సేవలు కోవిడ్ ప్రోటోకాల్స్ అనుసరిస్తూ ప్రత్యేక అంబులెన్స్ సదుపాయాన్ని సిద్ధంగా ఉంచాలి.

◀ ఏ ప్రాంతంలోనైనా కోవిడ్ కేసులు అసాధారణంగా పెరిగినా, మరణాలు సంభవించినా సాధారణ నివేదికల సమయం వరకు వేచి చూడకుండా, వెంటనే అమరావతిలోని రాష్ట్ర సర్వైలెన్స్ యూనిట్‌కుసమాచారం అందించాలని ప్రభుత్వం కచ్చితమైన ఆదేశాలు జారీ చేసింది.

## కేకే అండ్ కేఆర్ సెక్షన్ రైల్వే ఉద్యోగులకు న్యాయం చేయాలి

విశాఖపట్నం, జూలై 12 ప్రభాతవార్త

సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు అనంతరం, గతంలో అవిభాజ్య వాల్తేరు డివిజన్ పరిధిలో ఉన్న కేకే అండ్ కేఆర్ సెక్షన్లు కొత్తగా ఏర్పడిన రాయగడ డివిజన్ పరిధిలోకి వెళ్లాయి. ఈ మార్పు తర్వాత ఈ సెక్షన్లలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన వందలాది మంది ఉద్యోగులు తీవ్ర అనిశ్చితి, వివక్ష, పరిపాలనా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రైల్వే బోర్డు ఆమోదించిన సౌత్ కోస్ట్ రైల్వే డి పి ఆర్ లో ఫీల్డ్ స్టాఫ్‌కు సంబంధించిన సర్వీస్ మ్యాటర్స్, పదోన్నతులు తదితర అంశాలు తాత్కాలికంగా విశాఖపట్నం డివిజన్ ద్వారా నిర్వహించబడతాయని పేర్కొన్నారు. తూర్పు తీర రైల్వే ప్రధాన కార్యాలయం విడుదల చేసిన లేఖ నం. ఈస్ట్ కోస్ట్ రైల్వే /హెడ్ క్వార్టర్స్/పి ఈ ఆర్ ఎస్/ఎంపీపీ/12/2025, తేదీ 16-12-2025లో కేడర్ క్లోజర్ వరకు ఉద్యోగుల లియన్, సీనియారిటీ, కెరీర్ ప్రోగ్రెషన్ యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేయబడింది. అయితే, ఈ నిబంధనల స్ఫూర్తికి అనుగుణంగా బదిలీలు, పదోన్నతులు అమలు కావడం లేదని ప్రభావిత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా, విశాఖపట్నం డివిజన్‌లో కొత్త నియామకాలు, పోస్టింగులు జరుగుతున్నప్పటికీ, కేకే అండ్ కేఆర్ సెక్షన్‌లోని అర్హులైన ఉద్యోగులకు న్యాయమైన బదిలీ అవకాశాలు కల్పించకపోవడం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య ఒక్క శాఖకు సంబంధించినది కాదు. లోకో రన్నింగ్, ఇంజినీరింగ్, మెకానికల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలికాం, కమర్షియల్, ఆపరేటింగ్, పర్సనల్, అకౌంట్స్ తదితర అన్ని శాఖలకు చెందిన ప్రభావిత ఉద్యోగుల సమస్య గా నిలిచింది. సౌత్ సెంట్రల్ తోపాటు సౌత్ కోస్ట్ మధ్య ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన జాయింట్ ప్రొసీజర్ ఆర్డర్ వెలువడినప్పటికీ, ఈస్ట్ కోస్ట్ సౌత్ కోస్ట్ రైల్వేల మధ్య ఎం ఓ యు/జేపీవో విడుదల చేయకపోవడంతో కేకే, కేఆర్ సెక్షన్ లో పనిచేస్తున్న ఉద్యోగుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

## జీవీఎంసీలో నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక



విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త :

నగర ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే లక్ష్యంతో సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు పునర్వ్యవస్థీక రించిన 10 జోన్ల కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, హార్టికల్చర్, రెవెన్యూ, యూసీడీ, ఇంజినీరింగ్ తదితర జీవీఎంసీ శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు నేరుగా అర్జీలు సమర్పించి పరిష్కారం పొందవచ్చని ఆయన వెల్లడించారు. పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో వెస్ట్, నార్త్, అగనంపూడి జోన్లకు తాత్కాలికంగా కొత్త ప్రాంగణాల్లో పీజీఆర్ఎస్ నిర్వహిస్తున్నామని, ఆయా జోన్లకు సంబంధించిన ప్రజలు సూచించిన కేంద్రాలకు వచ్చి తమ ఫిర్యాదులు నమోదు చేసుకోవాలని కమిషనర్ కోరారు. మిగిలిన జోన్లలో కార్యక్రమం యథావిధిగా సంబంధిత జోనల్ కార్యాలయాల్లోనే నిర్వహించబడుతుందని తెలిపారు.


## అన్న పై చాకుతో దాడి చేసిన తమ్ముడికి రిమాండ్

ఆరిలోవ, జులై 12, ప్రభాతవార్త

చినగదిలి రామలక్ష్మి పురంలో శుక్రవారం సాయంత్రం అన్న పై తమ్ముడు చాకుతో దాడి చేసిన ఘటనలో తమ్ముడికి ఆదివారం ఆరిలోవ పోలీసులు రిమాండ్ కు తరలించారు. ఈ మేరకు ఆదివారం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. పెరుమళ్ళ రాజు అనే వ్యక్తి తన అన్న పెరుమళ్ళ సంతోష్ కుమార్ పై చాకుతో దాడి చేశాడని, ఇంట్లో ఒంటరిగా ఉన్న సంతోష్ కుమార్ వద్దకు వెళ్లి తమ్ముడు రాజు తన భార్యతో ఫోన్లో ఎందుకు మాట్లాడుతున్నావు అని వాగ్వాదానికి దిగి ఒక్కసారిగా రాజు తన వెంట తెచ్చుకున్న చాకుతో ఎడమ జాతి భాగంలో ఒకసారి.. కుడి వైపు వెనుక ప్రక్కటెముక బాగంలో మరోసారి చాకుతో పొడిచారని తెలిపారు. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు సహాయంతో దగ్గరలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి సంతోష్ని తరలించారు. ప్రస్తుతం సంతోష్ ఆరోగ్యం నిలకడగానే ఉండడంతో వారి కుటుంబ సభ్యులు కేజీహెచ్ ఆసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు. రాజును అదుపులో తీసుకున్న పోలీసులు ఆదివారం రిమాండ్ కు తరలించారు. రిమాండ్ కు పంపించిన రాజు పై త్వరలో రౌడీషీట్ కూడా తెరవనున్నట్లు సీఐ తెలిపారు. ఈ సమావేశంలో శాంతిభద్రతల ఎస్సైలు వై. కృష్ణ రాజేశ్వరి తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## మారండి... లేదంటే చర్యలు తప్పవు

### రౌడీషీటర్లకు ఆరిలోవ సీఐ ఎస్ శ్రీనివాస్ స్ట్రాంగ్ వార్నింగ్



ఆరిలోవ, జులై 12, ప్రభాతవార్త

రౌడీషీటర్లు తమ తీరు మార్చుకోక పోయినా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదని ఎస్ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో ఆదివారం ఆరిలోవ పోలీస్ స్టేషన్ లో సీఐ శ్రీనివాస్ పర్యవేక్షణలో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ప్రతి రౌడీషీటర్ల కదలికపై పోలీస్ సర్వైలెన్స్ ఉందని, నేరాలు, దౌర్జన్యాలు, బెదిరింపులు, అక్రమ కార్యకలాపాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని, నగరంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీస్ స్టేషన్లలో హాజరై సంతకాలు చేయాలని సూచించారు. మారండి... లేదంటే కఠిన చర్యలు తప్పవనీ హెచ్చరించారు.

## ప్రముఖ గాయిని జానకి మృతి పట్ల కెజిహెచ్ డాక్టర్ నవీన్ ఘన నివాళులు

(7వ పేజీ తరువాయి)

అలనాటి జానకమ్మ తో తాను గాయకుడు జి ఆనంద్,మైమ ప్రభాకర్ రావు లు గడిపిన మధుర క్షణాలను నెమరు వేసుకొన్నారు.అప్పట్లో వారు ముగ్గురూ కలసి జానకమ్మతో దిగిన ఫోటోను డాక్టర్ నవీన్ వార్త తో పంచుకున్నారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో దివంగత జానకమ్మ చిత్రపటం వద్ద తన నివాళిని అర్పించిన డాక్టర్ నవీన్ ఆమె ఆత్మకుశాంతి చేకూరాలని ఘనంగా శ్రద్ధాంజలిని ఘటించారు.

## లక్ష్యానికి చేరువలో 'సర్' ప్రక్రియ

(7వ పేజీ తరువాయి)

జేసీ విద్యాధరి, జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్ లు అధిక ప్రాధాన్యతను ఇస్తూ రోజు వారీగా అందరు అధికారులతో సమీక్షా సమావేశలు క్రమం తప్ప కుండా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శనివారం జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ 31వ వార్డు పరిధి అల్లిపురంలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పరిశీలించారు. సర్ విధులు ను సక్రమంగా నిర్వహన తీరు ను సమీక్షించి సిబ్బంది కి త్వరుత గతిన లక్ష్యం చేరుకొనేదుకు అవసరమైన సూచనలు ఇచ్చారు.

## రాజకీయాలకు అతీతంగా కాపుల ఆర్థిక అభివృద్ధికి సమాఖ్య కృషి

(7వ పేజీ తరువాయి)

పీవీ రావు, టీబీఎన్ రావులు మాట్లాడుతూ కాపుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేస్తున్నామని వివరించారు. ఈనెల 25 నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని 30 ప్రాంతాల్లో సమాఖ్య సంస్థ పర్యటిస్తుందని ప్రకటించారు. ధర్మేంద్ర అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్ పోస్టర్ ఆవిష్కరించారు.

## ముగిసిన హెచ్పీవీ వ్యాక్సిన్ శిబిరం



విశాఖపట్నం, జూలై 12 (ప్రభాతవార్త);

మహిళల్లో వచ్చే సర్వైకల్ క్యాన్సర్ను హెచ్పీవీ వ్యాక్సిన్ ద్వారా సమర్థవంతంగా నివారించేందుకు నాట్కో ట్రస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్, చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థలు సంయుక్తంగా రెండు రోజుల పాటు పోలీస్ బ్యారెక్స్లోని టెంపుల్ ఆఫ్ లెర్నింగ్ హాల్లో నిర్వహించిన వ్యాక్సినేషన్ శిబిరం ఆదివారం ముగిసింది.రెండు రోజుల శిబిరంలో 9 నుంచి 14 ఏళ్ల మధ్య వయసు గల 505మంది పోలీసు సిబ్బంది కుమార్తెలకు హెచ్పీవీ బూస్టర్ డోస్ వ్యాక్సిన్ వేశారు ఈ సందర్భంగా చైతన్య స్రవంతి అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రెహమాన్ మాట్లాడుతూ. మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ నియంత్రణకి 9 నుంచి 14 ఏళ్లలోపు బాలికలకు రెండు డోసులు వ్యాక్సిన్ వేశామని తెలిపారు. పోలీసులకు చెందిన ఆడపిల్లలకు ఈ వ్యాక్సిన్ వేశామని ఇందుకు సహకరించిన పోలీస్ కమీషనర్ డాక్టర్ శంఖ బ్రత బాగ్చీ కి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి బి. రవిచంద్ర,సీరం ఇనిస్టిట్యూట్ ఏరియా మేనేజర్ రాం రతన్, ఎస్ఐ లక్ష్మి, చైతన్య స్రవంతి ప్రతినిధులు ఎస్. ఉమ, ఎస్ లక్ష్మీ కుమారి తదితరులు పాల్గొన్నారు.ఆదివారం 180మంది ఆడపిల్లలు వ్యాక్సిన్ శిబిరంలో పాల్గొన్నారు.

## డాక్టర్ జి.ల్.లీల వరప్రసాద్ అనారోగ్యంతో మృతి



విశాఖపట్నం, జూలై 12 (ప్రభాతవార్త);

ఆంధ్ర విశ్వవిద్యాల యంలో జర్నలిజం పూర్తి చేసి, జర్నలిజానికే జీవితాన్ని అంకితం చేసినటు వంటి సహోదరులు డాక్టర్ జి.ల్.లీల వరప్రసా ద్. అనారోగ్యంతో ఈరోజు ఉదయం నుంచి మన మధ్య లేడు అని వార్త నన్ను మరింత దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. జర్నలిజం పట్ల ముఖ్యంగా ఉత్తరాంధ్ర సమగ్ర అభివృద్ధి పట్ల ఒక శాస్త్రీయ అవగాహనతో నిరంతరం కృషి చేసిన కలం యోధుడు. ముఖ్యంగా ఉత్తరాం ధ్రలో ఎందరో ప్రముఖ పాత్రికేయులు, సాహితీ వేత్తల జయంతి, వర్ధంతి లతో పాటు వారి జీవితం కదనలు తెలిసినటువంటి నిఘంటువు లీలా. కొంతకాలం నాతో పాటు విశాలాంధ్రలో పనిచేసిన రోజులు అలా గుర్తుకొస్తాయి. ఉత్త రాంధ్రలో వెనుకబడిన ప్రాంతం నుంచి బంధువులు, స్నేహితులు, జర్నలిస్ట్ మిత్రులు ఎవరు అనారోగ్యంతో విశాఖలో కేజీహెచ్ హాస్పిటల్‌కి వచ్చిన వారికి దగ్గరుండి అన్ని తనే సహాయంగా ఉండే వారు. సామాజిక స్పృహ, సామాజిక బాధ్యత కలిగినటువంటి ఉత్తమ జర్నలిస్టు. ముఖ్యంగా వర్కింగ్ జర్నలిస్ట్ గా సామాజిక బాధ్యతలో భాగంగా గొంతులేని ప్రజల గొంతు గా ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రెంట్ బయట ఏర్పాటు లో, కార్యక్రమాల్లో చురుకైన పాత్ర వై పోషించారు. లీల ఉద్యోగం వచ్చిన తర్వాత కూడా వృత్తి, ప్రవృత్తి జర్నలిజం కావడం గొప్ప విషయం. లీలా లేని లోటు తీర్చలేనిది, వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, లీలా ఆశయాలను కొనసాగిస్తాము. వారి కుటుంబానికి ప్రగడ సానుభూతి తెలియజేస్తున్నాం. ఉత్తరాంధ్ర జర్నలిస్ట్ ఫ్రంట్. వర్మ. 9848069524

# నేరెళ్లవలస ఆరోగ్య కేంద్రం, అన్నదాత సుఖీభవ భవనాలు పూర్తయ్యేదెపుడు..

పద్మనాభం, జూలై12, ప్రభాతవార్త

మండలంలో విజయానందపురం జంక్షనులో గత ప్రభుత్వం హయామాలో నేరెళ్లవలస గ్రామానికి సంబందించి లక్షలాది రూపాయలతో నిర్మించిన ఆరోగ్య కేంద్రం, అన్నదాత సుకీభవ కేంద్రాల భవనాలు పునాదులకే పరిమితమయ్యాయి. అధికారులు,పాలకులు నిర్లక్ష్యం, నిధులు రాకపోవడం వెరసి ఈ భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి.అయితే కూటమి ప్రభుత్వం పాలకులు, అధికారులు ఈ భవనాలను మరిచారని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం ఈ భవనాల వైపు కన్నెత్తి చూడలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాలు పూర్తి కాకపోవడంతో పాత పంచాయితీ భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం పాలకులు స్పందించి ఈ భవనాలను పూర్తి చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.






















































































## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి..
### ప్రమాదకరంగా మారిన పురుషోత్తపురం జంక్షన్..

ఎలమంచిలి, జూలై 12, ప్రభాతవార్త





జాతీయ రహదారి పురుషోత్తపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపిన వివరాలు ప్రకారం దంతులూరి రామరాజు (70) ద్విచక్ర వాహనంపై రోడ్డు దాటుతుండగా తుని నుండి అనకాపల్లి వైపు వెళ్తున్న ఐచర్ వ్యాన్ అతి వేగంగా రోడ్డు దాటుతున్న రామరాజును ఢీకొట్టడంతో రామరాజు తలకు తీవ్ర గాయాలయ్యాయని అధిక రక్తస్రావం జరగడంతో అంబులెన్స్‌లోని అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి తరలించగా అక్కడ వైద్యులు అప్పటికే మరణించినట్లు నిర్ధారించారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగుతుందని రూరల్ ఎస్సై ఉపేంద్ర తెలిపారు. జాతీయ రహదారి పురుషోత్తపురం జంక్షన్ మర్రిబంద జంక్షన్ సమీపంలో ఈ మధ్యకాలంలో ప్రమాదాల జరిగిన సంఘటనలో ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ ప్రాంతాలను రెడ్ జోన్లుగా ప్రకటించి పోలీస్ అధికారులు, జాతీయ రహదారి సిబ్బంది ఈ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుకుంటున్నారు. ప్రమాదాలు సంభవించకుండా తక్షణం అధికారులు ఈ ప్రాంతాలలో ప్రత్యేక నిగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## చెరుకు పంటకు పూర్వ వైభవం రావాలి
### సేంద్రియ బెల్లం పౌడర్ కు ప్రభుత్వం ప్రోత్సహించాలి -వ్యవసాయదారుల సంఘం సభ్యులు విజ్ఞప్తి

అనకాపల్లి జూలై 12, ప్రభాతవార్త



ఉమ్మడి విశాఖ జిల్లాలో షుగర్ ఫ్యాక్టరీలు మూతపడటంతో రైతుకు లాభాన్ని చేకూర్చే చెరుకు పంట కనుమరుగవుతుందని ప్రత్యమయ్య మార్గంలో సేంద్రీయ బెల్లం పౌడర్ యూనిట్లకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే పూర్వ వైభవంలా చెరుకు పంట వేసేందుకు రైతులు ముందుకు వస్తారని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం స్థానిక వివి రమణ రైతుభారతి కళ్యాణ మండపంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి రాము, ప్రధాన కార్యదర్శి ఏవి నూకేశ్వర రావు మాట్లాడుతూ పూర్వం విశాఖ ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రంగంలో సుమారుగా 19 వేల హెక్టార్లలో చెరుకు పంటను పండించే వారిని, విశాఖ ఉమ్మడి జిల్లాలో ఉన్న నాలుగు షుగర్ ఫ్యాక్టరీలు మూతపడటంతో రైతులు అయోమయ స్థితిలో చెరుకు పంటను పండించేందుకు వెనుకంజ వేయడం వల్ల నేడు 18 వందల హెక్టార్లులో చెరుకు పంట వేసే పరిస్థితి కనిపిస్తుంది అన్నారు. ఫలితంగా రానున్న రోజుల్లో చెరుకు పంట కనుమరుగయ్య ప్రమాదం ఉందన్నారు. రైతులకు వ్యవసాయ రంగంలో లాభాలు చేకూర్చే ప్రధాన పంటగా చెరుకు పంట పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆత్మనిర్భార్ భారత్‌లో భాగంగా ఎం ఎస్ ఎం ఈ లను ప్రోత్సాహం అందిస్తున్నారని, ఈ నేపథ్యంలో ప్రతి మూడు గ్రామాలకు అనుకూలంగా ఒక సేంద్రీయ బెల్లం పౌడర్ తయారీ యూనిట్లను ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తే రైతులు చెరుకు పంట పండించేందుకు చక్కని పరిష్కార మార్గం కలుగుతుందన్నారు. ప్రస్తుతం అత్యంత విజయవంతంగా నిర్వహిస్తున్న అనూష ఆగ్రో ప్రోడక్ట్ అధికారి అనూష నరేష్ సహకారంతో సేంద్రీయ బెల్లం తయారు యూనిట్లు నెలకొల్పుటకు ఆసక్తిగల రైతులు తమ రైతు సంఘంలో సంప్రదిస్తే వారికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పించి పరిశ్రమలు ఏర్పాటుకు సహకారం అందిస్తామని ఆ సంఘం ఉపాధ్యక్షులు ఏవి నూకేశ్వరరావు తెలియజేశారు. ఈ సమావేశంలో శిల్పరశెట్టి బాబి, కాంద్రేగుల విశ్వేశ్వరరావు, పెంటకోట వరప్రసాద్, కెప్టెన్ అప్పారావు, మద్దాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బ్రాండిక్స్ కంటి వైద్య శిబిరంలో నేరాలపై పోలీసుల అవగాహన

అచ్యుతాపురం, జూలై 12 ప్రభాతవార్త




అచ్యుతాపురంలోని బ్రాండిక్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో అచ్యుతాపురం పోలీసులు మహిళల భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, అత్యవసర సేవల వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్యుతాపురం సీఐ చంద్ర శేఖర్, ఎస్సైలు సుధాకర్, పోషణతో పాటు పోలీసు సిబ్బంది హాజరై ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, మోసపూరిత ఫోన్ కాల్స్, సోషల్ మీడియా ద్వారా జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. అలాగే చిన్నారుల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలను వివరించి, మహిళలు, బాలికలు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే పోలీసులను లేదా అత్యవసర సేవలను ఆశ్రయించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో బ్రాండిక్స్ సంస్థకు చెందిన సుమారు 300 మంది మహిళా, పురుష ఉద్యోగులు పాల్గొని పోలీసుల సూచనలను ఆసక్తిగా విన్నారు. కార్యక్రమం అనంతరం ఉద్యోగుల సందేహాలకు పోలీసులు సమాధానాలు ఇచ్చారు.

## ముంబయిలో విజయవంతంగా పవన్ కళ్యాణ్‌కు భుజం శస్త్రచికిత్స

అచ్యుతాపురం జులై 12 ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్కు ముంబయిలో ఆదివారం నిర్వహించిన భుజం శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైంది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డా. దిన్షా పార్థీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందం ఆయన కుడి భుజానికి అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్స నిర్వహించింది. వైద్యుల వివరాల ప్రకారం, పవన్ కళ్యాణ్ కుడి భుజంలో రొటేటర్ కఫ్ ఇంజ్యూరీతో పాటు అవల్షన్ ఫ్రాక్చర్ కూడా ఉండటంతో సుదీర్ఘ శస్త్రచికిత్స అవసరమైంది. సుమారు మూడున్నర గంటల పాటు కొనసాగిన ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అనంతరం పవన్ కళ్యాణ్ మత్తుమందు (అనస్థీషియా) ప్రభావం నుంచి కోలుకుంటున్నారని, ప్రస్తుతం వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, పూర్తిస్థాయిలో కోలుకునేందుకు కొంతకాలం విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆస్పత్రికి వెళ్లి పవన్ కళ్యాణ్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తవడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యుల సూచనలను పాటిస్తూ పూర్తిగా కోలుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలని పవన్ కళ్యాణ్‌కు సూచించారు.

## జానకమ్మ గానమాధుర్యం చిరస్మరణీయం
### మహిళా సాధికారతకు చిరునామా.. సంగీత ప్రపంచానికి తీరని లోటు: బిజెపి జిల్లా మహిళ మొర్చ వైస్ ప్రెసిడెంట్ అనురాధ

అచ్చుతాపురం, జూలై 12 ప్రభాతవార్త



భారతీయ సినీ సంగీత జగత్తును తన మధుర గానామృతంతో పరవశింపజేసిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి మరణం పట్ల అనకాపల్లి జిల్లా బిజెపి మహిళ మొర్చ వైస్ ప్రెసిడెంట్ అనురాధ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం విడుదల చేసిన సంతాప సందేశంలో మాట్లాడుతూ.. మహిళలు వంటింటికే పరిమితం కాదని, తమ ప్రతిభ, పట్టుదల, కృషితో ప్రపంచ వేదికపై అగ్రస్థానాన్ని అధిరోహించ గలరని ఎస్.జానకి తన అసాధారణ సంగీత ప్రస్థానం ద్వారా నిరూపించారని కొనియాడారు. కోట్లాది మంది అభిమానుల హృదయాలను తన మధుర గానంతో దోచుకున్న జానకమ్మ భారతీయ సంగీత ప్రపంచానికి దొరికిన అరుదైన ఆణిముత్యమని పేర్కొన్నారు. తెలుగు సహా పలు భారతీయ భాషల్లో వేలాది గీతాలను ఆలపించి సంగీత చరిత్రలో చెరగని ముద్ర వేసిన జానకమ్మ సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆమె గాత్రం తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని, సంగీత ప్రియుల హృదయాల్లో జానకమ్మ చిరంజీవిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. జానకమ్మ మరణం భారతీయ సంగీత ప్రపంచానికి తీరని లోటని, ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని సిహెచ్ అనురాధ తెలిపారు.

## నామవరం దశరథ ధాబాలో పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యం

పాయకరావుపేట జూలై 12 ప్రభాతవార్త



మండలంలోని నామవరం సమీపంలో గల దశరథ ధాబాలో పనిచేస్తున్న బీహార్ రాష్ట్రంలోని నావాడ జిల్లా,బర్మీ గ్రామానికి చెందిన ఉపేందర్ మాంజీ అదృశ్యమైనట్లు ఆ దాబా హోటల్ యాజమాని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాబా హోటల్లో పనిచేస్తున్న ఉపేందర్ మాంజీ ఈనెల 7వ తేదీ నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. ఆ వ్యక్తి ఆచూకీ లభించిన యెడల స్టేషన్ హౌస్ అధికారి చరవాణి నెంబర్ 9440796106, పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ మొబైల్ 9347633643 నెంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ పురుషోత్తం విజ్ఞప్తి చేశారు.

## ఉచిత వైద్య శిబిరానికి అన్యోహస్పందన

అనకాపల్లి, జూలై 12, ప్రభాతవార్త



స్థానిక గవరపాలెం అగ్గిమర్రి చెట్టు వద్ద సిద్ధార్థ చారిటబుల్ ట్రస్టు , సంజీవిని పోలి క్లినిక్ హాస్పటిల్ పూడిమడక రోడ్ వారిచే 81 వ వార్డ్ ఇంచార్జ్. రాష్ట్ర గవర కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడశివ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌లో విశేషంగా ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు. ప్రజలందరికీ ఎంతో ఓపికతో గుండెకు సంబంధించి పరీక్షలు జరిపి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సిద్ధార్థ, సుదర్శన్ రెడ్డి లు ప్రజలకు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు అవగాహన కల్పించారు. అనంతరం వైద్యులను 81 వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డేడ శివ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గ లక్ష్మి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బొడ్డేడ శివ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి దివాంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పథకాన్ని రూపకల్పన చేశారని తద్వారా రాష్ట్ర ప్రజలు ఎంతోమంది వైద్య పరంగా ఆర్థిక లబ్ధి పొందాలని అన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి నడుచుకుంటున్నారని అన్నారు . వైసిపి అనకాపల్లి నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ ప్రోత్సాహం తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 80 వ వార్డ్ ఇంచార్జ్ కె ఎం నాయుడు స్టేట్ ఎస్సీ సెల్ సెక్రటరీ జ్ఞానదీప్, 81 వ వార్డ్ వైజ్ ప్రెసిడెంట్ సుంకర వెంకటేశ్వర రావు, రైతు విభాగం అధ్యక్షుడు ఆడారి బుచ్చి రాము, ఆళ్ల నరేంద్ర, దాడి సీతారాం, సురిశెట్టి రవి పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని నూకాంబిక అమ్మవారికి ప్రత్యేక పూజలు

అనకాపల్లి జులై 12ప్రభాతవార్త



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలో కుడి భుజానికి విజయవంతంగా శస్త్రచికిత్స జరిగింది. రొటేటర్ కఫ్ సమస్యతో పాటు అవల్షన్ ఫ్రాక్చర్‌కు వైద్యులు సుమారు మూడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, సుమారు 10 రోజుల పాటు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ సూచనల మేరకు, అనకాపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ ఆధ్వర్యంలో జనసేన నాయకులు, కార్యకర్తలు అనకాపల్లి ఇలవేల్పు శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకుని ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా కొనసాగాలని అమ్మవారిని ప్రార్థించారు. ఆయనకు సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక అర్చనలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలందరి ఆకాంక్షలను అమ్మవారి సన్నిధిలో వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## వ్యక్తి మృతి

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)

తీసుకోవలసిన మందులను తీసుకోకుండా అధికంగా తీసుకోవడంతో ఆ మందులు వికటించి ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటనపై సీఐ జె. మురళి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. నక్కపల్లి మండలం, అమలాపురం పంచాయతీ, శివారు పాటిమీద గ్రామానికి చెందిన రావి నాగేశ్వరరావు(41), గతంలో మానసిక అనారోగ్యంతో బాధపడుతూ విశాఖపట్నంలోని మానసిక వైద్యశాలలో చికిత్స పొందినట్లు, అప్పటి నుండి వైద్యులు సూచించిన మందులను వాడుతున్నట్లు కుటుంబ సభ్యులు ఆ ఫిర్యాదులకు పేర్కొన్నారు. నాగేశ్వరరావు మద్యానికి బానిసై, మద్యం మత్తులో తన మానసిక వ్యాధికి సంబంధించిన మందులను సోమవారం రాత్రి సుమారు 9.00 గంటల సమయంలో అధిక మోతాదులో తీసుకున్నట్లు ఆయన విషయాన్ని భార్య వెంకటలక్ష్మి గమనించి హుటాహుటి నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం ఎన్టీఆర్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడినుంచి కేజీహెచ్, తరలించారు. కేజీహెచ్ లో చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం సమయంలో మృతి చెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని
## అన్నవరం సత్యదేవుని సన్నిధిలో జనసైనికుల ప్రత్యేక పూజలు
### జనసేన పార్టీ పాయకరావుపేట అసెంబ్లీ ఇంచార్జ్, అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గెడ్డం బుజ్జి సారధ్యంలో అన్నవరంలో అభిషేకాలు

పాయకరావుపేట జూలై 12 ప్రభాతవార్త



రాష్ట్ర జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స విజయ వంతం కావాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ పాయక రావుపేట నియోజక వర్గం ఇంచార్జ్, అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గెడ్డం బుజ్జి సారధ్యంలో జన సైనికులు పలువురు అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజల కోసం నిరంతరం శ్రమించే జన నేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని మళ్లీ ప్రజల మధ్యకు వచ్చి ప్రజా సేవలో రెట్టింపు ఉత్సాహంతో చురుకుగా పాల్గొనాలని జనసేన సీనియర్ నాయకులు గెడ్డం బుజ్జి ఆ భగవంతుడిని కోరి ప్రార్థించారు. ముంబైలో పవన్ కళ్యాణ్ చేతికి సర్జరీ జరుగుతున్న నేపథ్యంలో ఆయన ఆయురారోగ్యాలతో తిరిగి ప్రజాసేవలో ముందుండాలని ఆకాంక్షిస్తూ అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో వ్రతాలతో పాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు గెడ్డం బుజ్జి ధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఆద్యంతం భక్తి శ్రద్ధల మధ్య ఓం నమో సత్య దేవాయ నమః నామస్మరణతో ఆ ప్రాంతమంతా మారుమ్రోగింది. ఇందులో పాల్గొన్న జనసైనికులంతా ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని శ్రీ సత్యదేవుని ప్రార్థిస్తూ మొక్కులు చెల్లించారు. జనసేన పార్టీ యువనేత గెడ్డం చైతన్య సహా జనసైనికులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ కార్యక్రమంలో వైకాపా నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలి: మాజీ మంత్రి గుడివాడ

నక్కపల్లి, ప్రభాతవార్త



కేంద్ర ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న ఓటర్ల జాబితాల పరిశీలన కార్యక్రమం విషయంలో ఆయా బూతులు వారీగా బిఎల్ఓలతోపాటు పార్టీ నాయకత్వం కూడా బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర మాజీ మంత్రి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్ గుడివాడ అమర్నాథ్ పార్టీ కార్యకర్తలకు సూచించారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో ఉండే పార్టీ కార్యకర్తలను కలిసేందుకు ఆదివారం సాయంత్రం వెళుతున్న సందర్భంగా నక్కపల్లి పార్టీ కార్యాలయం వద్ద కొంతసేపు ఆగారు. ఆ సందర్భం గా అమర్నాథ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఇన్చార్జ్ వీసం రామకృష్ణ నాయ కత్వంలో పలువురు పార్టీ కార్యకర్తలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి పలు విషయాలు రామకృష్ణతో మాట్లాడారు. అమర్నాథ్‌తో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, మాజీ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీలకు నక్కపల్లి మండలంలో జరిగిన ఎస్ఐఆర్ కార్యక్రమానికి సంబంధించి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, రామకృష్ణ ఆధ్వర్యంలో పార్టీ అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ లకు తెలియజేశారు. అమర్నాథ్ను కలసిన వారిలో పాయకరావుపేట నియోజకవర్గం వాణిజ్య విభాగం కన్వీనర్ ఎల్లెటి సత్యనారాయణ, పార్టీ నాయకులు అల్లాడ కొండబాబు, సతీష్, సూరిబాబుతో పాటు కార్యకర్తలు ఉన్నారు.



## శారదా నది వంతెన సమీపంలో ట్రాక్టర్ బోల్తా : రైతు దుర్మరణం

ఎలమంచిలి, జూలై 12, ప్రభాతవార్త

నియోజకవర్గం రాంబిల్లి మండలం పరిధిలోని దిమిలి గ్రామానికి చెందిన రైతు సేనాపతి గోవింద (58) ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోవింద ఆదివారం ఉదయం తన ట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లారు. పనులు ముగించుకుని ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటికి తిరిగి వస్తుండగా, శారదా నది వంతెన సమీపంలోని మలుపు వద్ద ట్రాక్టర్ ఇంజిన్‌లో సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో వాహనం అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో గోవింద ట్రాక్టర్ కింద చిక్కుకుపోగా, గమనించిన స్థానికులు వెంటనే అతన్ని బయటకు తీశారు. కుటుంబ సభ్యుల సహకారంతో హుటాహుటిన ఏలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అతడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి తండ్రి పేరు చిన్న అప్పల నాయుడు. ఈ విషాద ఘటనపై మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాంబిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## అమరావతిపై వైసీపి కుట్రలు ఇక ఫలించవు
### రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు

ఎలమంచిలి, జూలై12, ప్రభాతవార్త



అమరావతి రాజధాని భూములపై వైసీపి నాయకులు చేస్తున్న కుట్రలను, ఆగడాలను ఆంధ్రప్రదేశ్ ప్రజలు గమనిస్తున్నారని, ఇలాంటి చర్యలు మానుకుంటే ఆ పార్టీకే మంచి దని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగ నాయకులు హెచ్చరించారు. హరిపురంలోని తన కార్యా లయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధూళి రంగనాయకులు మాట్లాడుతూ రాజధాని అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపి ఎన్ని కుట్రలు చేసినా, ఆపడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. తొంభై తొమ్మిదిన్నర శాతం మంది రైతులు రాజధానికి స్వచ్ఛందంగా భూములిస్తే, కేవలం అరశాతం రైతులను అడ్డం పెట్టుకుని వైసీపి రాజకీయాలు చేయడం శోచనీయ మన్నారు. సీడ్ యాక్సెస్ రహదారి భూసేకరణను వివాదాస్పదం చేసి అమరావతి అనుసంధానాన్ని అడ్డు కోవాలని చూస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిపై ఇటువంటి చౌకబారు రాజకీయాలు చేస్తే రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ క్షమించరని మండిపడ్డారు. భూసేకరణకు ముందు కూటమి ప్రభుత్వం రైతులతో పలుమార్లు చర్చలు జరిపిందని, వారు అన్నింటికీ ఒప్పుకున్న తర్వాత కూడా వైసీపి నాయకులు కుట్రలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పదకొండు మంది రైతులకు ఏడు కోట్ల పద్నాలుగు లక్షల రూపాయల పరిహారం మంజూరు చేసినట్లు అధికారులు ఇప్పటికే వెల్లడించారని ఆయన గుర్తుచేశారు. ఆ కొద్దిమంది రైతులను రెచ్చగొట్టి కుట్రలు చేసినా, భూములిచ్చిన ముప్పై తొమ్మిది వేల మంది రైతులకు న్యాయం చేసే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని స్పష్టం చేశారు. అమరావతి అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు ఇక సాగవని ఆయన పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి లాలం తాతబాబు, అందుకూరి ప్రసాద్, కాల్వ సంఘం ఉపాధ్యక్షుడు అల్లవరపు నరసింహారావు పాల్గొన్నారు.

## పాల్తేరు పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం
### గురువులకు ఘన సత్కారం

పాయకరావుపేట టౌన్ జూలై 12 ప్రభాతవార్త




మండలంలోని పాల్తేరులో గల ప్రాథమికోన్నత పాఠశాల (యూపీ స్కూల్) 1995-96 సంవత్సర బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయిక ఆదివారం క్లాస్మేట్ల కేరింతల నడుమ ఉత్సాహంగా జరిగింది.మూడు దశాబ్దాల తర్వాత ఆ తరగతి క్లాస్మేట్లంతా ఒకే వేదికపై కలసి సందడి చేశారు.ఒరేయ్ ఎలా ఉన్నావ్,ఇప్పుడు ఎక్కడ,ఏం చేస్తున్నావ్ రా! అన్న ఆప్యాయతానురాగాలతో చిన్ననాటి మిత్రులంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలనాటి పాఠశాల రోజులను గురువులు నేర్పిన క్రమశిక్షణను బాల్య స్మృతులను నెమరు వేసుకుంటూ రోజంతా ఆ తరగతి మేట్‌లు ఎంతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన నాటి గురువులను ఘనంగా సత్కరించారు. గురుతుల్యులకు పాదాభివం దనం తరువాత శాలువాలు కప్పి జ్ఞాపికలను అందజేశారు. ఎక్కడో స్థిరపడిన తమ విద్యార్థులంతా ఇంతకాలం తర్వాత గుర్తుపెట్టుకుని,ఒకే చోటికి చేరి సత్కరించడం ఎంతో ఆనందంగా ఉందని అలనాటి గురుదేవుళ్ళు (ఉపాధ్యాయులు) ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## శ్రీ నూకాంబిక గరగల ఊరేగింపు

గొలుగొండ జులై 12, ప్రభాతవార్త



మండల కేంద్రం గొలుగొండలో శ్రీ నూకాంబిక అమ్మవారి జాతర మహోత్సవం లో భాగంగా గరగల ఊరేగింపు ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజులు జాతర మహోత్సవం అమ్మవారి గడగడగలను గ్రామ దర్శనం పెట్టి ఊరేగింపుగా గ్రామం మొత్తం తిప్పుతూ భక్తులకు ప్రజలకు దర్శన భాగ్యం కల్పిస్తూ ముందుకు సాగాయి. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే శ్రీ నూకాలమ్మ అమ్మవారి పండుగ జాతర మహోత్సవం గరగల ఊరేగింపు కార్యక్రమం రెల్లి సామాజిక వర్గం అమ్మవారు ప్రతిష్ట నాయిబ్రమీణ సంఘం డైరెక్టర్ పులేటకుర్తి రమేష్, పుల్లేటికుర్తి చెల్లారావు భూపతి లావరాజు, కమిటీ సభ్యులు తెలిపారు. జాతర మహోత్సవంకు భారీ విద్యుత్ అలంకరణ, డప్పుల మోత, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఆదివారం సోమవారం మూడు రోజు అమ్మవారి పండగతో ఉత్సవాలు ముగుస్తాయని అన్నారు.

## దొంగతనాల నివారణకు అవగాహనా కల్పిస్తాం :వెస్ట్ క్రైమ్ సీఐ తిరుమలరావు

మాధవధార, జూలై 12, ప్రభాతవార్త



వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బెండి తిరుమలరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ప్రభాత వార్తతో మాట్లాడుతూ వెస్ట్ సబ్ డివిజన్ క్రైమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణలో భాగంగా రాత్రి వేళల్లో శివారు ప్రాంతాల్లో గస్తీని మరింత ముమ్మరం చేయడంతో పాటు అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచుతున్నారు. దొంగతనాల నివారణకు అవగాహనా తరగతులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల సహకారంతో దొంగతనాలు నివారించవచ్చున్నారు. 1998 బ్యాచ్‌కు చెందిన తిరుమలరావు ఎస్సైగా బాధ్యతలు స్వీకరించి నప్పటి నుండి నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. 2012లో సీఐగా పదోన్నతి పొందిన ఆయన ఇంటెలిజెన్స్, ఎయిర్ పోర్ట్, ఫోర్త్ టౌన్, టూ టౌన్, భీమిలి, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో పనిచేశారు.

## బైక్‌పై ఇద్దరికీ హెల్మెట్ తప్పనిసరి
### మల్కాపురం ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు



గాజువాక,జులై 12,ప్రభాతవార్త

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ఇద్దరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మల్కాపురం ట్రాఫిక్ సీఐ ఎస్.షణ్ముఖరావు స్పష్టం చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆదివారం మల్కాపురం జంక్షన్ వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. బైక్ వెనుక కూర్చునే వారు హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాల్లో ఎక్కువ ప్రాణనష్టం జరుగుతోందన్నారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ మాట్లాడటం, నగరంలో పరిమితికి మించి వేగంగా వెళ్లడం, వన్‌వేలో ప్రయాణించడం వంటివి చేయరాదని నివారించారు. ఇకపై ట్రాఫిక్ ఉల్లంఘనలను పసిగట్టేందుకు 'లేజర్ గన్' సాంకేతికతను ఉపయోగిస్తున్నామని, నిబంధనలు దాటితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రోడ్లపై అనధికారిక పార్కింగ్‌తో ఇబ్బందులు కలిగిస్తే జరిమానాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ కె.శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్‌సిటీ శ్రీవారి ఆలయంలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

గాజువాక,జులై 12,ప్రభాతవార్త



వడ్లపూడి గ్రీన్‌సిటీలోని శ్రీ లక్ష్మీ ఆండాళ్ సమేత వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్, వైజాగ్ ప్రొఫైల్స్ అధినేత సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ ఉత్సవాలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరై, స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మాధవ్ మాట్లాడుతూ లోక కల్యాణార్థం ప్రతి ఏటా శ్రీవారి బ్రహ్మోత్సవాలను ఇంత వైభవంగా నిర్వహిస్తున్న సురేష్‌బాబును అభినందించారు. ఏడుకొండలవాడి ఆశీస్సులు ప్రజలందరికీ లభించాలని ఆకాంక్షించారు. ఉత్సవాల్లో భాగంగా మహిళలు ప్రదర్శించిన కోలాటాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అనంతరం వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక ఇన్‌ఛార్జ్ కరణంరెడ్డి నరసింగరావు, దీనంకొండ కృష్ణంరాజు, రూపాదేవి, కనకరాజు పాల్గొన్నారు.







## మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గంగరాజు

గాజువాక,జులై 12,ప్రభాతవార్త



గాజువాక నియోజకవర్గ మాజీ సైనికుల సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) అధ్యక్షుడిగా జాజుల గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ మాజీ సైనిక సంఘాల అధ్యక్షులు, కార్యదర్శుల సంయుక్త సమావేశం ఆదివారం గాజువాకలో జరిగింది. ఈ భేటీలో అందరి సమక్షంలో ఆయన్ను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ బలోపేతానికి, అధికారిక రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అనుబంధ సంఘాలన్నీ సహకరించాలని కోరారు. ఆయా సంఘాల నుంచి బోర్డు సభ్యులుగా పనిచేసేందుకు చురుకైన వారి పేర్లను త్వరితగతిన అందజేయాలన్నారు. ఆ వివరాలు అందిన వెంటనే ఈ వారంలోనే నూతన కమిటీ రిజిస్ట్రేషన్ పనులను పూర్తి చేస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో మాజీ సైనుకులు తదితరులు పాల్గొన్నారు.



















## శ్రీ షిరిడి సాయి దర్బార్లో శ్రీ వారాహి నవరాత్రులు

విశాఖపట్నం, జూలై 12, ప్రభాతవార్త



అల్లిపురం విద్యోదయ పాఠశాల దగ్గరలో వివేకానంద కాలనీలో ఉన్న సాయి శ్రీ మేరు సేవా ట్రస్ట్ వారి శ్రీ షిరిడి సాయి దర్బార్ ఆలయ ప్రాంగ ణంలో వేంచేసి ఉన్న శ్రీవారాహి అమ్మవారి సన్నిధిలో ఈనెల 15వ తేదీ నుండి 23వ తేదీ వరకు శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులను సాంప్రదాయ రీతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ సుధావాణి జ్ఞాన ప్రసన్న తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు అభిషేకాలు, అలంకరణలు, కుంకుమ పూజలు, హోమాలు, అమ్మవారి దర్శనం, ప్రతీరోజు రాత్రి 8:30 గంటలకు ఏకాదశ హారతులు, ప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. శ్రీ వారాహి అమ్మవారి నవరాత్రులలో పాల్గొన దలచినవారు ట్రస్ట్ చైర్మన్ ప్రసన్న 99089 93203, ఎ.స్వప్న ప్రియ 91605 60348 ట్రస్టు సభ్యులను సంప్రదించాలని కోరారు. భక్తులు అంతా శ్రీ వారాహి నవరాత్రులను భక్తి శ్రద్ధలతో ఆచరిస్తే దారిద్యము తొలగి సకల శుభాలు కలుగుతాయి కనుక అమ్మని దర్శించి ఆమె కృపను పొందమని కోరారు.

## ప్రభాకర్ గాత్ర ధారణ సేవలు ప్రశంసనీయం

విశాఖపట్నం జూలై 12 ప్రభాతవార్త



ద్వారకా నగర్ పబ్లిక్ లైబ్రరీలో శృతిలయ సాంస్కృతిక సంస్థ 8వ వార్షికోత్సవం సందర్భం గా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు వి ప్రభాకర్ సారధ్యంలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అందరినీ అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏయూ మాజీ విసి ఆచార్య జివిఎస్ఎన్ రాజు శృతిలయ ప్రభాకర్ గాత్రధారణ సేవలను ప్రశంసించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం వీ రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖలో శృతిలయ సాంస్కృతిక సంస్థకు మంచి పేరు ఉందని తెలిపారు. సంస్థ ద్వారా శ్రీనివాస కళ్యాణ ఉత్సవాలను అన్నమాచార్యుని జయంతి ఉత్సవాలను కూడా నిర్వహించడం ఆయనలో ఉన్న భక్తికి నిదర్శనమని తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా ఆకొండి వెంకట రావు, కొణతాలరాజు తదితరులు పాల్గొని ప్రసంగించి ప్రభాకర్‌ని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎంఎస్ మాధవ్, ప్రోగ్రాం కన్వీనర్ సిహెచ్వి సత్య నారాయణ, కడలి, సురేష్ కన్నా, విశ్వనాధ ఫనింద్ర, జ్యోతి, మంగవేణి, సత్యవతి, ఎన్.రాజేశ్వరి, భారతి, సత్యశ్రీ, నాగలక్ష్మి, జంంని. లక్ష్మి, నైషిద, లక్ష్మి స్వరూప, మంజుల...తదితరులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయిని గాయకులు పాల్గొని మధురంగా సినీ గీతాలు ఆలపించారు.

## ఆరిలోవ సీఐ ఎస్.శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలసిన బుడుమూరి గోవింద్

ఆరిలోవ, జులై 12 ప్రభాతవార్త



నూత నంగా బాధ్యత లు చేపట్టిన ఆరిలోవ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్ శ్రీనివాసును ఆదివారం 9వ వార్డ్ ఇంచార్జ్, విశాఖ టిడిపి పార్లమెం టరీ ఎస్సీ సెల్ అధ్యక్షులు బుడుమూరు గోవింద్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఆరిలోవ ప్రాంతంలో రౌడీ మూకలను అరికట్టి శాంతిభద్రతలను చేకూర్చాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు దిలీప్, సీరా అనంత్, ఈగల కొండలరావు, గంద్రేడి శ్రీను, బోర రాజు, లీల, శంకర్, అప్పలరాజు తదితర యువకులు పాల్గొన్నారు.











### వార్త CLASSIFIEDS

**SITUATION VACANT**

★ BUSINESS DEVELOPMENT EXECUTIVE REQUIRED for Civil Construction Company in Vizag. 2 to 5 years experience in construction marketing preferred. Send **CV to hr@ogipl.in**

(Ro.No.14632)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.






















# రాజకీయాల కోసం తాగునీటి పనులను అడ్డుకుంటారా?



## వైసీపీ వైఖరిపై కూటమి నేతల ధ్వజం

గూడెం కొత్తవీధి, జులై 12 ప్రభాతవార్త

సంకాడ పంచాయతీ పరిధిలోని సంకాడ గ్రామంలో గ్రామ ప్రజల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అధికారులు 10-07-2026 (శుక్రవారం) బోర్‌వెల్ తవ్వకానికి ముహూర్తం నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి వైసీపీ ఎంపీపీ హాజరుకాలేదనే నెపంతో వైస్ ఎంపీపీ లోత దేముడు బోర్‌వెల్ పనులను అడ్డుకోవడం అత్యంత దురదృష్టకరమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని కూటమి నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు తాగునీరు అందించడం రాజకీయాలకు అతీతమైన అంశమని, ఇటువంటి అభివృద్ధి పనులను అడ్డుకోవడం ప్రజా ప్రయోజనాలకు విరుద్ధమని నాయకులు స్పష్టం చేశారు. మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజలను మరింత కష్టాల్లోకి నెట్టేలా వ్యవహరించడం వైసీపీ నాయకుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని వారు విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో జనసేన పార్టీ సంకాడ పంచాయతీ అధ్యక్షుడు ఊలం ఈశ్వర్ రావు, టీడీపీ మాజీ ఎంపీటీసీ మొట్టడం లక్ష్మణరావు, మొట్టడం రాజారావు, కొర్ర గురుమూర్తి, మొట్టడం సూర్యారావుతో పాటు గ్రామ దళితులు, గ్రామ పెద్దలు, కూటమి నాయకులు పాల్గొని వైసిపి వైఖరిని తీవ్రంగా దుయ్యబట్టారు.

# అమ్మవారిని దర్శించుకున్న తణుకు ఎమ్మెల్యే,టీడీపీ జోన్-1కో ఆర్డినేటర్ అరిమిల్లి రాధాకృష్ణ

పాడేరు,జూలై12,ప్రభాతవార్త:



ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారిని తణుకు ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ జూన్ 1 కోఆర్డినేటర్ అరిమిల్లి రాధాకృష్ణ ఆదివారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే రాధాకృష్ణకు ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం శర్మ స్వాగతం పలికారు. అమ్మవారి గర్భగుడిలో తీసుకువెళ్ళి ఎమ్మెల్యే రాధాకృష్ణ పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారిని తొలిసారిగా దర్శించుకున్న జోన్ 1 కోఆర్డినేటర్ రాధాకృష్ణకు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి సాల్వతో ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యేతో టీడీపీ అరకు పార్లమెంటు అధ్యక్షురాలు తేజావతి, పాడేరు నియోజకవర్గ అబ్జర్వర్ రత్నకుమారి, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, టిడిపి సీనియర్ నాయకులు బొర్రా నాగరాజు, విజయరాణి, తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఖాన్, టిడిపి నాయకులు హరి,పారిశ్రామిక వేత్త పీవీ కృష్ణ ప్రసాద్, ఏఎంసి డైరెక్టర్ సుబ్బలక్ష్మి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



# ఏడాదైనా మారని దుస్థితి.. మౌలిక వసతుల్లేని ఏబులం గ్రామ సచివాలయం









గూడెం కొత్తవీధి జులై 12 ప్రభాతవార్త

ప్రభుత్వ భవనాలను ఆర్భాటంగా ప్రారంభించడం తప్ప, వాటిలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంపై అధికారులు దృష్టి లేకపోవడం మరోసారి వెలుగులోకి వచ్చింది. ఏడాది క్రితం ప్రారంభించిన ఏబులం గ్రామ సచివాలయం నేటికీ అసంపూర్తి స్థితిలోనే ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. భవన నిర్మాణం పూర్తిగా పూర్తికాకముందే, కనీస అవసరాలు కూడా లేకుండానే సచివాలయాన్ని ప్రారంభించడంపై స్థానికులు తీవ్ర ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏ ప్రాతిపదికన ఈ భవనాన్ని ప్రారంభించారో అర్థం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. సచివాలయంలోకి ప్రవేశిస్తే తలుపులు, కిటికీలు కూడా అమర్చని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో కార్యాలయ రికార్డులు, విలువైన ప్రభుత్వ సామాగ్రికి భద్రత లేకుండా పోయింది. ఎండ, వాన, గాలి, ధూళి నేరుగా లోపలికి చేరుతుండటంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు ఈ భవనం నిలయంగా మారే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో తాగునీటి సదుపాయం కూడా లేకపోవడంతో ఉద్యోగులు, వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు నీటి కోసం బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. టాయిలెట్లలో సైతం నీటి వసతి లేకపోవడంతో మహిళా ఉద్యోగులు, సందర్శకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి కనీస సౌకర్యాలు కూడా లేకుండానే సచివాలయాన్ని ప్రారంభించడం వెనుక ఉద్దేశమేంటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ప్రారంభోత్సవాల కోసం మాత్రమే ప్రభుత్వ భవనాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చారా అంటూ స్థానికులు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది పడుతున్న ఇబ్బందులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు రోజూ కనిపిస్తున్నప్పటికీ ఉన్నతాధికారుల్లో స్పందన లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ భవనాన్ని అసంపూర్తిగా వదిలేయడం పట్ల స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏబులం గ్రామ సచివాలయంలో తక్షణమే తలుపులు, కిటికీలు అమర్చడంతో పాటు తాగునీరు, టాయిలెట్లకు నీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీర్మానాలు చేయాలి: సీపీఎం డిమాండ్

గూడెం కొత్తవీధి జులై 12 ప్రభాతవార్త



గిరిజన ప్రాంతాల్లో ప్రతిపాదించిన బాక్సైట్ తవ్వకాలు, హైడ్రో పవర్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా స్థానిక సంస్థల నుంచి అసెంబ్లీ వరకు ప్రజాప్రతినిధులు వ్యతిరేక తీర్మానాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు బోంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పర్యటన నేపథ్యంలో.. ఆదివారం జికె వీధి మండలం, జెర్రెల పంచాయతీ పరిధిలోని ప్రతిపాదిత బాక్సైట్ కొండ వద్ద ఏర్పాటు చేసిన సభా స్థలాన్ని సీపీఎం ప్రతినిధి బృందంతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ.. గిరిజన ప్రాంత ప్రజాప్రతినిధులైన ఎమ్మెల్యేలు రాష్ట్ర అసెంబ్లీలోనూ, జెడ్పీటీసీలు జిల్లా పరిషత్‌లోనూ, ఎంపీటీసీలు మరియు ఎంపీపీలు మండల పరిషత్‌లోనూ, ఈ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా తీర్మానాలు ఆమోదింపజేయాలన్నారు. ప్రజాప్రతినిధులుగా గిరిజన ప్రజల పక్షం వహించాలని వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. గిరిజన హక్కులను రక్షించే 1/70 చట్టానికి పొంచి ఉన్న ముప్పును, జీవో నెంబర్ 3 రద్దు కావడం వల్ల గిరిజన నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఉపాధి నష్టాన్ని ప్రజాప్రతినిధులు గుర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉక్కు ఉద్యోగుల హయ్యర్ పెన్షన్‌కు మరో అవకాశం ఇవ్వాలి

## ఎంపీ తనూజారాణికి వైఎస్ఆర్‌టీయూసీ వినతి

గాజువాక,జులై 12,ప్రభాతవార్త



విశాఖ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, విశ్రాంత కార్మికులకు ఈపీఎస్-95 పథకం కింద హయ్యర్ పెన్షన్ పొందేందుకు మరో అవకాశం కల్పించాలని వైఎస్ఆర్టీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు అరకు పార్లమెంట్ సభ్యురాలు తనూజారాణిని కలిసి ఒక వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దాలుగా దేశ ఆర్థిక ప్రగతికి సేవలందించిన ఉక్కు ఉద్యోగులకు ప్రస్తుతం నెలకు రూ.1000 నుంచి రూ.3000 లోపే పెన్షన్ వస్తోందని, పెరుగుతున్న ధరల కాలంలో ఈ మొత్తంతో రోజువారీ జీవనం, వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్‌కు అవకాశం ఉన్నప్పటికీ.. ప్లాంట్ యాజమాన్యం నుంచి సరైన సమాచారం లేకపోవడం, అవగాహన లోపంతో చాలామంది సకాలంలో సొమ్ము చెల్లించలేకపోయారని వివరించారు. కేంద్ర కార్మిక శాఖ, ఈపీఎఫ్ఓ అధికారులతో మాట్లాడి ఉక్కు కార్మికులకు మరో అవకాశం దక్కేలా చూడాలని, ఈ సమస్యను పార్లమెంట్‌లో ప్రస్తావించాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్టీయూసీ నాయకులు మార్పూడి పరదేశ్, పల్లా చిన్నతల్లి, నక్క వెంకటరమణ, పిల్లా రెడ్డి, గొండేశి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డ గోవింద్, ధానాల ఉమా, పల్లా పెంటారావు, ధర్మపురి చక్రవర్తి, ములకలపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అల్లూరి జిల్లాను జోన్-1లోనే కొనసాగించాలి

## ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జేఏసీ వినతి -ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం : మంత్రి గుమ్మడి సంధ్యారాణి హామీ

పాడేరు,జూలై12, ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ని, అలాగే తణుకు శాసనసభ్యులు, ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ జోనల్ ఇన్‌చార్జి ఆరిమిల్లి రాధాకృష్ణని అల్లూరి జిల్లా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ ఎల్.రవీంద్ర బాబు పాత్రుడు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుల్లేలి సింహాద్రి ఆధ్వర్యంలో అందజేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణ సరెండర్ లీవుల నగదీకరణ, నాలుగు కరవు భత్యాల విడుదల, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు, సీపీఎస్ రద్దు, ఉద్యోగులు, పెన్షనర్లకు హెల్త్ కార్డుల సమర్థవంతమైన అమలు, మెడికల్ రీయింబర్స్‌మెంట్‌తో పాటు మొత్తం పది ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం అత్యవసరంగా పరిష్కరించాలని కోరినట్లు ఖుఖుఖు తెలిపారు. అదేవిధంగా, రాష్ట్రపతి ఉత్తర్వులు--2025 ప్రకారం అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-2లో చేర్చడం వల్ల గిరిజన ప్రాంత ప్రజలు, ఉద్యోగులు, నిరుద్యోగ యువతకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వివరించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఉద్యోగ సంఘాలు, విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు, అలాగే అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల ఉద్యోగ సంఘాలందరూ ఏకగ్రీవంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-2 నుంచి తొలగించి, పూర్వ విశాఖపట్నం జోన్-1 పరిధిలోనే కొనసాగించాలని కోరుతున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి స్పందిస్తూ, అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్-1 పరిధిలో కొనసాగించాలన్న డిమాండ్‌తో పాటు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను రాష్ట్ర ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మన్ ఎల్. రవీంద్రబాబు పాత్రుడు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ గుల్లేలి సింహాద్రి, జిల్లా ట్రెజరర్ జి.సుబ్రమణ్యం, జిల్లా ఉపాధ్యక్షులు కె.సురేష్, ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు అంబిడి శ్యామసుందరం, వి.వెంకటరమణ, ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. నాగభూషణరావు, పాడేరు సిటీ యూనిట్ అసోసియేట్ ప్రెసిడెంట్ డి.రఘురామ్, ఉపాధ్యక్షులు కె.రామకృష్ణతో పాటు జిల్లా, తాలూకా యూనిట్ల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఫ్యాప్టో రాష్ట్రవ్యాప్త ఉద్యమం

## జూలై 14న అన్ని జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, పికెటింగ్‌కు పిలుపు

గూడెం కొత్తవీధి, జులై 12 ప్రభాతవార్త



రాష్ట్రంలోని ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం, న్యాయమైన హక్కుల సాధనే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సం ఘాల సమైక్య (ఫ్యాప్టో) రాష్ట్రవ్యాప్త పోరాటానికి సిద్ధమైంది. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలకు పిలుపు నిచ్చింది. ఈ నేపథ్యంలో జూలై 14న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ ర్యాలీలు, పికెటింగ్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఫ్యాప్టో ప్రకటించింది. ఉపాధ్యాయుల ఐక్యతను చాటుతూ ఈ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని సంఘం పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 12వ పీఆర్సీ ఏర్పాటు: ఉపాధ్యాయులకు తక్షణమే 12వ వేతన సవరణ సంఘంను ఏర్పాటు చేయాలని 30 శాతం మధ్యంతర భృతి: పెరుగుతున్న జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని సీపీఎస్ రద్దు - ఓపీఎస్ అమలు: కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానం ను అమలు చేయాలని డీఏ బకాయిల విడుదల: పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఇన్-సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయింపు: విద్యా హక్కు చట్టంలో సవరణ చేసి, ఇన్-సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నిబంధనను రద్దు చేయాలని పెన్షన్, ఆర్థిక బకాయిల చెల్లింపు: క్వాంటం ఆఫ్ పెన్షన్ విధానాన్ని సక్రమంగా అమలు చేయడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న అన్ని ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. "పోరాడితే పోయేది లేదు... మన హక్కుల సాధన తప్పు!" అనే నినాదంతో జూలై 14న జరిగే ఉద్యమంలో ఉపాధ్యాయులందరూ పాల్గొనాలని ఫ్యాప్టో పిలుపునిచ్చింది. అవసరమైతే ఒక రోజు సెలవు పెట్టి అయినా జిల్లా కలెక్టరేట్ల వద్ద నిర్వహించే ర్యాలీ, పికెటింగ్ కార్యక్రమాలకు హాజరై తమ సమస్యలపై గొంతుకలపాలని కోరింది. హక్కుల సాధనే ఏకైక లక్ష్యంగా నిర్వహిస్తున్న ఈ జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, పికెటింగ్ కార్యక్రమంతో ఉపాధ్యాయ లోకం ఉద్యమ బాట పట్టనుందని గూడెం కొత్తవీధి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కిట్లంగి పెద్దబ్బాయి తెలిపారు.

# జిల్లా మధ్యాహ్న భోజన పథకం నూతన జిల్లా కమిటీ ఎన్నిక



పాడేరు,జూలై12, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా మధ్యాహ్న భోజన పథకం నూతన జిల్లా కమిటీ ఎన్నుకొన్నారు. ఈ ఎన్నికకు రాష్ట్ర అధ్యక్షురాలు జి.వరలక్ష్మి, అల్లూరి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎల్.సుందరరావు, ఉప అధ్యక్షులు ఎస్.బి.పోతురాజు పర్యవేక్షణలో పాడేరు జిల్లామహా సభలో ఎన్నుకోవడం జరిగింది. జిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎస్.బి.ఫోతురాజు జిల్లా ప్రధాన కార్యదర్శిగా సారే సోమ్ దేవి, జిల్లా అధ్యక్షులుగా గేమేలి రామి, జిల్లా కోశాధికారిగా కె.లక్ష్మిలతో పాటు 25 మందిని అన్ని మండలాల్లో పరిధిలో ఉన్న కార్మికులతో కమిటీ ఏర్పాటు చేసారు. ఇందులో ఆఫీస్ బేరర్‌గా 12 మంది ఎన్నుకన్నారు. మధ్యాహ్న భోజనం పథకం కార్మికుల సమస్యల పరిష్కారం కోసం భవిష్యత్తులో పోరాటం చేస్తామని నూతన కమిటీ హామీ ఇచ్చింది.

# అమ్మవారి భక్తులకు అన్న ప్రసాదం ఏర్పాటు చేసిన పూర్వ సిఐ దీన బంధు

పాడేరు,జూలై12,ప్రభాతవార్త



గిరిజన హారద్యతైవం కోరికలు తీర్చే కొంగుబంగారం శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు పాడేరు పూర్వపు సీఐ డీ.దీనబంధు వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ఆదివారం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాలు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు ఆలయ కమిటీ సభ్యులు చల్లా రామకృష్ణ, కిల్లు చంద్రమోహన్ కుమార్, కొణతాల సతీష్,, లకే రత్నబయి ,అలసి రమణమ్మ, కురస లక్ష్మయ్య, జంపరంగీ సత్తిబాబు, కారం దేవుడు, కూర రాము, మోద స్వరూప తదితరులు పాల్గొన్నారు.



# కృష్ణకుమారికి జాతీయ విద్యా పురస్కారం

అరకులోయ, జులై 12, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా స్థానిక ఫిర్యాదుల కమిటీ చైర్మన్ కమిడి కృష్ణకుమారికి శారద ఎడ్యుకేషనల్ సొసైటీ తరపున జాతీయ విద్య పురస్కారం అవార్డు లభించింది. ఈ మేరకు గత 20 సంవత్సరాలుగా బాల కార్మిక నిర్మూలన, చైల్డ్ ట్రాఫికింగ్ నిరోధంపై పనిచేస్తున్న శారద ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన విశాఖపట్నంలోని రవీంద్ర భారతిలో జరిగే జాతీయ విద్యావంతుల పురస్కారాల కార్యక్రమంలో కృష్ణకుమారికి అవార్డును అందించనున్నారు. ఈ సందర్భంగా కృష్ణకుమారి మాట్లాడుతూ తనకు జాతీయ విద్యా పురస్కారం లభించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తన సేవలను గుర్తించిన శారద ఎడ్యుకేషనల్ సొసైటీకి ఈ సందర్భంగా ఆమె తన కృతజ్ఞతలను తెలియజేశారు. కాగా బాల్యవివాహాలు, డ్రగ్స్, టీనేజీ ప్రెగ్నెన్సీపై అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# అట్టహాసంగా 'అమరావతి ఛాంపియన్‌షిప్-2026' గోడ పత్రిక ఆవిష్కరణ

పాడేరు,జూలై12,ప్రభాతవార్త;



రాష్ట్ర ప్రభుత్వం యువ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించ తలపెట్టిన అమరావతి ఛాంపియన్ షిప్-2026 పోస్టర్ (గోడ పత్రిక)ను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి జిల్లా కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమాని శ్రీ పూజ జాయింట్ కలెక్టర్, ఆదిత్య వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్, ఏం వి ఎస్ లోకేష్, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎ.జగన్ మోహనరావు పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా జిల్లా కలెక్టర్ నిశాంతి మాట్లాడుతూ, జూలై 15వ తేదీ నుండి ఆగస్టు 29వ తేదీ వరకు ఈ అమరావతి ఛాంపియన్‌షిప్-2026 పోటీలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారుల వయస్సు ఆధారంగా అండర్-17, అండర్-23 (బాలురు, బాలికలు) విభాగాల్లో మొత్తం 12 క్రీడాంశాలలో ఈ పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు.




# అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కోటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



అరకు రూరల్, జులై 12, ప్రభాతవార్త

అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా కోటేశ్వరరావు ఆదివారం పదవి బాధ్యతలను స్వీకరించారు సీఐ కోటేశ్వరరావు విశాఖపట్నం రేంజ్ కార్యాలయం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు అరకు సీఐగా పనిచేసిన ఎల్. హిమగిరి విజయనగరం జిల్లా ఎస్ కోట రూరల్ సర్కిల్ కు బదిలీపై సిఐ గా వెళ్లారు. కాగా నూతనంగా సీఐగా బాధ్యతలు స్వీకరించిన కోటేశ్వరరావు మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడుతూ ప్రజలకు ఎటువంటి భంగం జరగకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజల యొక్క సమస్యలను వెంటనే పరిష్కరించేలా అందరి సహకారంతో పనిచేస్తానని చెప్పారు. అదేవిధంగా అరకు సర్కిల్ పరిధిలో ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూస్తానని ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) అల్లూరిజిల్లా మరో కీలక మైలురాయి

## 4,99,752 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ శతశాతం పూర్తి -4,81,917 ఫారాల డిజిటలైజేషన్ పూర్తి 96.43 శాతం పురోగతి

పాడేరు,జూలై12, ప్రభాతవార్త



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్ర మం పురోగతిపై జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి టి. నిశాంతి ఆదివారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలో కొనసాగు తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించినట్లు ఆమె తెలిపారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగించబడకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి ఎన్యూ మరేషన్ ఫారం, క్లెయిమ్, అభ్యంతరాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే తుది నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు. అరకు, ముంచింగిపుట్టు, పాడేరు, చింతపల్లి మండలాల్లో పెండింగ్‌లో ఉన్న అన్ని ఎన్యూమ రేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను జూలై 13వ తేదీలోగా శతశాతం పూర్తి చేయాలని సంబంధిత సహాయ ఎన్నికల నమోదు అధికారులు, అదనపు సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కేటగిరీలో గుర్తించిన కేసులను రాజకీయ పార్టీల బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి ధ్రువీకరించాలని ఆమె కోరారు. ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందేందుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా, 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న లేదా సమీప పోలింగ్ కేంద్రానికి రెండు కిలోమీటర్లకు మించి దూరంలో ఉన్న 30 పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. ఆయా పోలింగ్ స్టేషన్ల విభజనకు సంబంధించి అవసరమైన ప్రతిపాదనలను జిల్లా ఎన్నికల అధికారికి వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని 624 మంది బూత్ లెవల్ అధికారులు అంకితభావంతో పనిచేయడం వల్ల 4,99,752 ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని శతశాతం విజయవంతంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరు జాబితాలో చేర్చడంతో పాటు, మరణించిన, గైర్హాజరైన నకిలీ, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన ఓటర్లను ఖచ్చితంగా గుర్తించి పారదర్శకమైన, ఖచ్చితమైన, దోషరహిత ఓటరు జాబితాను రూపొందించడమేనని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో 4,81,917 ఎన్యూమరేషన్ ఫారాలను డిజిటలైజ్ చేసి 96.43 శాతం పురోగతి నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన ఫారాల డిజిటలైజేషన్‌ను నిర్ణీత గడువులోగా శతశాతం పూర్తి చేయడానికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీని శతశాతం పూర్తి చేయడంతో పాటు, డిజిటలైజేషన్‌లో 96.43 శాతం పురోగతి నమోదు కావడం జిల్లా యంత్రాంగం సమర్థవంతమైన సమన్వయం, ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణకు నిదర్శనమని ఆమె అన్నారు. ప్రతి ఓటరు తమ ఓటరు వివరాలను తప్పనిసరిగా పరిశీలించి, ఏవైనా సవరణలు అవసరమైతే వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారిని సంప్రదించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతో పారదర్శకమైన, ఖచ్చితమైన, సమగ్ర, దోషరహిత ఓటరు జాబితా రూపొందించగలమనే విశ్వాసాన్ని కలెక్టర్ వ్యక్తం చేశారు.

# పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ విస్తృత స్థాయి సమావేశం హాజరైన మంత్రి సంధ్యారాణి

## టిడిపి జోన్ -1 ఇంచార్జి, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ



పాడేరు,జూలై12, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా తెలుగు దేశం పార్టీ పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం విస్తృత స్థాయి సమావేశం ఇంచార్జి ఈశ్వరి అధ్యక్షతన ఆదివారం పాడేరులో నిర్వహిం చారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, తెలుగుదేశం పార్టీ జోన్-1 కో-ఆర్డినేటర్, తణుకు నియోజక వర్గ శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ హాజరయ్యారు. మంత్రి సంధ్యారాణి, జోన్-1ఇంచార్జి రాధాకృష్ణ మాట్లాడుతూ పార్టీ సంస్థాగత బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై బూత్ కమిటీలతో పార్టీ నాయకులతో సమగ్రంగా చర్చించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో వంద శాతం కూటమి అభ్యర్థులే విజయం లక్ష్యంగా అందరూ ఐక్యంగా కృషి. చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టిడిపి అరకు పార్లమెంటు అధ్యక్షురాలు తేజావతి, పాడేరు నియోజకవర్గ అబ్జర్వర్ రత్నకుమారి, మాజీ మంత్రి మత్స్యరాస మణికుమారీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు, ఏంవి విప్రసాద్, కిల్లు రమేష్ నాయుడు, సీనియర్ నాయకులు, జిసిసి డైరెక్టర్ బొర్రా నాగరాజు, తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఖాన్,టిడిపి నాయకులు హరి, పారిశ్రామిక వేత్త పీవీ కృష్ణప్రసాద్, నియోజక వర్గ బూత్ కమిటీలు,పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సమాజంలో ప్రతి ఒక్కరికి ఓటర్ గుర్తింపు అత్యంత కీలకం...

## 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు

ఆరిలోవ, జులై 12, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరికి ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటుని కాపాడుకోవడంలో ప్రజలు ఎంతో బాధ్యత వహించాలని, ప్రతి ఒక్కరికి ఓటర్ గుర్తింపు అత్యంత కీలకమని 13వ వార్డు అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆరిలోవ కాలనీలో టిడిపి పార్టీ కార్యాలయంలో సర్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి జిల్లాలో 2002 వాటర్ లిస్ట్ ప్రామాణికంగా సర్ (సమగ్ర వాటర్ నివేదిక) ప్రతి వార్డులో ప్రతి బూతికి బిఎల్వోల ద్వారా రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రతి ఓటర్కు ఎనిమిరేషన్ ఫార్మ్స్ అందించే వాటిని 2002 వాటర్ లిస్ట్ ల ద్వారా మ్యాపింగ్ చేసి డిజిటలైజేషన్ చేసే కార్యక్రమంలో కొంతమందికి అవగాహన లోపం వల్ల ఓటర్ ఫామ్స్ వెనక్కి ఇవ్వకపోవడంతో ఎన్నికల సంఘం ఇచ్చిన గడువు మరో రెండు రోజులు మాత్రమే ఉండడంతో ఈ అవగాహన శిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత, వార్డు ప్రధాన కార్యదర్శి తురకపూడి బాలస్వామి, షేక్ ఖాదర్ భాష, కర్రీ మణి తదితరులు పాల్గొన్నారు.



# సంతబొమ్మాళిలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలకు శిక్షణ



**సంతబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలోని శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో విశ్వహిందూ పరిషత్ సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల గ్రామ స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత పెద్దలు సింహాద్రి పాల్గున్, జిల్లా సేవా ప్రముఖ బాలాజీ గుప్తా, జిల్లా సహ కార్యదర్శి రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాలు ప్రతీ గ్రామంలో జరిగే విధంగా గ్రామ, గ్రామంలో సత్సంగము జరిగి వేల సంవత్సరాల సంస్కృతి ఉన్న హిందూ ధర్మం వైభవం నిలబడాలన్నారు. కార్యక్రమంలో సంతబొమ్మాళి ప్రఖండ అధ్యక్షులు రట్టి పెరుమాళ్, కార్యదర్శి గణపతి స్వామి,సత్సంగ ప్రముఖులు లక్ష్మీనారాయణ, శ్రీను స్వామి గ్రామ కార్యకర్తలు కూచెట్టి కాంతారావు, పప్పు కృష్ణా, పప్పు రాజు, మహిళా ప్రముఖ్ చామంతి, రాము, భాను ప్రసాద్, కోదండరావు, వీరస్వామి, కృపారాణి, శ్రీరాములు, రవి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక



**ఇచ్ఛాపురం, జులై 12, ప్రభాతవార్త:**

ఇచ్ఛాపురంలో 1991-92లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు స్థానిక ఆర్.జె.ఫంక్షన్ హాల్‌లో గెట్ టుగెదర్ జరుపుకున్నారు. బెంగుళూరు, హైదరాబాద్, రౌర్కెలా, ఛత్తీస్‌ఘడ్, ఎంపీ, ఇచ్ఛాపురం, పరిసర ప్రాంతాల్లో నుంచి హాజరయ్యారు. అప్పటి బాలికొన్నత పాఠశాల ఏ యూ పి స్కూల్, ఎస్ యు పి స్కూల్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు పొట్టా తాయారమ్మ, పరపటి జయలక్ష్మి, ఎన్.ఉమామహేశ్వరి, జ్ఞానేశ్వరి, ద్రాక్షావతి, షావుకారు లక్ష్మి కొణతాల మోహనరావు, వడ్డిన కేశవరావు, జన్నెల శంకరరావు, బాకి ఢిల్లీరావు, రాము ఉపాధ్యాయులను సన్మానించి పూజించారు. ఆటపాటలతో మిత్రులు అలరించారు. కార్యక్రమంలో దాసరి రాజు, తెన్నేటి తేజేశ్వర శర్మ, రాష్ట్ర రెడ్డిక వెల్ఫేర్ కార్పోరేషన్ చైర్మన్ కొండా శంకర్ రెడ్డి, కాళ్ళ నరసింహమూర్తి, న్యాయవాది, రాంబాబు, మాటూరి కిషోర్, జన్నెల జయరాం, పొట్టా రాజు, బత్తుల తిరుమల రావు, బత్తుల క్రిష్ణయ్య గుజ్జు నారాయణరెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురంలో వివాహిత ఆత్మహత్య



**ఇచ్ఛాపురం, జులై 12, ప్రభాతవార్త:**

మండలం, ధర్మపురం గ్రామానికి చెందిన మరల రుక్మిణిమ్మ అనే మహిళ గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నందిక ధనలక్ష్మి ఒడిశా రాష్ట్రం, గంజాం జిల్లా, రొంపా గ్రామానికి చెందిన నందిక లోకనాథంకు ఇచ్చి ఎనిమిదేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి నందిక రక్షిత్ అనే సుమారు 7 సంవత్సరాల వయస్సు గల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం అతడు 2వ తరగతి చదువుతున్నాడు. ధనలక్ష్మి భర్త లోకనాథం విదేశాల్లో కూలి పనులు చేస్తూ ఉంటాడు. అయితే, వివాహం జరిగినప్పటి నుండి అతడు ధనలక్ష్మిని తరచూ మానసికంగా వేధిస్తూ, "నీవు నాకు నచ్చలేదు, నువ్వు మీ ఇంట్లోనే ఉండిపో, చనిపోతే చచ్చిపో" అని అవమానకరంగా మాట్లాడేవాడని, ఈ విషయమై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు రాజీ ప్రయత్నాలు జరిగినట్లు భర్త మాటల వల్ల తీవ్ర మనస్తాపానికి గురైన ధనలక్ష్మి, ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తల్లి మరడ రుక్మిణి ఇచ్చిన పిర్యాదు మేరకు ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఆర్.జనార్ధనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజాస్వామ్యానికి జర్నలిస్టులే వెన్నెముక : ఎమ్మెల్యే



**ఆమదాలవలస, జులై 12, (ప్రభాతవార్త):**

ప్రజాస్వామ్యానికి జర్నలిస్టులే వెన్నెముక అని ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏపీజేఎఫ్ జిల్లా మహాసభలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కూన రవికుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు వారధిగా పని చేస్తున్నారన్నారు. వాస్తవాలను నిష్పక్షపాతంగా ప్రజలకు అందించడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో మీడియా పాత్ర ఎంతో కీలకమని రవి కుమార్ అన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా జర్నలిస్టులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకుంటూ సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం, వారి వృత్తి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రవికుమార్‌కు జర్నలిస్టులు శాలువతో సత్కరించారు. ఈ జిల్లా మహాసభల్లో జిల్లా, రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రగాఢ సంతాపం



**కంచిలి, జులై 12, ప్రభాతవార్త :**

గొల్ల కంచిలి గ్రామానికి చెందిన కొల్లి లింగయ్య మరియు కంచిలి మెయిన్ రోడ్డుకు చెందిన కలియ పున్నమ్మల మృతి పట్ల కంచిలి మండల జడ్పీటీసీ, మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు, మాజీ పి.ఏ.సి.ఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాసు స్థానిక సర్పంచ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని కోరారు.

# గడువులోగా డిజిటలైజేషన్ పూర్తిచేయాలి

## - టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి



**కోటబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త :**

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను టెక్కలి ఆర్డీఓ ఎన్.కృష్ణమూర్తి ఆదేశించారు. ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చింతలపూడి ప్రసాదరావు, ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్, ఏపీవో జి.హరిప్రసాద్, రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా సర్ కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, డిజిటలేజేషన్ ప్రగతి, ఓటర్ల మైగ్రేషన్ తదితర వివరాలు బిఎల్వోలను అడిగి తెలుసుకున్నారు. 18 ఏళ్లు పూర్తయి అర్హత గల వారిని గుర్తించి వెంటనే ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. అలాగే కోటబొమ్మాళిలోని వివిధ పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న సర్ ప్రక్రియను ఆయన తహసీల్దార్ కలిసి పరిశీలించారు.

# అసంపూర్తి అంగన్వాడీ భవనాన్ని పూర్తి చేయాలి



**సీతంపేట, జులై 12, ప్రభాతవార్త:**

పూతికవలస సచివాలయం పరిధిలోని చింతమాను కోలనిలో నిర్వహిస్తున్న అంగన్వాడీ భవనం అసంపూర్తిగా ఉండడంతో పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ భవనం మంజూరు చేసినప్పటికీ, నిర్మాణ పనులను అసంపూర్తిగా వదిలివేశారు. దీంతో నేటికీ అంగన్‌వాడీ కేంద్రం ఒక ఇంటిలోనే నిర్వహిస్తున్నారు. దీనివల్ల చిన్నారులు, గర్భిణీలు బాలింతలు తగిన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసే దిశగా చేపట్టిన చర్యల్లో భాగంగా, మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయడం, అలాగే అంగన్‌వాడీ కార్యకర్తను టీచర్‌గా పదోన్నతి కల్పించడం పట్ల చింతమాను కోలని గ్రామ ప్రజల తరపున ప్రభుత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు గ్రామస్తులు తెలియజేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించి, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సురక్షితమైన, పరిశుభ్రమైన మెరుగైన వాతావరణంలో సేవలు అందేలా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# పోలింగ్ స్టేషన్ల తనిఖీ



**సంతకవిటి, జులై 12, ప్రభాతవార్త:**

సర్ సర్వేలో భాగంగా సంతకవిటి మండలం మండవ కురిటి గ్రామంలోని పలు పోలింగ్ స్టేషన్‌ల్లో ఆరఐ కృపారావు ఆదివారం తనిఖీ చేశారు. స్పెషల్ క్యాంపెయిన్ సందర్భంగా 260, 261, 262, 264 పి.ఎస్‌లో ఎన్యూమరేషన్ ఫారాలను, డేటాను బి ఎల్ వో విజయవంతంగా డిజిటలైజేషన్ చేసి ఆన్లైన్‌లో అప్లోడ్ చేస్తున్నారు. సర్వే పూర్తి చేయడానికి తక్కువ సమయం ఉండటం వలన బిఎలఓలు త్వరగా పని పూర్తి చేయాలని సూచించారు. ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా ఈ ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# యువతకు క్రికెట్ కిట్ అందించిన ప్రసాద్ రెడ్డి



**సంతబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త :**

మండలంలోని గోవిందపురం పంచాయతీ ఎరకన్నపేట కాలనీ యువతకు క్రికెట్ కిట్, షర్ట్స్ తమ సొంత నిధులతో వైఎసఆర్‌సీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు రెయ్యి ప్రసాద్ రెడ్డి అందించారు. వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి పురస్కరించుకొని గోవిందపురం మాజీ సర్పంచ్ రెయ్యి రామిరెడ్డితో కలసి ప్రసాద్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో గోవిందపురం మాజీ ఉపసర్పంచ్ కంబాల ఈశ్వర్ రెడ్డి వార్డు మెంబర్ ఎడ్ల పెంటయ్య, యువత పాల్గొన్నారు.

# రక్షిత నీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు



**టెక్కలి, జులై 12, ప్రభాతవార్త:**

మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రారంభించిన కొద్రవీధి నూతన రహదారికి ఇరువైపులా కొత్త రక్షిత మంచినీటి సరఫరా పైపులైన్లను, పబ్లిక్ ట్యాప్‌లతో సహా ఏర్పాటు చేస్తున్నారు. టెక్కలి గ్రామపంచాయతీ పరిధిలో నౌపడ-మెలియాపుట్టి రహదారి నుంచి పాత జాతీయ రహదారి (సుదర్శన థియేటర్) వరకు అనుసంధానమైన, కీలకమైన కొద్రవీధి నూతన రహదారికి రెండు వైపులా పబ్లిక్ ట్యాప్‌లతో కూడిన రక్షిత మంచినీటి సరఫరా పైప్లైన్ పనులను యుద్ధ ప్రాతిపదికన ఆర్‌డబ్ల్యుఎస్ విభాగానికి చెందిన డిప్యూటీ ఇంజనీర్ రామకృష్ణ, అసిస్టెంట్ ఇంజనీర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో చేపడుతున్నారు.

# మున్సిపాలిటీలో సర్ ప్రోగ్రాం పోస్టర్లకే పరిమితం

**రాజాం, జులై 12, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా సర్ (స్పెషల్ ఇంటెన్స్ రివిజన్) ప్రోగ్రాం చేపడుతుంది. దేశంలో నకిలీ ఓట్లు, అలాగే ఓటరుకు రెండు చోట్ల ఓట్లు గుర్తించడం కోసం ఈ ప్రోగ్రాం ప్రవేశపెట్టింది. గతంలో పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, పలు రాష్ట్రాల్లో ఎన్నికల్లో నిర్వహిస్తే దేశ జనాభా కంటే ఓట్లే ఎక్కువగా నమోదు అయ్యాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి ప్రభుత్వాన్ని వివరణ కోరగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇలాంటి ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ప్రచార సాధనాలు సహాయంతో తెలియజేయాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం ఎంతో ఖర్చుతో చేపట్టిన ఈ స్పెషల్ ప్రోగ్రాం మాత్రం ప్రజలకు అవగాహన కల్పించకుండా తూతూ మంత్రంగా పోస్టర్‌లను ఏర్పాటు చేసి చేతుల దులుపుకునే ప్రయత్నంలో ఉన్నట్లు తెలుస్తుంది. మున్సిపాలిటీలో కొన్ని చోట్ల బూత్ లెవెల్ అధికారులు ప్రతి ఓటరుకు అవగాహన కల్పించకుండా అలాగే ఇంటింటా సర్వే చేయకుండా వివరాలు సేకరిస్తున్నట్లు, స్థానికులు చెప్పుకొస్తున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమంపై రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు దృష్టి పెట్టి ప్రతి ఒక్క ఓటర్‌కు తమ ఓటు హక్కు ఉండేటట్లుగా చర్యలు తీసుకోవాలి.

# ప్రతీ ఎకరాకు యూరియా అందిస్తాం : ఏవో



**సంతబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త :**

సంతబొమ్మాళి మండలంలో తొలకరి వరి సాగు నిమిత్తం వరి సాగుచేసే ప్రతీ ఎకరానికీ మొదటి డోస్ వినియోగానికి అన్ని ఆర్ ఎస్ కె పరిధిలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా బస్తాలను సిద్ధంగా ఉంచామని మండల వ్యవసాయాధికారి రాళ్లపేట అప్పారావు తెలిపారు. నరసాపురం, డిజి పురం, పాలతలగం, రుంకుహనుమంతపురం, హెచ్.ఎన్.పేట రైతుసేవా కేంద్రాలకు నేడు చేరుకున్న యూరియా దిగుమతి విధానం పర్యవేక్షిస్తూ మాట్లాడారు. ప్రస్తుతం 11300 బస్తాల యూరియా చేరుకోగా మండలంలోని ప్రైవేటు ఎరువుల వర్తకుల వద్ద సుమారు 2350 బస్తాల యూరియా అందుబాటులోకి రావడం సంతబొమ్మాళి మండల రైతులకు శుభపరిణామం అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా నిర్దేశించిన ఆపాయిమ్స్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీ ఎరువులకు అత్యంత సౌకర్యవంతంగా ఉందని అన్నారు. యూరియా పంపిణీ మండలంలోని వివిధ రైతుసేవా కేంద్రాల పరిధిలో నిర్దేశించిన తేదీల్లో రైతులకు ముందస్తు సమాచారంతో క్రమ పద్ధతిలో వ్యవసాయశాఖ, సంతబొమ్మాళి పి.ఏ.సి.ఎస్ సిబ్బంది ద్వారా సంయుక్తంగా పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతీ రైతు వారి భూమి రికార్డులకు ఖచ్చితంగా ఆధార్ అనుసంధానం ఉండేలా జాగ్రత్త పడాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి గొండు శ్రీధర్, వి.ఏ.ఏ లు బాలచంద్ర, గణేష్, తోటాడ సర్పంచ్ ప్రతినిధి రామరాజు, పి ఏ సి ఎస్ సిబ్బంది నరేష్, తిరుపతి, రాము, తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలం

## వైకాపా నియోజవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్



**ఆమదాలవలస, జులై 12, (ప్రభాతవార్త):**

రైతులకు యూరియా అందించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైకాపా సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆరోపించారు. ఆదివారం వైకాపా కార్యాలయంలో మీడియా సమావేశములో మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గం టెక్కలిలో యూరియా దొరక్క పినకాన కాంతమ్మ మరణించడం దారుణమన్నారు. యూరియా కోసం కాంతమ్మ మహిళ ప్రాణాలు కోల్పోయిందని ఇది ప్రభుత్వ హత్యలేనని మండిపడ్డారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు నియోజకవర్గంలో రైతులు యూరియా అందకపోవడం మహిళ మృతి చెందడం దురదృష్టకరమన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వ్యవసాయం చెయ్యొద్దన్నట్లు మాట్లాడుతున్నారని, ఎరువులు వాడితే క్యాన్సర్ వస్తుందని చెప్పడం సరికాదని అన్నారు. జిల్లాలో వ్యవసాయ శాఖ మంత్రి ఉండి జిల్లా ప్రజలకు ఎరువులు అందకపోవడం మంత్రి నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వానికి రైతులు పట్ల చిత్తశుద్ధి లేదని, రైతులకు సకాలంలో ఎరువులు అందించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఎకరానికి ఒక బస్తా యూరియా మాత్రమే ఇస్తే రైతులకు ఎలా సరిపోతుందని ప్రశ్నించారు. ప్రైవేటు డీలర్ల దగ్గర యూరియా దొరకడం, ప్రభుత్వం నిర్ణయించిన ధరలకంటే సుమారు నలభై శాతం ఎక్కువగా యూరియా విక్రయిస్తున్నారని మరి ప్రైవేటు డీలర్ల దగ్గర యూరియా ఎలా దొరుకుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, అన్నెపు కృష్ణ, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

**కోటబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త :**

మండలం పొడుగుపాడు గ్రామ సమీపంలో టెక్కలి నుండి శ్రీకాకుళం వైపు పోవు వెళుతున్న మోటార్ సైకిల్ నడుపుతున్న సోంపేటకు చెందిన బలగ సతీష్ (27)ను అదే మార్గంలో వెళుతున్న గుర్తు తెలియని కంటైనర్ లారీ ఢీకొంది. సంఘటనలో సతీష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఢీకొన్న కంటైనర్ లారీ ఆపకుండా తప్పించుకుని వెళ్ళిపోయాడు, సంఘటనతో ఆ మార్గం పూర్తిగా ట్రాఫిక్ జామ్ కావడంతో, హైవే సిబ్బంది సమాచారం తెలుసుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం స్థానిక సామాజిక ఆసుపత్రికి తరలించారు.

# తేజ కుటుంబానికి అండగా స్నేహితులు



**కవిటి, జులై 12, ప్రభాతవార్త :**

అకాల మరణం చెందిన తేజ కుటుంబానికి తోటి స్నేహితులు సుమారు 43 వేల రూపాయలు ఆర్థిక సహకారం అందించి ఆదుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మండలం సీమూరు గ్రామానికి చెందిన తేజ అకాల మరణం చెందాడు. తేజ బూర్జపాడు పాఠశాలలో 2007 బ్యాచ్కు చెందిన విద్యార్థి తేజ మృతితో ఆ కుటుంబం ఆర్థికంగా మానసికంగా తీవ్రఇబ్బందుల్లో ఉండడం తెలుసుకున్న తోటి స్నేహి తులు ఆదివారం ఆర్థిక సహకారం అందించి ఆదుకున్నారు.

# పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన నవీన్ కుమార్





**రాజాం, జులై 12, ప్రభాతవార్త :**

రాజాం పట్టణ నూతన సిఐగా డి.నవీన్ కుమార్ బాధ్యతలు చేపట్టారు. ముందుగా పోలీస్ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో మర్యాద పూర్వకంగా స్వాగతం తెలిపారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు, అలాగే ట్రాఫిక్ సమస్య మరింత మెరుగుపరిచే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. పట్టణ ప్రజలు పోలీసులతో స్నేహభావంతో మెలిగి సహకరించాలని కోరారు.

# వైభవంగా దేశి తల్లి అమ్మవారి వారాలు



**వీరఘట్టం, జులై 12, ప్రభాతవార్త :**

మండలంలోని నడిమికెల్ల గ్రామంలో ఆదివారం దేశి తల్లి అమ్మవారి వారాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ప్రజలంతా భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలిచారు. ఈ వారాల్లో గ్రామ మాజీ సర్పంచ్ ముద్ద వెంకటరమణ, సత్యవతి దంపతులు పాల్గొని స్వయంగా అమ్మవారి ఘటాలను తీసుకువెళ్లి గ్రామంలోని రైతులు, ప్రజలు అందరూ ఆయురారోగ్యాలతో బాగుండాలని, పంటలు బాగా పండాలని, గ్రామం అంత సుభిక్షంగా ఉండాలని దేశి తల్లి అమ్మవారిని ప్రత్యేకంగా వారు వేడుకొన్నారు. అమ్మవారి వారాలతో గ్రామం అంతా సందడిగా మారింది.

# శ్రీకాకుళం వార్త



# స్వార్థ ప్రయోజనాల కోసం చేపలన్నీ మాయం



**పలాస, జులై 12, ప్రభాతవార్త :**

పలాస నియోజకవర్గంలో మేజర్ పంచాయతీ బ్రాహ్మనతర్లా గ్రామంలో స్వార్థ ప్రయోజనాల కోసం లక్ష రూపాయల విలువ గల చేపలను అమ్ముకోవడంతో గ్రామానికి తీవ్ర అన్యాయం జరిగిందని పంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యుడు సుభాష్ చంద్ర బోస్ ఆరోపించారు. పాత్రుని కోనేరు చేపల వ్యవహారం గమనిస్తే ప్రతి ఏడాది సుమారు మార్కెట్ పాట లక్ష రూపాయలకు దాటి వెళ్ళేది కానీ ప్రస్తుతం అదే గ్రామానికి సంబంధించిన వడ్డి యాదగిరి, కంసాల వెంకటరావు, కృష్ణ మరి కొంతమందితో కలిసి చెరువు మరమ్మత్తు చేస్తామనే నెపంతో లక్షలు విలువ చేసే చేపలను పట్టి అమ్మటం జరిగింది. గ్రామంలో జరుగుతున్న ఈ అన్యాయాన్ని ప్రజలు, అధికారుల దృష్టిలో పెట్టడానికి తను మీడియా ముందుకు వచ్చినట్టు తెలిపారు. ఆదివారం ఈ విషయాన్ని అధికారులు ఎంపీడీవోకు, గ్రామ కార్యదర్శికి తెలియజేస్తే మాకు ఏమీ తెలియదని సమాధానం ఇచ్చారు. కాబట్టి తక్షణమేపై అధికారులు దీనిపై స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# నూతన ఆలయంలో సంతోషిమాత విగ్రహం ఏర్పాటు



**హిరమండలం, జులై 12, ప్రభాతవార్త :**

హిరమండలం మండలం శుభలయ ఆరఆర్ కాలనీ, న్యూ గొట్టా బ్యారేజీ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలోకి ఆదివారం సంతోషిమాత విగ్రహాలను గ్రామస్తులు పునఃప్రతిష్ట చేశారు. ప్రస్తుతం ఉన్న ఆలయం ప్రదేశంలో ఉద్దానం ఫేజ్ 2 తాగునీటి ప్రాజెక్టు పనులు జరుగుతున్నందున ఆలయాన్ని వేరే చోటుకు మార్చాలని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. ఆ మేరకు న్యూ బ్యారేజీ సెంటర్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న స్థలంలో తాత్కాలికంగా గ్రామస్తులు ఆలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలోకి సంతోషిమాత విగ్రహాలను సాంప్రదాయబద్ధంగా మంగళ వాయిద్యాలు మధ్య పురోహితులు గ్రామస్తులు విగ్రహాలను తీసుకువెళ్లి పునఃప్రతిష్ట చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ అధికారులు కేటాయించిన స్థలంలో నూతన ఆలయం నిర్మాణానికి అంధ్ర సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. అంతవరకు ఈ ఆలయంలో సంతోషిమాతకు భక్తులు పూజలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో యువకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# బాలకవానిపేటలో ఈగల దండయాత్ర

## -ప్రత్యేక బృందాలతో నివారణకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం



**కోటబొమ్మాళి, జులై 12, ప్రభాతవార్త:**

టెక్కలి మండలం బూరగాం పంచాయతీ పరిధిలోని బాలకవానిపేట గ్రామంలో గత కొన్ని రోజులుగా నెలకొన్న తీవ్రమైన ఈగల సమస్యపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రంగా స్పందించారు. గ్రామంలో కేవలం 13 ఇళ్లు ఉన్నప్పటికీ, వేలాదిగా ఈగలు దండెత్తి ప్రజలను నరకయాతనకు గురి చేస్తున్న ఉదంతంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నివాసాల్లోకి దూరి ఆహార పదార్థాలు, తాగునీటిలో ఈగలు పడిపోతుండటంతో గ్రామస్థులు కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్న వైనంపై మంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు.ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారితో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఫోన్‌లో మాట్లాడారు. బాధితులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్ట్యా, గ్రామంలో తక్షణమే ఒక ప్రత్యేక వైద్య బృందాన్ని రంగంలోకి దించాలని ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈగల బెడద భవిష్యత్తులో మరలా పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపడంతో పాటు, ప్రస్తుత నివారణ కోసం అవసరమైన రసాయన మందులను పెద్ద ఎత్తున పిచికారీ చేయించాలని అధికారులకు సూచించారు. మరోవైపు, క్షేత్రస్థాయిలో సమస్య తీవ్రతను తగ్గించేందుకు పంచాయతీ కార్యదర్శి బాబూరావు ఆధ్వర్యంలో గ్రామంలో ఇప్పటికే ప్రత్యేక మందుల పిచికారీ ప్రక్రియను ప్రారంభించారు. బాధితులకు ఊరట కలిగించేలా అన్ని ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ ముమ్మర చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు వెల్లడించారు.

# మున్సిపాలిటీలో ఇంటింటా చెత్త సేకరణ

## వార్త ప్రభావం



**రాజాం, జులై 12, ప్రభాతవార్త :**

రాజాం మున్సిపాలిటీలు రోజువారి చెత్తను సేకరించడం లేదు అనే శీర్షికను వార్త దినపత్రికలో ప్రచురించగా మున్సిపల్ కమిషనర్ ఆకురాతి రామచంద్రరావు వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికులతో చెత్తను సేకరించే విధంగా చర్యలు చేపట్టారు. ఇకనుండి ప్రతిరోజు ఇంటింటికి తిరుగుతూ చెత్తను సేకరించే దిశగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ విధంగా చర్యలు చేపట్టినందుకు గాను మున్సిపల్ కమిషనర్ తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# కార్గో ఎయిర్‌పోర్టుపై భగ్గుమన్న ఉద్దానం రైతాంగం

## మంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో తీవ్ర ఉద్రిక్తత



**పలాస, జులై 12, ప్రభాతవార్త:**

మందస మండలంలో ప్రతిపాదిత కార్గో ఎయిర్‌పోర్టు నిర్మాణంపై స్థానిక ఉద్దానం రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, స్థానిక శాసనసభ్యురాలు, జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ మరియు ఇతర ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ సభ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సభలో పాల్గొన్న స్థానిక రైతులు మైక్ అందుకుని తమ ఆవేదనను, నిరసనను బహాటంగా వెళ్లగక్కారు. ఈ ప్రాంతంలో కొబ్బరి, జీడిమామిడి, పనస వంటి అంతర పంటలతో నిరంతరం ఆదాయం ఇచ్చే పచ్చని భూములు ఉన్నాయని, వీటిని నాశనం చేయవద్దని కోరారు. ఒక కొబ్బరి చెట్టును పెంచి, అది కాపుకు రావడానికి ఒక రైతుకు కనీసం 10 నుండి 15 సంవత్సరాల కాలం పడుతుందని, తమకు కొబ్బరి చెట్టు చనిపోతే ఇంట్లో మనిషి చనిపోయినంత బాధ కలుగుతుందని కన్నీరు పెట్టుకున్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, ఈ ప్రాంతంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనుకుంటే నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములు లేదా కొండ ప్రాంతాలను పరిశీలించాలని, పంట భూములను వదిలిపెట్టాలని డిమాండ్ చేశారు. గత 20 నెలలుగా తాము మానసిక ఆవేదన అనుభవిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### సభలో ఉద్రిక్తత-పోలీసుల మోహరింపు

సభ జరుగుతున్న సమయంలో రైతులు, యువకులు ఒక్కసారిగా ముందుకు దూసుకురావడంతో సభలో గందరగోళం నెలకొంది. నినాదాలతో సభా ప్రాంగణం హోరెత్తింది. పరిస్థితి చేజారకుండా ఉండేందుకు భారీగా మోహరించిన మహిళా మరియు పురుష పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి రైతులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు.

### రైతుల సమ్మతితోనే ముందడుగు: మంత్రి రామ్మోహన్ నాయుడు

సభలో నెలకొన్న గందరగోళంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారు. "మేము ఇక్కడికి ఎవరితోనూ గొడవ పడటానికి లేదా యుద్ధం చేయడానికి రాలేదు. మీ అభిప్రాయాలను, ఆవేదనను వినడానికే వచ్చాం. అందరికీ ఆమోదయోగ్యంగా, రైతుల సమ్మతితోనే నిర్ణయాలు ఉంటాయి తప్ప, ఎవరినీ బలవంతం చేయం" అని స్పష్టం చేశారు.

13 -7Pg9th chel Mon.qxd:13 -7Pg9th chel Mon.qxd 1/1/02 6:14 AM Page 1



# లక్ష్యం దిశగా నడవాలన్నా..



ఆడపిల్లలుగా పోటీ ప్రపంచంలో నెగ్గుకురావాలంటే ఎన్నో అవాంతరాలు ఎదురుకావొచ్చు. అలాగని ప్రతి చిన్నదానికీ నిరాశపడితే మీరు మరింత బలహీనంగా మారొచ్చు. లక్ష్యం దిశగా నడవాలన్నా, శక్తిని పుంజుకోవాలన్నా.. మీ అలవాట్లను, ఆలోచనా శైలినీ ఇలా మార్చుకుని చూడండి.

చాలామంది తమలో లేనివి ఏంటో గమనించుకోవడం వదిలేసి.. ఇతరులతో పోటీపడుతుంటారు. ఇలాంటి పోలిక, పోటీ మీకు మేలు చేయకపోగా అది దక్కనప్పుడు ప్రతికూల ఆలోచనలు ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఫలితంగా మిమ్మల్ని మరింత నిరాశలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. ఎదుటివారి విజయాన్నీ మనస్ఫూర్తిగా స్వీకరించండి. మీలోని లోపాల్ని బేరీజు వేసుకోండి. మీ బలహీనతల్ని సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. పురుషాధిక్యత, ఇతర సామాజిక పరిస్థితులు మీకెన్నో ఆంక్షల్ని అడ్డుపెట్టొచ్చు. అంత మాత్రాన మీ ప్రయాణాన్ని ఆపేయాల్సిన అవసరం లేదు. దానికోసం మనలోని శక్తిని వందశాతం వినియోగించు కోవడానికి ప్రయత్నించాలి. అప్పుడే మీ శక్తి సామర్థ్యాల మీద వాస్తవిక అంచాన రావడంతోపాటు, లోటుపాట్లను సరిదిద్దుకునే అవకాశమూ దక్కుతుంది. విశాల ప్రపంచంలో అవకాశాలు అపారం. వాటిని అందుకోవా లంటే.. ముందు మనపై మనకు నమ్మకం ఉండాలి. ఏదైనా లక్ష్యం చేరుకోవాలను కున్నప్పుడు మాట్లాడాల్సిన ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యం. దానికోసం ఎప్పటి కప్పుడు మిమ్మల్ని మీరు అప్‌డేట్ చేసుకోవ డానికి ప్రయత్నించండి మీరు చేరుకునే వ వార్గంలో మీకు ఇదెంతో తోడ్పడుతుంది.

# వీటికి దూరంగా ఉండడమే మేలు!

మధుమేహం ఉన్నవారితోపాటు, అధిక బరువు తగ్గాలనుకునే కొంతమంది చక్కెరకు బదులుగా కృత్రిమ తీపి పదార్థాలను తీసుకుంటుంటారు. అయితే వీటితో కొన్నిటిలో ఆస్పర్టేమ్‌ని ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ఇది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో కృత్రిమ తీపి పదార్థాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల్లాగే కృత్రిమ తీపి పదార్థాలు కూడా అందరికీ



పడకపోవచ్చు. కొంతమందిలో వీటిని తీసుకోవడం ద్వారా కడుపుబ్బరం, జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి వీలైనంతవరకు వీటికి దూరంగా ఉండడమే మంచిదంటున్నారు.

**క్యాలరీల విషయంలో...** కృత్రిమ తీపి పదార్థాల్లో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కొన్ని పదార్థాల్లో అయితే అసలు క్యాలరీలే ఉండవు. అందుకే కొంతమంది తమ ఫిట్‌నెస్ కాపాడుకోవడా నికి, బరువు తగ్గడా నికి ప్రయత్నించే వారు కూడా కృత్రిమ తీపి పదార్థాలను తమ ఆహారంలో భాగం చేసుకుంటారు. అయితే ఆరోగ్యకరమైన బరువు ఉండాలంటే శరీరానికి అవసరమైన నిర్ణీత క్యాలరీల విషయంలో రాజీ పడకూడదంటున్నారు నిపుణులు.

**సహజసిద్ధమైనవే...** కృత్రిమ తీపి పదార్థాలు సహజ సిద్ధంగా లభించే పదార్థాలను ఎప్పటికీ భర్తీ చేయలేవు. కాబట్టి తక్కువ క్యాలరీలు ఉన్న తీపి పదార్థాల కోసం సహజంగా లభించే పదార్థాలను ఉపయోగించడమే మంచిదంటున్నారు నిపుణులు. వీటిని తీసుకోవడం వల్ల కేవలం రుచి మాత్రమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందే అవకాశం ఉంటుంది.

**నిపుణులను సంప్రదించాలి..** అలాగే మధుమేహ రోగులకృత్రిమ తీపి పదార్థాలను వాడే విషయంలో సంబంధిత వైద్య నిపుణులను సంప్రదించడం మంచిది.

**నీటి మోతాదు తగ్గకుండా..** మనం ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ తగినన్ని నీళ్ల తీసుకోవడం తప్పనిసరి. అయితే కొంతమంది కృత్రిమ తీపి పదార్థాలు ఉన్న పానీయాలు తీసుకున్నప్పుడు నీళ్ల తాగరు. కానీ, ఇలాంటప్పుడు కూడా నీళ్ల తాగాలంటూన్నరు నిపుణులు. నీళ్ల శరీరంలోని మలినాలను తొలగించి డీ హైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి.

# పెద్దమ్మాయికి బాధ్యత ఎక్కువ !



చిన్నదానికి దెబ్బ తగిలింది, కూడా ఉన్నావుగా.. చూసుకోలేదా.. అంటూ ఇంట్లో పెద్ద పిల్లలను అజమాయిషీ చేస్తారంతా. తీరా చెల్లిలికన్నా పెద్దమ్మాయిది రెండేళ్లు ఎక్కువ ఉంటుంది. అయినా చిన్నవాళ్ల బాధ్యత పెద్దవాళ్లదే అంటారంతా. దీంతో పాటు పుట్టిన క్రమం పిల్లల వ్యక్తిత్వాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందంటున్నాయి పలు పరిశోధనలు.

సంతానంలో పిల్లలు పుట్టే క్రమం వారి స్వభావం, ప్రవర్తనను ప్రభావితం చేస్తాయంటున్నాయి అధ్యయనాలు. అందరికన్నా పెద్దవాళ్ల కుటుంబంలో బాధ్యతగా, నాయకత్వ స్థానంలో ఉంటాయి. తల్లి దండ్రుల ఏకాగ్రత, అడిగిందల్లా పొందడం వంటివన్నీ ముందుగా వీరికే దక్కుతాయి. దీంతో అందరి ప్రేమ దక్కి తాము కూడా స్నేహభావం తో ఉంటారు. తన తర్వాత పుట్టిన పిల్లల బాధ్యత రావడంతో బాధ్యతాయుతంగా మారతారు. తమ్ముడు అల్లరి చేస్తే తప్పు అని చెప్పాలి కదా అనే తల్లిదండ్రుల మాటలతో తనకన్నా చిన్న వారికి తాను రోల్‌మోడల్‌గా ఉండాలనే వ్యక్తిత్వం వస్తుంది.

**మధ్యవాళ్లు..** తనకన్నా పెద్దవాళ్ల, చిన్నవాళ్లకు మధ్య సతమతుల్యంగా ఉంటారు. తమకంటూఐ గుర్తింపు పొందడానికి కృషి చేస్తూ, నైపుణ్యాలను పెంచుకుంటారు. తమకన్నా పెద్దవారికి, చిన్నవారికి సహకారాన్ని అందిస్తూ, వాళ్ల మధ్య వచ్చే విభేదాలకు మధ్యవర్తిత్వం వహిస్తారు. ఇక, చివరి పిల్లలు పుట్టే సమయానికి తల్లిదండ్రులకు పెంపకంలో అనుభవం వస్తుంది. ఒత్తిడికి గురికాకుండా పెంచడంవల్ల ఈ పిల్లల్లో ఆందోళన ఉండదట. అందరి ప్రేమ పొంది గారంగా పెరుగుతారు. నిర్లక్ష్యం వైఖరి వస్తుంది. నియమాలు, నిబంధనలు సడలి సాహసోపేతంగా ఉంటారు.

**ఒకే ఒక్కరైతే...** తల్లిదండ్రుల నుంచి ఎక్కువ ప్రేమ దొరుకుతుంది. పోటీ లేకుండా పెరుగుతారు. మనసుకు నచ్చింది చేస్తారు. అమ్మానాన్నతో ఎక్కువ గడుపుతారు. అయితే అనుకున్నది అందకపోతే తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. ఉన్నతవిద్యను అభ్యసించడంలో, సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకోవడంలో ముందుంటారట. పిల్లల వరుసక్రమం ప్రకారం కాకుండా, ప్రతి సంతానం వ్యక్తిగత జలాలను పెంపొందించేలా తల్లిదండ్రులు మద్దతు అందించగలిగితే వాళ్ల వ్యక్తిత్వాన్ని సరైన రీతిలో మలచొచ్చు అంటున్నారు నిపుణులు.

## వెలుగు దీపం

బౌద్ధ సాహిత్యంలో ప్రాచీన గ్రంథాలలో ధమ్మపదం ఒకటి. ఇది భగవాన్ గౌతమ బుద్ధుడు బోధించిన అమూల్యమైన ధర్మ సూత్రాల సంకలనం. ధమ్మపదం అంటే "ధర్మానికి చూపే పదాలు" లేదా "ధర్మ వచనాలు" అని అర్థం. ఇందులోని ప్రతి గాథ మానవ జీవితాన్ని సత్యం, శాంతి, కరుణ, జ్ఞానం వైపు నడిపించే దివ్య సందేశాన్ని అందిస్తుంది. "మనస్సే అన్ని కార్యాలకు మూలం" అని బుద్ధుడు మనస్సు గొప్పతనాన్ని వివరిస్తాడు .మన ఆలోచనలు పవిత్రంగా ఉంటే మన మాటలు, మన చేతలు కూడా పవిత్రంగా ఉంటాయి. మంచి ఆలోచన లు మంచి జీవితానికి పునాది అని ధమ్మపదం బోధిస్తుంది.ధమ్మపదం ప్రధాన సందేశం అహింస, కరుణ, మైత్రి. ద్వేషాన్ని ద్వేషంతో కాదు, ప్రేమతోనే జయించవచ్చని బుద్ధుడు బోధించాడు. ఈ బోధన నేటి సమాజంలో కూడా ఎంతో ప్రాసంగికమైనది. క్షమాగుణం, దయ, సహనం, పరస్పర గౌరవం వంటి విలువలను అలవర్చుకోవడం ద్వారా వ్యక్తి మాత్రమే కాదు, సమాజం కూడా శాంతి మయంగా మారుతుంది. ధమ్మపదం మనకు సత్యం, ధర్మం, నియమశీలత ప్రాముఖ్యతను తెలియజేస్తుంది. ఇంద్రియా లను అదుపులో ఉంచుకొని, చెడు ఆలోచన లను విడిచిపెట్టి, సత్కార్యాలను ఆచరించే వ్యక్తి నిజమైన విజేత అని బుద్ధుడు పేర్కొన్నాడు. వేల మందిని యుద్ధంలో జయించడం కంటే తన మనస్సు ను జయించిన వాడే గొప్పవాడని ధమ్మపదం ప్రకటిస్తుంది.ఈ ప్రపంచంలోని సంపదలు, కీర్తి, భోగాలు శాశ్వతం కావు. కానీ ధర్మం, సద్గుణాలు, సేవాభావం మాత్రం మన జీవి తాన్ని చిరస్థాయిగా గొప్పదిగా నిలబెడతాయి. ధమ్మపదం మనకు మానసిక ప్రశాంతతను, ఆధ్యాత్మిక బలాన్ని, నైతిక జీవనానికి అవసర మైన మార్గదర్శకత్వాన్ని అందిస్తుంది. మతంతో సంబంధం లేకుండా ప్రతి మనిషి ఈ గ్రంథం లోని బోధనలను ఆచరిస్తే వ్యక్తిగతంగా సంతో షాన్ని, సామాజి కగా శాంతిని పొందగలడు. సత్యం, కరుణ, అహింస, సహనం, ఆత్మ నిగ్రహం, జ్ఞానం వంటి మహోన్నత విలువ లను మన జీవితంలో ఆచరించమని పిలుపు నిచ్చే దివ్య గ్రంథం. ధమ్మపదంలోని బోధన లను మన దైనందిన జీవితంలో అనుసరించి నప్పుడు మన వ్యక్తిత్వం వికసిస్తుంది, కుటుంబంలో ఆనందం పెరుగుతుంది, సమాజంలో శాంతి నెలకొంటుంది. ఈ పవిత్ర ధర్మవచనాలు ప్రతి హృదయానికి వెలుగునిచ్చి, మానవాళిని శాశ్వత శాంతి మరియు మోక్షమార్గం వైపు నడిపించుగాక.

# పుస్తక పఠనమే..



**కొంతమంది పిల్లలు గట్టిగా బయటకు చదివితే నెమ్మదిగా చదవలేవా అంటూ తిడుతుంటాం. కానీ ఇలా పుస్తక పఠనం చేయడం వల్ల కొన్ని ప్రయోజనాలు ఉన్నాయంటు న్నారు. నిపుణులు. అవేంటంటే..**

పిల్లలు పుస్తకంలో పదాలను గుర్తిస్తూ బయటకు చదివేటప్పుడు వాటిని గుర్తుంచు కోవడానికి ప్రయత్నిస్తారు. అంతేకాదు విషయాన్ని సులభంగా గ్రహించగలుగుతారు. ఇది వారిలో జ్ఞాపకశక్తి పెంచుతుంది. విని నేర్చుకునే వారిని ఆడియో లెర్నర్స్ అంటారు. ఇలాంటివారు దేన్నైనా శ్రద్ధంగా వినడానికి ప్రయత్నిస్తారు. వారిలో భాషానైపుణ్యం మెరుగుపడి చిన్నతనం నుంచే ఉచ్ఛారణ అలవాటు అవుతుంది. పదాలు సులభంగా నేర్చుకుంటారు. చాలామంది పిల్లలకు చదవమంటే చిరాకు వస్తుంది. అదే గట్టిగా చదువు అంటే మాత్రం ఎంతో హుషారుగా ఉంటారు. దీని వల్ల వారిలో ఉన్న ఒత్తిడి, ఆందోళనలు దూరం అవుతాయని అంటున్నారు.

# కిచెన్ కింగ్ మసాల ..



**ఫలానా మసాలా పొడి వల్ల కూం సూపర్‌గా ఉంది లాంటి ప్రకటనలు చూస్తుంటాం కదూ! అలాంటి వాటిల్లో 'కిచెన్ కింగ్ మసాలా' ఒకటి .** ఇది బయట కొనేకంటే ఇంట్లోనే చేసుకుంటే మంరిత తాజాగా ఉంటుంది. ప్రిజర్వేటివ్స్ ఉండవు కనుక ఆరోగ్యానికీ మంచిది. తేలిగ్గా ఎలా చేయా లంటే.. మినపప్పు, పచ్చి శనగ పప్పు, షాహీ జీరా, ఆవాలు ఒక్కో చెంచా చొప్పున, మెంతులు పావు చెంచా,3 సోంపు 2 టేబుల్ స్పూన్లు ధనియాలు 3 టేబుల్ స్పూన్లు, ఒకటిన్నర చెంచా జీలకర్రలను సన్న సెగ మీద వేయించాలి. అవి గోధుమ రంగులోకి మారేసరికి మంచి వాసన వస్తుంది. అందులో అంగుళం చొప్పున దాల్చినచెక్క,శొంఠి, మూడు బిర్యానీ ఆకులు, 12 లవంగాలు, 8 యాలకులు, 2 నల్ల యాలకులు (బ్లాక్ కార్డమమ్), ఒక జాపత్రి, ఒక స్టార్ మొగ్గ, అర జాజికాయ, 7 ఎండు మిరపకాయలు, అర టేబుల్‌స్పూన్ గసగసాలు, 2 టేబుల్ స్పూన్ల చొప్పున మిరియాలు, మెంతి ఆకులు పొడి వేసి ఇంకాస్త వేయించాలి. మంచి సువాసన వస్తున్నప్పుడు దించేయాలి. అవి చల్లారాక..చెంచా చొప్పున పసుపు, ఉప్పు, ఆమ్‌చూర్ పొడి జతచేసి గ్రైండ్ చేయాలి. అంతే.. 'కిచెన్ కింగ్ మసాలా' సిద్ధం. దీన్ని తడిలేని గాలి చొరబడని డబ్బాలో భద్రం చేసుకుంటే టామాటో, బంగాళదుంప లాంటి కూరల దగ్గర నుంచి బిర్యానీ వరకూ ఎందులో వేసినా వారెవా అనిపిస్తుంది.



# 'కొరియన్ కనకరాజు'

## ఆగస్టు 7న వరల్డ్ వైడ్ రిలీజ్

తెర

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యూనిక్ హారర్‌కామెడీ 'కొరియన్ కనకరాజు'తో అలరించడానికి సిద్ధమవుతున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్‌ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. ఇంతకుముందు విడుదలైన టైటిల్ గ్లింప్స్, హారర్, కామెడీ, కొరియన్ కల్చర్ ఎలిమెంట్స్ కూడిన ఈ చిత్రంలోని వినోదాత్మకంగా చూపిస్తూ భారీ బజ్‌ను సృష్టించింది. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'కంసంనిదా' కూడా చార్ట్‌బస్టర్‌గా నిలిచింది.

చిత్ర నిర్మాతలు ఆగస్టు 7వ తేదీన ప్రపంచవ్యాప్త థియేట్రికల్ విడుదల తేదీగా అధికారికంగా ఖరారు చేశారు. రిలీజ్ డేట్ పోస్టర్ ఆటిట్యూడ్, ఇంటెన్స్‌ని ప్రజెంట్ చేస్తోంది. వరుణ్ తేజ్ ఒక చేతిలో రక్తం మరకలున్న కత్తి, మరో చేతిలో గ్రెనేడ్‌తో కుర్చీలో హుందాగా కూర్చుని, రఫ్ అండ్ అల్ట్రా స్టైలిష్ అవతార్‌లో కనిపిస్తున్నారు. భయపెట్టే కొరియన్ గ్యాంగ్‌స్టర్ల గ్యాంగ్ చుట్టుముట్టి ఉన్నప్పటికీ, అతను ఏమాత్రం బెదరనట్లు కనిపించారు. కళ్లు చెదిరే నియాన్ లైటింగ్ బ్యాక్ డ్రాప్, గ్యాంగ్‌స్టర్ నేపథ్యం మరింత ఆసక్తిని పెంచింది. రితికా నాయక్ కథానాయికగా నటిస్తుండగా, కమెడియన్ సత్య కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రంలో అగ్రశ్రేణి సాంకేతిక నిపుణులు పని చేస్తున్నారు. ఎస్. థమన్ సంగీతం అందించగా, మనోజ్ రెడ్డి కటసాని డీవోపీగా పని చేస్తున్నారు. విలక్షణమైన కథాంశం ఆకట్టుకునే వినోదంతో 'కొరియన్ కనకరాజు' అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రాలలో ఒకటిగా నిలిచింది. చిత్ర నిర్మాతలు విడుదల తేదీని ఖరారు చేయడంతో వరుసగా అప్డేట్స్ ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# 'హ్యాపీ జర్నీ' నుంచి ఫస్ట్ సింగిల్



రొటీన్ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, మహిళల భావోద్వేగాలను ప్రధానంగా తీసుకుని రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ జర్నీ'. ఏడు మంది మహిళల జీవితాల చుట్టూ తిరిగే ఈ కథలో అన్నపూర్ణమ్మ, ఆమని, యాంకర్ ఝాన్సీ, పాయల్ రాధాకృష్ణ, జినీషా అలిశెట్టి, రూపా శ్రీనివాస్, సునైనా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. పృథ్వీ దండమూడి, వంశీ, రవి శివ తేజ పైల కీలక సహాయ పాత్రలను పోషించారు. గుత్తా ప్రొడక్షన్స్, కమలాకర్ ఫిల్మ్ కార్పొరేషన్ బ్యానర్లపై బాలాజీ గుత్తా, కౌశిక్ రెడ్డి నిర్మిస్తున్న 'హ్యాపీ జర్నీ' చిత్రంతో అభిరామ్ నాయుడు దర్శకుడిగా పరిచయం అవుతుండగా, తరుణ్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఫస్ట్ లుక్, టీజర్‌తో భారీ అంచనాలను రేకెత్తించిన చిత్ర బృందం, ఇప్పుడు 'ఆనందమే' ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసి, మ్యూజికల్ ప్రమోషన్స్‌ను ప్రారంభించింది. శేఖర్ చంద్ర అందించిన స్వరాలు ఉత్సాహాన్ని నింపేలా ఉన్నాయి. సురేష్ బానిసెట్టి రాసిన సాహిత్యం బంధాల నుంచి బయటపడి స్వేచ్ఛగా ఎగిరే పక్షులతో మనసులోని ఆనందాన్ని పోలుస్తూ ఎంతో అందంగా సాగింది. పారిస్, మాంట్‌పెలియర్, ఇతర అందమైన యూరప్ ప్రాంతాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా, అద్భుతమైన విజువల్స్‌తో పాటు హృదయానికి దగ్గరైన భావోద్వేగాలను కూడా అందించబోతోంది. కథ విదేశీ నేపథ్యంలో సాగినా, అందులోని మనుషుల అనుబంధాలు, భావాలు ప్రతి ఒక్కరికీ దగ్గరగా అనిపించేలా ఉంటాయి. ఈ చిత్రానికి శేఖర్ చంద్ర సంగీతం అందిస్తుండగా, మణికందన్ సుబ్రమణియన్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. చోటా కె. ప్రసాద్ ఎడిటర్‌గా, బ్రహ్మ కడలి ప్రొడక్షన్ డిజైనర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే సినిమా విడుదల తేదీని మేకర్స్ ప్రకటించనున్నారు.

# 'క్వీన్'లో కీలక పాత్రలో నటిస్తున్న రమ్యకృష్ణ



ప్రముఖ సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ యామినీ ఇఆర్‌ను హీరోయిన్‌గా పరిచయం చేస్తూ టాలెంటెడ్ యంగ్ డైరెక్టర్ రతన్ రిషి హీరోయిన్ సెంట్రిక్ కథతో 'క్వీన్' మూవీని రూపొందిస్తున్నారు. ఈ సినిమాను వన్ సర్కిల్ ఫిలింస్ బ్యానర్ నిర్మిస్తోంది. ఈ చిత్రంలో కాళకేయ ప్రభాకర్, అజయ్ ఘోష్ విలన్స్‌గా నటిస్తున్నారు. డైలాగ్ కింగ్ సాయికుమార్ హీరోయిన్ తండ్రి పాత్రను పోషిస్తున్నారు. ఈ రోజు ఈ సినిమా నుంచి ఒక ఇంపార్టెంట్ అనౌన్స్‌మెంట్ చేశారు మేకర్స్. 'క్వీన్' చిత్రంలో ఒక పవర్ ఫుల్, స్ట్రాంగ్ క్యారెక్టర్‌లో ప్రముఖ నటి రమ్యకృష్ణ నటిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి లక్ష్మి ్మ ప్రణతి పాత్రలో రమ్యకృష్ణ తన నటనా ప్రతిభతో ప్రేక్షకుల్ని ఆకట్టుకోబోతున్నారు. రమ్యకృష్ణ తమ సినిమా టీమ్‌లో జాయిన్ అవుతున్న సందర్భంగా చిత్రబృందం ఆమెకు ఆహ్వానం పలికారు. 'క్వీన్' చిత్రాన్ని వాస్తవ ఘటనల ఆధారంగా, రియల్ క్యారెక్టర్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఫిక్షనల్ స్టోరీతో దర్శకుడు రతన్ రిషి రూపొందిస్తున్నారు. 2006-2010 మధ్య కాలం నేపథ్యంగా ఈ చిత్ర కథ సాగనుంది. ప్రస్తుత సొసైటీ తో ముడిపడి ఉన్న ఒక ఇంట్రెస్టింగ్ లవ్ స్టోరీని ఈ చిత్రంలో ప్రేక్షకులు చూడబోతున్నారు. "క్వీన్" సినిమా ప్రస్తుతం రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటోంది.

# 'చోర శిఖామణులు'

## పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభం



శ్రీకరివివాన్ సమర్పణలో శ్రీకరి క్రియేషన్స్ బ్యానర్ మీద బానూరు నాగరాజు నిర్మిస్తున్న చిత్రం 'చోర శిఖామణులు'. ఆనంద్ కుర్మా ఈ మూవీకి కథ, కథనం, మాటలు అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. యాక్షన్, క్రైమ్, కామెడీ జానర్‌లో రానున్న ఈ మూవీలో రామ్ తేజ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్, నరేష్, అజయ్ ఘోష్, సంపూర్ణేష్ బాబు, మురళీధర్ గౌడ్, అప్పు, కరణ్, జబర్దస్త్ సత్యశ్రీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించనున్నారు.

'చోర శికామణులు' చిత్ర ప్రారంభోత్సవం, పూజా కార్యక్రమాలకు త్రినాథరావు నక్కిన, దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, త్రినాథరావు నక్కిన స్క్రిప్ట్ అందించగా.. తొలి సన్నివేశానికి త్రినాథరావు నక్కిన గౌరవ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆనంద్ రాజావిక్రమ్ సంగీత దర్శకుడిగా, జగదీష్ కొమరి కెమెరామెన్‌గా, యాక్షన్ కొరియోగ్రఫీ బాధ్యతలను డ్రాగన్ ప్రకాష్ నిర్వహించనున్నారు. జూలై 25 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. మంచి సాంగ్‌తో ఈ మూవీ షూటింగ్ ప్రారంభం కానుందని టీం తెలిపింది. ముమ్ముందు మరిన్ని అప్డేట్‌లతో మేకర్స్ అంచనాలు పెంచేందుకు ప్లాన్ చేస్తున్నారు.

# 'చెన్నై లవ్ స్టోరీ' 24న రిలీజ్



హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా 'కలర్ ఫొటో', 'బేబి' వంటి కల్ట్ క్లాసిక్ మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్‌కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'చెన్నై లవ్ స్టోరీ'. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మెలొడీ బ్రహ్మ మణిశర్మ 'చెన్నై లవ్ స్టోరీ' సినిమాకు బ్లాక్ బస్టర్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఈ నెల 24న వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు 'చెన్నై లవ్ స్టోరీ' మూవీ రెడీ అవుతోంది. ఈ రోజు మెలొడీ బ్రహ్మ మణిశర్మ పుట్టినరోజు వేడుకల్ని 'చెన్నై లవ్ స్టోరీ' టీమ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, నిర్మాతలు ఎస్‌కెఎన్, సాయి రాజేష్, సహ నిర్మాత ధీరజ్ మొగిలినేని, డైరెక్టర్ రవి నంబూరి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి మణిశర్మకు బర్త్‌డే విషెస్ తెలిపారు. ఈ సినిమాకు మణిశర్మ కంపోజ్ చేసిన 'తొలి ప్రేమేం తోపు కాదే..', 'వదలనే..','జిగితార..', 'హుయిలా హుయిలా' పాటలన్నీ ఛాట్ బస్టర్స్‌గా మ్యూజిక్ లవర్స్‌ను అలరిస్తున్నాయి.

13vzm15:13vzm15.qxd 12-07-2026 22:23 Page 1



## మంచి చదువు, క్రమశిక్షణే ఉన్నత స్థాయిలో నిలుపుతుంది

**బొబ్బిలి, జూలై 12, ప్రభాతవార్త:**



బొబ్బిలి పట్టణంలోని హేండ్ ఇన్ హేండ్స్ చిల్డ్రన్ హోంను జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్ జులై 12న సందర్శించి, బాలబాలికలతో మమేకమై, వారికి చదువు, క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి చేరుకోవా లన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. అనంతరం, బాలబాలికలకు జిల్లా ఎస్పీ స్వీట్స్ అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ ఉన్నత చదువు, క్రమశిక్షణే జీవితంలో ఉన్నత స్థితిలో నిలుపుతుందని, చదువును ఎట్టి పరిస్థితుల్లోను నిర్లక్ష్యం చేయవద్దన్నారు. తల్లిదండ్రులు లేరన్న ఆలోచన వద్దని, మిమ్ములను తమ సొంత పిల్లలుగా భావించే ఉపాధ్యాయులు, సంరక్షకుల పర్యవేక్షణలో క్రమశిక్షణతో మెలగాలన్నారు. తోటి విద్యార్థులతో తగాదాలు వద్దని, చదువుపై శ్రద్ధ చూపాలన్నారు. విద్యా వ్యవస్థలో వచ్చే మార్పులను గమనించి, ఉన్నత మార్గంలో నడవాలన్నారు. చెడు వ్యక్తులకు దూరంగా ఉండాలని, ఇతరుల ప్రలోభాలకు లొంగవద్దని, టీచర్లు మాటలు తప్పా ఇతరుల మాటలు నమ్మవద్దన్నారు. సాంకేతికత పట్ల అవగాహన పెంచుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆకతాయిలకు దూరంగా ఉండాలని, వారు చెప్పే మాయ మాటలకు ఆకర్షితులు కావద్దని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లోని వ్యత్యాసాలను తెలుసుకొని, అవకాశవాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జీవితంలో వచ్చే అవకాశాలను అందిపుచ్చుకోవాలని, వాటిని సద్వినియోగం చేసుకొని, ఉన్నత స్థితికి చేసుకోవాలన్నారు. అనంతరం, బాలబాలికలకు జిల్లా ఎస్పీ స్వీట్స్ అందజేశారు. కార్యక్రమంలో బొబ్బిలి డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి సిఐ కే.నారాయణరావు, ఎస్సైలు నవీన్ పడాల్, శ్రీరాములు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ నియమాలకు కట్టుబడి పనిచేయాలి : మంత్రి

**విజయనగరం, జూలై 12, ప్రభాతవార్త:**

తెలుగుదేశం పార్టీలో చేరిన వారు పార్టీ నియమాలకు కట్టుబడి పని చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. మంత్రిగారి క్యాంపు కార్యాలయం నందు ఆదివారం జామి మండలం శాసనాపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గుల్లిపల్లి చెన్నారావు, రమ్మిశెట్టి జగదీష్ మంత్రి సమక్షంలో టీడీపీలో జాయిన్ అయ్యారు. వారికి కండవాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన టీడీపీలో సీనియర్ నాయకులను గౌరవిస్తూ పార్టీ నిబంధనలను పాటించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఉత్తలి సూర్యారావు, ఆకిరి వెంకట అప్పారావు, సాధనాల రాంబాబు, పోలిపర్తి స్వామి నాయుడు, గుల్లిపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణలో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయి పనితీరే కీలకం

**బొబ్బిలి, జూలై 12, ప్రభాతవార్త;**



విజయనగరం జిల్లా బొబ్బిలి పోలీసు స్టేషన్, బొబ్బిలి సర్కిల్ కార్యాలయం, బొబ్బిలి డిఎస్పీ కార్యాలయంను జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ గారు జులై 12న సందర్శించి, పోలీసు అధికారులు, సిబ్బందితో మమేకమై, మాటామంతి నిర్వహించి, వారితో కలిసి అల్పాహారం సేవించి, వారు నిర్వహించాల్సిన విధులపై దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఏ.ఆర్.దామోదర్,ఐపిఎస్ మాట్లాడుతూ - నేరాల నియంత్రణలో క్షేత్ర స్థాయిలో పోలీసు సిబ్బంది పని తీరే కీలకమన్నారు. రాత్రిపూట పెట్రోలింగ్, గస్తీ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది నేరాల నియంత్రణకు సైరన్స్ వినియోగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన అంశాలకు ప్రాధాన్యత కల్పించాలని, అసాంఘిక శక్తులను అణిచి వేసేందుకు కఠిన చర్యలు చేపట్టాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఒడిస్సా రాష్ట్రంకు సరిహద్దుగా జిల్లా ఉండడం వలన గంజాయి అక్రమ రవాణా జరిగేందుకు అవకాశం ఉన్నందున వాటిని పూర్తిగా నియంత్రిం చాలన్నారు. మహిళలు, బాలల భద్రతకు రక్షణ కల్పించేందుకు అధిక ప్రాధాన్యత కల్పించాలన్నారు. మహిళలు చేస్తున్న ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. మహిళలు, బాలల భద్రతను దృష్టిలో పెట్టుకొని క్షేత్ర స్థాయిలో అవగాహన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సైబరు నేరాల నియంత్రణకు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. పోలీసు విధులను నిర్వహించడంలో టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోలీసు సేవలను ప్రజలకు మరింత మెరుగ్గా, సమర్ధవంతంగా అందించేందుకు సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బంది మానవత్వంతో వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ దిశా నిర్దేశం చేసారు.అనంతరం, పోలీసు అధికారులు, సిబ్బందితో మాటామంతి నిర్వహించి, సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ అల్పాహారం సేవించారు. పోలీసు సిబ్బందితో మమేకమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది హెల్త్ ఇన్సూరెన్సు చేయించుకోవాలని, కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో గడపాలని, పిల్లల భవిష్యత్తుకు పునాదులు వేయాలని, వారికి మార్గనిర్దేశం చేయాల న్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, హెల్మెట్ ధరించి మాత్రమే ద్విచక్ర వాహనాలు నడపాలన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకొని వస్తే వాటి పరిష్కారానికి తప్పక చర్యలు చేపడతానని పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ భరోసా కల్పించారు. సమావేశంలో బొబ్బిలి డిఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి సిఐ కే.నారాయణరావు, ఎస్సైలు నవీన్ పడాల్, శ్రీరాములు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్పీ దామోదర్ సత్కరించిన కారుణ్య సంస్థ



**బొబ్బిలి, జూలై 12, ప్రభాతవార్త:**

మంచి స్పర్శ,చెడు స్పర్శ పై విద్యార్థులకు అవగాహన కల్పించాలి జిల్లా ఎస్ పి.ఏ ఆర్ దామోదర్.జిల్లా ఎస్‌పిని సత్కరించిన రోటరీ,కారుణ్య సంస్థలుపాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మంచి స్పర్శ,చెడు స్పర్శగుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ దామోదర్ రోటరీ,కారుణ్య సంస్థల ప్రతినిధులను కోరారు. అక్రమ మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా బొబ్బిలి విచ్చేసిన జిల్లా ఎస్పీ దామోదర్ ను, బొబ్బిలి రోటరీ,కారుణ్య సంస్థల అధ్యక్షులు డాక్టర్ జె సి రాజు ఆధ్వర్యంలో సంస్థల ప్రతినిధులు ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు.ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పర్యవేక్షణతో పాటు గంజాయి ,దాని వినియోగాన్ని,మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టటం ,అందుకు జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించటం, పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్,బ్యాడ్ టచ్,బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టటం, బాల్య వివాహాలు నిరోధించడం, ఫాక్సో చట్టం అమలు మొదలగు వాటిపై నిరంతర పర్యవేక్షణ చేస్తూ, దిగువ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై మరెంత విశ్వాసం పెరిగేలా చేస్తున్న నేపధ్యంలో రోటరీ,కారుణ్య సంస్థల చైర్మన్ డాక్టర్ జె సి రాజు ,రోటరీ డైరెక్టర్ సింద్రి శ్రీనివాసన్,సర్వీస్ ప్రాజెక్ట్ చైర్ ప్రవీణ్ కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శి కె రామ కృష్ణ,కారుణ్య సంస్థ ఉపాధ్యక్షులు నాగూరి రమేష్,జి సిహెచ్ జి శర్మ ఎస్ పి దామోదర్ కు పుష్ప గుచ్చాలను అందించి దుస్సాలువాలతో ఘనంగా సత్కరించారు.ఈ నేపధ్యంలో ఆయన రోటరీ,కారుణ్య సంస్థలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ ప్రాంగణంలో ప్రజల ప్రయోజనార్థం కారుణ్య సంస్థ సమకూర్చిన సిమెంట్ బెంచెస్ ను చూసి సభ్యులను అభినందించారు. లిపాఠశాలల్లో విద్యార్థులకు గుడ్ టచ్ ,బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించే కార్యక్రమాలు సంస్థల ద్వారా చేపట్టాలని కోరారు వీరితోపాటు డీఎస్పీ ఆర్ గోవింద రావు.,సి ఐ కె నారాయణ రావు,పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## నాటు సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు

**కురుపాం, జూలై12, ప్రభాతవార్త :**

ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు గ్రామాలలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఒడిస్సా ఎక్సైజ్ పోలీసుల సహకారం తో సంయుక్త దాడులు నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలు లో భాగంగా పార్వతీ పురం మన్యం జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిండెంట్ ఏ. సంతోష్ ఆధ్వర్యం లో ఆంధ్ర,ఒడిస్సా సరిహద్దులో గల నాటు సారా తయారీ స్థావరాలు కలిగిన సందుబడి , పల్లం తులేష్ గ్రామల లో ఒడిస్సా ఎక్సైజ్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించినట్లు తెలిపారు. నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 5,500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామని న్నారు. నాటు సారా బట్టిలలో తయారు చేసి డ్రమ్ములలో నిల్వఉంచిన సుమారు 370 లీటర్ల నాటు సారాను అలాగే నాటు సారాయి తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 500 కేజీల నల్లబెల్లం ను స్వాధీనం చేసుకొని అధికారుల సమక్షంలో ధ్వంసం చేశామని తెలిపారు.ఈ దాడుల్లో విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ ఏ ఈ ఎస్ ఎంవి గోపాల కృష్ణ , సిబ్బంది, పార్వతీపురం టాస్క్ ఫోర్స్ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వివిఎస్ .శేఖర్ బాబుసిబ్బంది , సాలూరు, సీతానగరం, పాలకొండ స్టేషన్ల సిబ్బంది,రాయగడ ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ బాలక బిషి, రాయగడ మొబైల్ ఇన్స్పెక్టర్ కెపి సింధూర్, కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్జె రాజశేఖర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.నాటు సారా పై సరిహద్దులో నిరంతర నిఘా పెడుతున్నామని,ఒడిస్సా పోలీస్ , ఎక్సైజ్ అధికారులు సహకారంతో నాటు సారాయి తయారీ కేంద్రాలపై నిఘా పటిష్టమ్ చేసి నిరంతర దాడులు కొనసాగిస్తామని సిఐ తెలిపారు.

## నేడే మంత్రి సమక్షంలో టీడీపీలో పలువురి చేరిక

**పాచిపెంట, జూలై 12, ప్రభాతవార్త :**



పద్మాపురం పంచాయతీలో గల పిడ్డింగివలస గిరిజన గ్రామంలో సోమ వారం ఉదయం గిరిజన సంక్షేమ మరియుశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సమక్షంలో పలువురు టిడిపి తీర్థం పుచ్చుకుంటారని మండల టిడిపి అధ్యక్షుడు జి యుగంధర్ తెలిపారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు యుగంధర్ ఆధ్వర్యంలో చేరిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమానికి మండలంలో గల టిడిపి మండల స్థాయి నాయకులు గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు హాజర కావాలని అభ్యర్థించారు.

## కాంట్రాక్ట్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలి : సిఐటీయు



**సాలూరు, జూలై 12, ప్రభాతవార్త :**

రాష్ట్రంలో మున్సిపాల్టీలు ఇంకా కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లందర్నీ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని అలాగే సుప్రీంకోర్టు ఇంకా హైకోర్టు ఆదేశాలు అమలు చేసి సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం మన్యం జిల్లా మున్సిపల్ ఓబి సమావేశం జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం అధ్యక్షతన సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ మాట్లాడుతు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులు కాలరాయడమే కాకుండా ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని ఆరోపించారు.అలాగే ఈనెల 30 తేదీన జరగబోయే కలెక్టరేట్ ధర్నా జయప్రదం చెయ్యాలని,కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి ప్రజలు, ఉద్యోగులు,సంఘాలు మద్దతుగా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా నాయకులు టి రాముడు, తిరుపతి, సంగీత, శివ,సంధ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**గరివిడి ,జులై 12, ప్రభాత వార్త:**



శ్రీరాం నగర్ శ్రీరామ్ ఉన్నత పాఠశాల 1986-87 విద్యా సంవత్సర పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానికంగా ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు, హ్యూమన్ రైట్స్ జస్టీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం వేడుకగా జరిగింది. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి ప్రముఖ చర్మ వ్యాధి నిపుణులు డాక్టర్ పివి కృష్ణం రాజు, వైజాగ్ జివిఎంసి టిడిపి న్యాయ విభాగపు ప్రతినిధి, న్యాయవాది కారి గోవింద్ రాజు తదితరులుకి ఈ సందర్భంగా ప్రతిభ ప్రోత్సాహక అవార్డుల ను ప్రధానం చేశారు.కార్యక్రమంలో ఫేకర్ జి ఎం రామకృష్ణ, ఫేకర్ పర్సనల్ ఆఫీసర్ వై ఆర్ వి సూర్యనారాయణ, లక్ష్మీ బాయి వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు భోగాపురం శ్రీదేవి, హ్యూమన్ రైట్స్ జస్టీస్ ఫౌండేషన్ రాష్ట్ర ప్రతినిధి ఎం.హరీష్ కుమార్ తదితరులు పాల్గొని పలు అంశాలపై ప్రసంగించారు. పూర్వ విద్యార్థులు సమాజ సేవకులుగా పురోగమించడం ముదావహం అని వక్తలన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ భాయి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు బోగాపురపు శ్రీదేవి , గోవింద్ రాజు,కృష్ణంరాజు లకు పూర్వ విద్యార్థులు, హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు దుస్సాలువ తో ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. పూర్వ విద్యార్థులు తమ ఆత్మీయ కలయికలో గత అనుభవాలను, గత జ్ఞాపకాలను పంచుకున్నారు. కార్యక్రమంలో వైకాపా నాయకులు పి.కుమార్ స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## 1213 మంది బాలికలకు రక్తపరీక్షలు



**నెల్లిమర్ల, జూలై 12, ప్రభాతవార్త**

నెల్లిమర్ల లోని పలు గురుకుల పాఠశాలలోని విద్యార్థినులకు ఆదివారం వైద్య ఆరోగ్య సిబ్బంది రక్త పరీక్షలు నిర్వహించారు. ఎందుకోసం రక్త నమూనాలను సేకరించారు. మండల కేంద్రం నెల్లిమర్లలోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 557 మంది విద్యార్థినులకు, అలాగే కస్తూర్బా విద్యాలయాలోని 214 మంది విద్యార్థినులకు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన 425 మందికి మొత్తం 1213 మంది విద్యార్థినులకు ఈ రక్తపరీక్షలు నిర్వహించారు. వీరందరికీ మలేరియాను గుర్తించే ఆర్డిటి పరీక్షల నిర్వహించినట్లు జరజాపు పేట యు పి హెచ్ సి వైద్యుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్సీ సిబ్బంది విజయ్, శ్రీనివాస్, ప్రమీల,రవికళ, ఈశ్వరి, లక్ష్మీ పుష్ప సూర్యకుమారి, మలేరియా వైద్య సిబ్బంది ఆరిపాక బాబు విశ్వేశ్వరరావు, వెంకటరావు, శ్రీనివాసరావు, చిన్నారావు పాల్గొని రక్త నమూనాలను సేకరించారు.

## రిటైర్డ్ ఉపాధ్యాయిని పద్మావతికి ఘన సత్కారం

**నెల్లిమర్ల, జూలై 12, ప్రభాతవార్త :**



అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులకు సమాజంలో ఎప్పటికీ ఆదరణ, గుర్తింపు ఉంటాయని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అన్నారు. మండలంలోని దన్నానపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన కొండల పద్మావతికి స్వగ్రామం నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపుపేటలో ఆదివారం పౌర సన్మానం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదే శ్రీనివాసులు నాయుడు హాజరై పద్మావతి గణపత్రావు దంపతులను ఘనంగా సత్కరించారు. జ్ఞాపికలను అందజేశారు . గరివిడి ఎంఈఓ పోలుబోతు రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బంగార్రాజు మాట్లాడుతూ పద్మావతి 37 సంవత్సరాల పాటు ఉత్తమ సేవలు అందించారని, ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్ది ఉన్నత స్థాయిలో స్థిరపడేలా చేశారని అన్నారు. ఎమ్మెల్సీ శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ ఉత్తమ సేవలు అందించి పద్మావతి ఆదర్శ ఉపాధ్యాయునిగా పేరుగాంచారని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ, నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కాళ్ళ సత్యవతి, పలువురు భీమునిపట్నం నాయకులు, పూసపాటిరేగ ఏఎంసి డైరెక్టర్ ఎంఎం నాయుడు, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాల్తేరు శ్రీనివాస్, నెల్లిమర్ల, మెరకముడి దాం ఎంఈఓలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, మాత చంద్రశేఖర్, గ్రామ పెద్దలు అవనాపు సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, నల్లి చంద్రశేఖర్, అవనాపు మురళీకృష్ణ, తుమ్ము వెంకటరమణ, పోలుబోతు నారాయణమూర్తి, ఉపాధ్యాయులు మద్దిల సత్యనారాయణ, మద్దిల సన్యాసిరావు, తాలాడ మహేష్, కడలి సత్య సాయి గణేష్ , తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకి దంపతులకు కృతజ్ఞతలు తెలిపిన బంగారయ్యపేట గ్రామస్థులు



**లక్కవరపుకోట, జూలై 12 ప్రభాత వార్త :**

వేపాడ మండలం కొండగంగుపూడి పంచాయతీ పరిధిలోని బంగారయ్యపేట గ్రామస్థులు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులను ఎల్.కోటలోని ఆమె క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. యువనాయకుడు పరవాడ జగదీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో గ్రామస్థులు తమ గ్రామాభివృద్ధి, ఆలయ నిర్మాణ విషయాలపై ఎమ్మెల్యేతో చర్చించారు.బంగారయ్యపేట గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధుల నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేయించడం పట్ల గ్రామస్థులు ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఆలయ నిర్మాణానికి ఇంత పెద్ద మొత్తంలో నిధులు కేటాయించేలా కృషి చేసినందుకు ఎమ్మెల్యే లలితకుమారికి వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.గ్రామస్తుల విన్నపానికి సానుకూలంగా స్పందించి, నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు, యువకులు కలిసి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో వేపాడ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కోట్యాడ రమణమూర్తి, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, యువ నాయకుడు పరవాడ జగదీష్, ముమ్ములూరు సత్తిబాబు, సూర్యనారాయణ, బురగబోయిన సింహాద్రి, గూనపాటి అర్జున, గంగయ్య, రాంబాబు , గడబంటి సంతోష్, జాలరి ముత్యాలమ్మ, గునపాటి పెంటమ్మ, గునపాటి రాజ్య లక్ష్మి, సరోజని, జయలక్ష్మి , తేజ, రామలక్ష్మి, రమ,బుచ్చమ్మ సన్యాసమ్మ , పైకరి దేముడు, గునపాటి రాము, సీదరి వేణు, గుణపాటి అప్పారావు, వీర్రాజు , పైకరి రాము, నూకాలమ్మ, ,కేదాటి సత్తిబాబు, పరవాడ దాలినాయుడు, పాతబోయిన శ్రీను, గుణపాటి ప్రమీల, అనుశ్రీ, లావణ్య, కొండమ్మ, మోట రాముబంగారయ్యపేట గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం

**దత్తిరాజేరు, జులై 12, ప్రభాతవార్త:**



మండలంలోని పాచలవలస గ్రామంలో.నివాసముంటున్న లోచర్ల ముసలి నాయుడు రజక వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు చాలీచాలని బ్రతుకు పూట గడపాలంటే ఎంతో భారంగా ఉండటం చూసి సుంకర వీధి యూత్ కమిటీ సభ్యులు ఆ కుటుంబానికి 10వేలు రూపాయలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. ఇంటికి పెద్ద దిక్కు అయినా తండ్రి ప్రమాదం సాత్ 2017 సంవత్సరంలో మరణించాడు తల్లి పోలమ్మమంచాన పడి జీవిస్తుంది భార్య బంగారం గత సంవత్సరం గుండుపోటుతో మరణించింది ముసలి నాయుడుకు కొడుకు ఆదిత్య తొమ్మిదో తరగతి చదువుతున్నాడు కూతురు దివ్యశ్రీ ఎనిమిదో తరగతి చదువుతున్నారు కుమారుడుకు నరాల వ్యాధితో స్కూల్ కి వెళ్తాడు పిల్లలకు కడుపు నిండా భోజనం పెట్టలేకపోతున్నాను అని తండ్రి విలువల బాధపడుతూ చెప్పలేక మింగలేక లోలోపల. మదనపడుతూ బ్రతుకుతున్నారు అటువంటి ఆపదలో ఉన్న కుటుంబానికి సుంకర వీధి యూత్ కమిటీ సభ్యులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు దాతల సహకారం సేవా సంఘాల ఫౌండేషన్ సభ్యులు నిరుపేద కుటుంబాలకు సహకారం అందిస్తారని ఆదుకొని చేతుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు .

## ఎస్.కోట రూరల్ సిఐగా హిమగిరి

**లక్క వరపు కోట, జూలై 12 ప్రభాతవార్త :**

శృంగవరపుకోట రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఎల్ హిమ గిరి ఆదివారం ఎల్ కోట సర్కిల్ కార్యాలయంలో భాద్యతలు చేపట్టారు ఇంత వరకు ఇక్కడ సి ఐ గా పని చేసిన ఎల్ అప్పలనాయుడు కి విశాఖపట్నం బదిలీ కావడం తో అరకు సి ఐ గా పని చేస్తున్న హిమ గిరి బదిలీ పై ఇక్కడ కి వచ్చారు ఈ సందర్భంగా సి ఐ హిమగిరికి నాలుగు మండలాల ఎస్ ఐ లు సిబ్బంది పుష్ప గుచ్చాలతో ఆహ్వానం పలికారు సర్కిల్ పోలీస్ అధికారులు సిబ్బంది ఉన్నత అధికారుల సహకారంతో సర్కిల్ పరిధిలో శాంతి భద్రతలు కాపాడేందుకు కృషి చేస్తాను అని సిఐ హిమగిరి తెలిపారు.

## రహదారుల నిర్మాణంలో డీసీఎం ప్రత్యేక దృష్టి

**శృంగవరపుకోట,జూలై12,ప్రభాతవార్త :**

రాష్ట్రంలో గ్రామీణ రహదారుల నిర్మాణంలో జాతీయ స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించడం హర్షణీయమని ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.ఇందుకు జనసేన పార్టీ అధినేత రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి ఫలితమేనని తెలిపారు. రహదారుల నిర్మాణంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారని నాణ్యత ప్రమాణాలు పాటించడం వలన జాతీయ స్థాయిలో రెండవ ర్యాంక్ సాధ్య మైందన్నారు. గతంలో రహదారుల నిర్మాణంలో రాష్ట్రం 19వ స్థానంలో ఉందని ఇప్పుడు రెండవ ర్యాంక్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమన్నారు.గ్రామీణ రహదారుల నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తున్న మాఅధినేత డీసీఎం పవన్ కళ్యాణ్ కు ఎస్.కోట నియోజకవర్గం జనసేన పార్టీ తరుపున హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ తెలిపారు.

## ఘనంగా వేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతం..



**శృంగవరపుకోట,జూలై12,ప్రభాతవార్త :**

మండలంలోని పోతనాపల్లి మానస కన్వెన్షన్ హాల్లో భగవాన్ శ్రీ రామదూత స్వామి ఆధ్వర్యంలో శ్రీవేణుదత్త సువర్ణ లక్ష్మీ దాంపత్య వ్రతం,కలశ పూజ,కంకరణధారణ మహోత్సవం లోకకల్యాణార్ధం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. రామదూత స్వామి దివ్య ఆశీస్సులతో ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులు ఘనంగా ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నం భక్తుల కోసం భారీ అన్నసమరాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.పూజా కార్యక్రమంలో పురోహితులు దొంతుకుర్తి సాయిశర్మ,భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో హై స్కూల్ హెచ్‌ఎం మృతి

**దత్తిరాజేరు జులై 12 ప్రభాతవార్త**

మండలంలోని మరడాశీ గ్రామానికి చెందిన ముగడ రామకృష్ణ (48) కొంతకాలం నుండిఅనారోగ్యంతో బాధపడి ఇంటి వద్ద ఆదివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు ఈయన మెంటాడ మండలం కుంటినవలస జిల్లా పరిషత్ హై స్కూల్లో హెచ్‌ఎం గా పనిచేస్తున్నారు ఆయన చాలా రోజుల నుండి మందులు వాడుతుండగా వ్యాధి తీవ్రత ఎక్కువ అవ్వడంతో మృతి చెందాడు అన్నారు ఆయనను జిల్లా ఉప విద్యాశాఖ అధికారి కే మోహన్ రావు హై స్కూల్ ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పూలదండలేసి నివాళులర్పించారు ప్రజా ప్రతినిధులు బంధుమిత్రులు కుటుంబ సభ్యులు మృతదేహానికి నివాళులర్పించారు.

## ఘనంగా కాంగ్రెస్ నేత స్వర్గీయ నారాయణరావు జయంతి వేడుకలు

**నెల్లిమర్ల, జూలై 12, ప్రభాతవార్త :**



నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, స్వర్గీయ కనకల నారాయణరావు 75వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైసిపి నాయకులు, గ్రామ పెద్దలు నారాయణరావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ జరజాబుపేట పేదల సంక్షేమం కోసం నారాయణరావు 4.75 ఎకరాల భూమిని కాలనీ నిర్మాణం కోసం ఇవ్వడం చిరస్మరణీయమని, పేదల గుండెల్లో నారాయణరావు చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. మాజీ మంత్రి పెనుమత్స సాంబశివరాజు, బొత్స సత్యనారాయణ ల సహకారంతో గ్రామ అభివృద్ధికి నారాయణరావు విశేషంగా కృషి చేశారని రామారావు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో స్వర్గీయ నారాయణరావు సతీమణి, వైసిపి నాయకురాలు కనకల హైమావతి తో పాటు వైసిపి ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు, నాగవంశం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మద్దిల వాసు, పార్టీ నాయకులు నల్లి శ్రీను, తుమ్మ నారాయణమూర్తి, పోలుబోతు నారాయణమూర్తి, సాసు బిల్లి దుర్గాప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

## పవన్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

**విజయనగరం, జూలై 12, ప్రభాతవార్త:**



ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు ముంబైలోని కోకిలాబెన్ అంబానీ ఆసుపత్రిలో భుజం శస్త్రచికిత్స విజయవంతంగా జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ జనసేన పార్టీ నేత గురాన అయ్యలు- రాధిక దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవమైన విజయనగరం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయాన్ని జనసేన నాయకులు, కార్యకర్తలు సందర్శించారు. పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని, ప్రజాసేవలో మరింత చురుగ్గా పాల్గొనాలని అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, ప్రార్థనలు చేశారు.అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న రోడ్డుపై జనసేన నాయకులు, కార్యకర్తలు సాంప్రదాయబద్ధంగా పెద్ద ఎత్తున కొబ్బరికాయలు కొట్టి తమ భక్తిని, అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ కళ్యాణ్ గారికి కుడి భుజానికి శస్త్రచికిత్స విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, రాబోయే రోజుల్లో ఆయన మరింత ఆరోగ్యంతో ప్రజా క్షేమం కోసం ముందుకు సాగాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో జనసైనికులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

13-07pg10.qxd:13-07pg10.qxd 1/1/02 6:22 AM Page 1



# ఎక్స్‌ట్రా టైమ్‌లో అర్జెంటీనా క్లాస్

## స్విట్జర్లాండ్‌పై 3-1 తేడాతో విజయం * రెండో కప్ వేటలో సెమీస్

**కాన్సాస్ సిటీ, జులై 12 :** డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వరుసగా రెండో కప్ వేటలో దూసుకుపోతోంది. అద్భుత ఆటతీరుతో సెమీఫైనల్ బెర్త్ ఖాయం చేసుకుంది. కాన్సాస్ సిటీ వేదికగా జరిగిన చివరి, నాలుగో క్వార్టర్‌ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై 3-1 గోల్స్‌తో అద్భుత విజయం అందుకుంది. ఆరంభంలో వెనకబడ్డా, లియోనెల్ మెస్సి నేతృత్వంలోని అర్జెంటీనా అదనపు సమయంలో ఆధిపత్యాన్ని చాటుకుంది. సెమీఫైనల్ పోరులో ఇంగ్లాండ్‌తో అర్జెంటీనా తలపడనుంది.



నాలుగో క్వార్టర్ ఫైనల్ ఆరంభంలోనే అర్జెంటీనా ఆధిక్యం చాటింది. ప్రారంభం నుంచి అర్జెంటీనా దూకుడు కొనసాగించింది. పదే పదే స్విట్జర్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులకు దిగింది. ఇది పదో నిమిషంలో ఫలించింది. మాక్ అలిస్టర్ గోల్ కొట్టి అర్జెంటీనాకు ఆధిక్యాన్ని అందించాడు. తొలి అర్థభాగం వరకు అర్జెంటీనా ఆధిపత్యంలో ఉన్నా మరో గోల్ సాధ్యం కాలేదు. మరోవైపు స్విట్జర్లాండ్‌కు లభించిన కొన్ని అవకాశాలను అర్జెంటీనా గోల్‌కీపర్ ఎమిలియానో మార్టినెజ్ సమర్థంగా అడ్డుకున్నాడు. రెండో అర్థభాగంలో స్విట్జర్లాండ్ రక్షణాత్మక ఆటతీరుకు బదులు అటాకింగ్ గేమ్‌కు దిగింది. 67వ నిమిషంలో స్విస్ ప్లేయర్ డాన్ ఎండోయె, రికార్డో రోడ్రిగ్జ్‌తో చక్కటి సమన్వయం ప్రదర్శనతో గోల్ కొట్టి స్కోరు 1-1తో సమమైంది. ఈ గోల్‌తో మ్యాచ్ మరింత ఉత్కంఠకు చేరింది. 72వ నిమిషంలో స్విట్జర్లాండ్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలింది. బ్రీల్ ఎంబోలో సిమ్యులేషన్ కారణంగా రెండో పసుపు కార్డు అందుకుని మైదానం నుంచి బయటకు వెళ్లాడు. దీంతో స్విట్జర్లాండ్ 10 మంది ఆటగాళ్లతోనే మ్యాచ్ కొనసాగించాల్సి వచ్చింది. దీన్ని అడ్వాంటెజ్‌గా తీసుకుని అర్జెంటీనా వరుస అవకాశాలు సృష్టించుకున్నా ఫలితం లేకపోయింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 1-1 గోల్స్‌తో సమంగా నిలిచింది.

అదనపు సమయంలో మాత్రం అర్జెంటీనా ఆధిపత్యం ప్రదర్శించింది. మ్యాచ్ స్వరూపాన్నే మార్చేసింది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. 112వ నిమిషంలో జూలియన్ అల్వారెజ్ దాదాపు 25 గజాల దూరం నుంచి అద్భుతమైన షాట్‌తో బంతిని నేరుగా గోల్‌పోస్ట్‌లోకి పంపించి అర్జెంటీనాకు 2-1 ఆధిక్యం అందించాడు. ఆ తర్వాత సమం చేయాలని స్విట్జర్లాండ్ ప్రయత్నించగా, చివరి నిమిషాల్లో లౌటారో మార్టినెజ్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచి అర్జెంటానా ఆధిక్యాన్ని 3-1కు చేర్చాడు. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగిన అర్జెంటీనా రెండో ప్రపంచ కప్ వేటలో మరో అడుగు వేసింది. ఈనెల 16న అట్లాంటాలో జరిగే రెండో సెమీఫైనల్‌లో ఇంగ్లాండ్‌తో తలపడనుంది.

### రిఫరీ నిర్ణయంపై స్విట్జర్లాండ్ ఫైర్

రిఫరీ నిర్ణయాలపై స్విట్జర్లాండ్ జట్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ముఖ్యంగా వీడియో అసిస్టెంట్ రిఫరీ జోక్యంతో ఫార్వర్డ్ బ్రీల్ ఎంబోలోకు రెండో ఎల్లో కార్డు చూపించడం మ్యాచ్ ఫలితాన్నే మార్చేసిందని స్విట్జర్లాండ్ ప్రధాన కోచ్ యురాత్ యూకిన్ విమర్శించారు. అదే తమ ఆటను పూర్తిగా దెబ్బతీసిందని వాపోయారు.

# బెల్లింగ్‌హామ్ డబుల్
## సెమీస్‌లో ఇంగ్లాండ్





**మియామి, జులై 12:** నార్వే ఆశలకు చెక్ పెడుతూ ఇంగ్లాండ్..సాకర్ ప్రపంచకప్ సెమీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. మియామిలో జరిగిన మూడో క్వార్టర్ ఫైనల్లో ఇంగ్లాండ్ 2-1 గోల్స్ తేడాతో నార్వేపై విజయం సాధించింది. ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ అద్భుతమైన డబుల్ గోల్స్‌తో చెలరేగాడు. ఎక్స్‌ట్రా టైమ్‌లో చేసిన గోల్‌తో ఇంగ్లాండ్ సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది.

మ్యాచ్ ప్రారంభం నుంచే నార్వే జట్టు ఇంగ్లాండ్‌పై తీవ్ర ఒత్తిడి పెంచింది. నార్వే స్టార్ స్ట్రైకర్ ఎర్లింగ్ హాలాండ్ మ్యాచ్ ఆరంభంలోనే ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్‌ను తన పవర్‌ఫుల్ హెడ్డర్‌తో గోల్ చేసినంత పనిచేశాడు. ఆ తర్వాత కూడా ఇంగ్లాండ్ డిఫెన్స్‌ను ఇబ్బంది పెడుతూ నార్వేఆటగాళ్లు వరుసగా ఇంగ్లాండ్ గోల్ పోస్ట్‌పై దాడులు చేశారు. ఈక్రమంలో 36వ నిమిషంలో ఆండ్రియాస్ షెల్డెరుప్‌కు లభించిన పాస్‌ను గోల్ పోస్ట్‌లోకి పంపి నార్వేకు 1-0 ఆధిక్యం అందించాడు. ఈఆనందం నార్వేకు ఎక్కువ సేపు నిలవలేదు. ఫస్టాఫ్ ముగియడానికి కొన్ని నిమిషాల ముందు ఇంగ్లాండ్ పుంజుకుంది. రియల్ మాడ్రిడ్ స్టార్ జూడ్ బెల్లింగ్‌హామ్ మైదానం మధ్య నుంచి బంతిని మెరుపు వేగంతో ముందుకు తీసుకెళ్లి గోల్ సాధించాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది.

### రివ్యూలో నార్వేకు షాక్

రెండో అర్ధ భాగంలో ఇరు జట్లు గోల్ కోసం తీవ్రంగా శ్రమించాయి. 60వ నిమిషంలో నార్వే ఆటగాడు తోర్బ్‌జోర్న్ హెగ్గెమ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. ఈ గోల్‌పై ఇంగ్లాండ్ ఆటగాళ్లు రెఫరీ రివ్యూ కోరారు. ఈ రివ్యూలో, గోల్ చేసే క్రమంలో నార్వే స్టార్ హాలాండ్, ఇంగ్లాండ్ ఆటగాడు ఇలియట్ ఆండర్సన్‌పై ఫౌల్ చేసినట్లు స్పష్టమైంది. దీంతో ఆగోల్‌ను రెఫరీ రద్దు చేశారు. ఈ క్రమంలో నిర్ణీత 90 నిమిషాల సమయం ముగిసేసరికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలవడంతో మ్యాచ్ ఫలితం కోసం ఎక్స్‌ట్రా టైమ్ కేటాయించారు.

### బెల్లింగ్‌హామ్ డబుల్

ఎక్స్‌ట్రా టైమ్‌లో సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన ఇంగ్లాండ్ ప్లేయర్ మోర్గాన్ రోజర్స్ బాక్స్ వెలుపల నుంచి ఒక పవర్‌ఫుల్ షాట్ కొట్టాడు. నార్వే కీపర్ నైలాండ్ ఆ బంతిని సరిగ్గా నియంత్రించలేకపోయాడు. అక్కడే సిద్ధంగా ఉన్న బెల్లింగ్‌హామ్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఆ బంతిని అతి సమీపం నుంచి గోల్ పోస్ట్‌లోకి పంపి ఇంగ్లాండ్‌కు 2-1తో తిరుగులేని విజయాన్ని అందించాడు. దీంతో ఇంగ్లాండ్ సెమీస్‌లోకి దూసుకెళ్లింది. మ్యాచ్‌లో రెండు కీలక గోల్స్ చేసి జట్టును సెమీస్‌కు చేర్చిన జూడ్ బెల్లింగ్‌హామ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఈ ప్రపంచ కప్‌లో బెల్లింగ్‌హామ్, కెప్టెన్ హ్యారీ కేన్ చెరో 6 గోల్స్ సాధించారు. ఈ ఓటమితో నార్వే జట్టు ప్రపంచకప్ ప్రస్థానం ముగిసింది.

ఇక ఇంగ్లాండ్ జట్టు జులై 15న అట్లాంటా స్టేడియంలో జరగబోయే హైవోల్టేజ్ సెమీఫైనల్ మ్యాచ్‌లో అర్జెంటీనాతో తలపడనుంది.

# లార్డ్స్ టెస్ట్‌లో గెలుపు దిశగా భారత్ ఉమన్స్




**లండన్, జులై 12:** లార్డ్స్‌లో జరుగుతున్న చారిత్రక టెస్ట్‌లో టీమిండియా అమ్మాయిలు పట్టు బిగించారు. బ్యాటింగ్‌లో, బౌలింగ్‌లో రాణిస్తూ గెలుపు దిశగా దూసుకుపోతున్నారు. మూడో రోజు ఆటముగిసే సరికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్ చేయాలి. ఇంగ్లాండ్ గెలుపొందాలంటే 327 రన్స్ చేయాల్సి ఉంటుంది. భారత్ గెలుపుకు నాలుగు వికెట్లు పడగొడితే చాలు.

మూడో రోజు ఆటలోనే టీమిండియా అమ్మాయిలు జోరు చూపారు. ఒక వికెట్ నష్టానికి 154 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్... ఏడు వికెట్లకు 341 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. ఫస్ట్‌డౌన్ బ్యాట్స్‌విమెన్ యాష్టికా భాటియా సెంచరీతో మెరిసింది. 158 బంతుల్లో 14 ఫోర్లతో 113 పరుగులు సాధించింది. భాటియాకు టెస్ట్‌ల్లో ఇది తొలి సెంచరీ. లోయర్ ఆర్డర్‌లో రిచా ఘోష్(52 బంతుల్లో 50) మెరుపులు మెరిపించింది. అర్ధసెంచరీతో అజేయంగా నిలిచింది.

457 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన ఇంగ్లాండ్‌ను క్రాంతి మరోసారి దెబ్బతీసింది. ఆమెకు తోడుగా సయాలి, స్నేహ రాణా కూడా రెండేసి వికెట్లతో రాణించడంతో ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లోనూ తడబడింది. ఓపెనర్లు బౌచెర్, టామీ సింగిల్ డిజిట్‌కు అవుట్ కాగా... అమీ జోన్స్ 52 పరుగులతో అజేయంగా నిలిచింది. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 6 వికెట్ల నష్టానికి 130 రన్స్‌తో ఓటమి దిశలో కొనసాగుతోంది. మధ్యప్రదేశ్‌కు చెందిన క్రాంతి తొలి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్లు... ఇప్పటివరకు మొత్తం ఏడు వికెట్లు పడగొట్టింది. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 285 రన్స్ చేయగా, ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 170 రన్స్‌కు ఆలౌటైంది.

## ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌కు రెండు మార్పులతో టీమిండియా

**ముంబై, జులై 12:** ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, జింబాబ్వేతో టీ20 సిరీస్‌ను టీమ్‌ఇండియాలో బీసీసీఐ రెండు మార్పులు చేసింది. గాయపడ్డ హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి స్థానంలో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌కు అవకాశం కల్పించింది. ప్రస్తుతం ఈ ఇద్దరు ఇంగ్లాండ్‌లోనే టీ20 జట్టుతో ఉన్నారు. ఇంగ్లాండ్‌తో వన్డేలకు ప్రిన్స్ యాదవ్.. జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు స్క్వాడ్ లోకి రవి బిష్ణోయ్ వచ్చారు. ఇంగ్లాండ్‌తో మూడో టీ20 సందర్భంగా హర్షిత్ రాణా కుడి తొడ కండరం సమస్యతో బాధపడ్డాడు. అలాగే వరుణ్ చక్రవర్తి కూడా గాయంతో ఔటయ్యాడు.

మంగళవారం నుంచి ఇంగ్లాండ్‌తో మూడు వన్డేల సిరీస్ మొదలుకానుంది. తొలి వన్డే జులై 14న ఎడ్జ్‌బాస్టన్‌లో, రెండో వన్డే జులై 16న సోఫియా గార్డెన్స్‌లో, మూడో వన్డే19న లార్డ్‌లో జరగనుంది. ఆ తర్వాత టీమిండియా జింబాబ్వేలో పర్యటిస్తుది. జింబాబ్వేతో మూడు టీ20ల సిరీస్ ఆడనుది. జులై 23న తొలి టీ20, 25న రెండో టీ20, 26న మూడో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్‌లన్నీన హరారే వేదికగా జరుగుతాయి.

స్కాట్లాండ్, ఇంగ్లాండ్‌లతో టీ20 సిరీస్‌లను కోల్పోయిన టీమిండియా.. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో వన్డేలకు సిద్ధమైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ జట్టులో చేరడంతో టీమిడియా బ్యాటింగ్‌లో పటిష్టంగా మారనుంది.

# విదేశీ పెట్టుబడుల జోరు: భారత్‌కు 7బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐఐ నిధులు

**న్యూఢిల్లీ, జులై 12:** విదేశీ పెట్టుబడులను ప్రోత్సహిస్తూ, భారత్ రూపాయి మరింత బలపడే విధంగా రిజర్వుబ్యాంకు చేపట్టిన కార్యాచరణ వల్ల భారత్‌కు ఇప్పటివరకు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చినట్లు ఎస్‌బీఐ రీసెర్చ్ వెల్లడించింది. ఈ ఏడాది మే 20న అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రూ.96.8 వద్ద కనిష్ఠ స్థాయికి చేరగా, జూన్ నెలాఖరు నాటికి దాదాపు 2.2 శాతం మేర పుంజుకుని రూపాయి బలపడింది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలకారణంగా ముడిచమురు ధరలు పెరగడంతో విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, రూపాయికి మద్దతు కల్పించడం లక్ష్యంగా గత నెల కేంద్ర ప్రభుత్వం, ఆర్‌బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నాయి.




ఇందులో సావరిన్ బాండ్లపై ఎఫ్‌ఐఐలు, ఎఫ్‌పీఐలకు పన్ను మినహాయింపు, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లకు హెడ్జింగ్ వ్యయంపై సబ్సిడీ, ప్రభుత్వ రంగ సంస్థల రుణాల కోసం రాయితీ డాలర్ స్వాప్ విండో వంటి చర్యలు ఉన్నాయి. తాజా భౌగోళిక రాజకీయ పరిణామాలు మరోసారి రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. అమెరికా అధ్యక్షుడు అమెరికాఇరాన్ కాల్పుల విరమణ ముగిసినట్లు ప్రకటించడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు మళ్లీ పెరగగా, రూపాయి విలువ కూడా 0.4 శాతం మేర క్షీణించింది. భారత ఆర్థిక వ్యవస్థపై దీర్ఘకాలిక దృక్పథం సానుకూలంగానే ఉందని ఎస్‌బీఐ రీసెర్చ్ అభిప్రాయపడింది.

సగటు ముడిచమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లలోపు ఉండే అవకాశముండటంతో, గతంలో చమురు ధరలు బ్యారెల్‌కు 130 డాలర్లు దాటినప్పుడు చేసిన అంచనాలతో పోలిస్తే, దేశానికి చమురు దిగుమతి బిల్లులో 30 నుంచి 35 బిలియన్ డాలర్ల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఇదిలా ఉండగా, జూన్ 30తో ముగిసిన పక్షంలో బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్లు సుమారు రూ.7 లక్షల కోట్లు పెరిగాయి. గత 29 ఏళ్లలో ఇది మూడో అతిపెద్ద పక్షవారపు వృద్ధిగా ఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది. ప్రధానంగా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు, పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు, బాహ్య వాణిజ్య రుణాలు (నిదితీలు) కారణమని, మొత్తం పెట్టుబడుల రాక సుమారు 15 బిలియన్ డాలర్లుగా అంచనా వేసింది. ఆర్‌బీఐ విదేశీ మారక నిల్వలు 4.4 బిలియన్ డాలర్లు పెరిగాయి. జూన్ నెలలో సీపీ జారీలు గత 55 నెలల్లో అత్యధిక స్థాయికి చేరగా, తొలి త్రైమాసికంలో బ్యాంకుల అదనపు రుణాల పరిమాణం రూ.5.6 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2.4లక్షల కోట్లు మాత్రమే ఉంది. అధిక స్థాయిలో కమర్షియల్ పేపర్లు జారీ చేసిన రంగాల్లోనే బ్యాంకు రుణాల వృద్ధి కూడా బలంగా నమోదైందని ఎస్‌బీఐ రీసెర్చ్ తెలిపింది. ముఖ్యంగా జూన్ 30తో ముగిసిన పక్షంలో రికార్డు స్థాయిలో రూ.7 లక్షల కోట్ల డిపాజిట్లు పెరగడం వల్ల బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత సౌకర్యవంతంగా మారుతుందనిఎస్‌బీఐ రీసెర్చ్ పేర్కొంది.

## రెండు కంపెనీల్లో నారాయణమూర్తి వాటా



**బెంగళూరు, జులై 12:** ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణ మూర్తి చెందిన క్యాటమరన్ వెంచర్స్ తాజాగా మరో రెండు కంపెనీల్లో పెట్టుబడి పెట్టింది. ఇందులో టీడీ పవర్ సిస్టమ్స్, వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్ కంపెనీలు ఉన్నాయి. టీడీ పవర్ సిస్టమ్స్‌లో 1.46శాతం వాటా కొనుగోలు చేసింది. ఇందుకు గానూ రూ.262 కోట్ల పెట్టుబడి పెట్టింది. వర్ధమాన్ స్పెషల్ స్టీల్స్‌లో 1.02శాతం వాటాను రూ.28 కోట్లతో కొనుగోలుచేసింది. టీడీ పవర్ సిస్టమ్స్ 1999లో స్థాపించారు. ఇది బెంగళూరుకు చెందిన ఏసీ జనరేటర్లు, ఎలక్ట్రిక్ మోటార్ల తయారీ కంపెనీ. కంపెనీలో తయారు చేసిన యంత్రాలను ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టీమ్, గ్యాస్, హైడ్రో, విండ్, డీజిల్ పవర్ ప్లాంట్లలో వాడుతున్నారు. 17,969 కోట్ల మార్కెట్ క్యాప్‌తో ఈ కంపెనీ 100కు పైగా దేశాలకు ఎగుమతి యంత్రాలను చేస్తుంది. రూ.1000 కోట్ల రిజర్వు నిధి ఉంది. 2026 ఆర్థిక సంవత్సరంలో అమ్మకాలు దాదాపు 45 శాతం పెరిగాయి. నికర లాభం రూ. 239 కోట్లకు పెరిగింది. మార్జిన్లు కూడా డబుల్ డిజిట్ చేరుకున్నాయి. ప్రస్తుతం మార్జిన్లు 18 శాతానికి పెరిగాయి. ఈక్విటీపై రాబడి 25 శాతానికి దగ్గరలో ఉంది. కొత్త విద్యుత్ ప్రాజెక్టులు, ఉక్కు పరిశ్రమ, విస్తృత ఫ్యాక్టరీ నిర్మాణ కారణంగా పెద్ద జనరేటర్లకు బలమైన డిమాండ్ వచ్చింది. గత సంవత్సరంలో ఈ స్టాక్ విలువ రెట్టింపు కంటే ఎక్కువ పెరిగింది. 2021 జూలైలో టీడీ పవర్ షేరు ధర దాదాపు రూ. 40 ఉండగా అది 2026 జూలై 10 నాటికి అది రూ. 1,150కి చేరింది. అంటే 5 సంవత్సరాలలో ఇది 2,775 పెరిగింది. ప్రస్తుతం పీఈ రేషియో 75 గా ఉంది.

# టాప్-4 కంపెనీల్లో 93వేల కోట్ల ఎంక్యాప్ పెరుగుదల



**ముంబై, జులై 12:** దేశంలోని అత్యధిక మార్కెట్ విలువ కలిగిన టాప్ 10 కంపెనీల్లో నాలుగు సంస్థల మూలధన మార్కెట్ విలువలు గత వారం రూ.92,995.48 కోట్లు పెరిగాయి. ఇందులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరియు భారతి ఎయిర్‌టెల్ అత్యధిక లాభాలు నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచాయి. గత వారం టాప్-10 కంపెనీల్లో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఎల్ఐసీ మార్కెట్ విలువలు పెరగగా, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టుబ్రో (ఎల్అండ్‌టీ), హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థల మార్కెట్ విలువ కలిపి రూ.49,294.13 కోట్లు తగ్గింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ విలువ రూ.35,808.09 కోట్లు పెరిగి రూ.12,69,454.42 కోట్లకు చేరగా, ఇది టాప్10 కంపెనీల్లో అత్యధిక పెరుగుదలగా నిలిచింది. భారతి ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ రూ.34,896.92 కోట్లు పెరిగి రూ.11,98,774.22 కోట్లకు చేరింది. ఎల్ఐసీ మార్కెట్ విలువ 16,065.50కోట్లు పెరిగి రూ.5,60,205.05 కోట్లకు చేరగా, రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ విలువ రూ.6,224.97 కోట్లు పెరిగి రూ.17,71,206.33 కోట్లకు చేరుకుంది.

మరోవైపు, హిందుస్తాన్ యూనిలీవర్ మార్కెట్ విలువ రూ.12,088.65 కోట్లు తగ్గి రూ.5,04,997.65 కోట్లకు పడిపోయింది. లార్సెన్ అండ్ టుబ్రో మార్కెట్ విలువ 11,040.23కోట్లు క్షీణించి రూ.5,42,938.40 కోట్లకు చేరగా, టీసీఎస్ మార్కెట్ విలువ రూ.8,574.87 కోట్లు తగ్గి రూ.7,48,600.40 కోట్లకు చేరింది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ విలువ రూ.7,813.58 కోట్లు తగ్గి రూ.6,35,327.78 కోట్లకు చేరింది. ఐసీఐసీఐ బ్యాంక్ మార్కెట్ విలువ 6,315.32 కోట్లు తగ్గి రూ.10,05,379.71 కోట్లకు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్కెట్ విలువ రూ.3,461.48 కోట్లు తగ్గి రూ.9,56,430.44 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ అగ్రస్థానాన్ని కొనసాగించగా, ఆ తర్వాత వరుసగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎల్ఐసీ, లార్సెన్ అండ్ టుబ్రో, హిందుస్తాన్ యూనిలీవర్ సంస్థలు నిలిచాయి.

# బ్యాంకుల్లో 265 లక్షల కోట్ల డిపాజిట్లు




**ముంబయి, జులై 12:** దేశంలోని వాణిజ్య బ్యాంకుల్లో ఉన్న మొత్తం డిపాజిట్లు రూ.265.4 లక్షల కోట్లకు పెరిగాయి. టైమ్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లు రెండింటిలోనూ పెరుగుదల నమోదు చేసింది. గత రెండు వారాల వ్యవధిలోనే వ్యవస్థలో సుమారు రూ. 7 లక్షల కోట్లు మేర పెరుగుదల నమోదైంది. ఈ తాజా పెరుగుదలతో 2026-27 ఆర్థిక సంవత్సరంలో మొదటి త్రైమాసికానికి డిపాజిట్ల వృద్ధి రేటు 13.3 కి పెరిగింది. 29 ఏళ్లలో ఇది మూడో అత్యధిక వృద్ధి. ఇది ఏడాది క్రితం 10.1 శాతంగా ఉంది. రెండు వారాల వ్యవధిలో ఈ పెరుగుదల ఉన్నప్పటికీ డిపాజిట్ల వృద్ధి రేటు రుణాల వృద్ధి రేటు కంటే తక్కువగా ఉంది. గతనెలాఖరునాటికి బ్యాంక్ రుణాలు రూ. 219.3 లక్షల కోట్లుగా ఉన్నాయి.

ఈ రెండు వారాల కాలంలో రుణాలు రూ. 3.8 లక్షల కోట్లకు పెరిగాయి. వార్షికంగా రుణాల వృద్ధి రేటు 18.6 శాతంగా నమోదు అయింది. మొదటి మూడు నెలల్లో నమోదైన వృద్ధి ఆ రెండు వారాల వృద్ధి కంటే తక్కువగా ఉంది. విదేశీ నిధుల రాబట్టడానికి, రూపాయి విలువను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీంతో భారత్ కు 7 బిలియన్ డాలర్ల విదేశీ సంస్థాగత పెట్టుబడులు వచ్చాయిని ఎస్బీఐ చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ తెలిపారు. ఆ సంఖ్య 15 బిలియన్ డాలర్లుగా ఉండవచ్చని తెలుస్తోంది. డిపాజిట్ల వృద్ధి కంటే రుణాల వృద్ధి ఎక్కువగా కొనసాగుతుండటంతో ప్రధానంగా ప్రభుత్వ సెక్యూరిటీలలో ఉండే తమ పెట్టుబడుల విషయంలో బ్యాంకులు నెమ్మదిగా వ్యవహరిస్తున్నాయి. మొదటి త్రైమాసికం ముగిసే సమయానికి బ్యాంకుల పెట్టుబడులు రూ. 70.9 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ఇక డెట్ ఎఫ్ఏఆర్ నిధుల విలువలు 2.7 బిలియన్ డాలర్లకు పెరిగింది. గత ఏడాది రూ.2.4 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంక్ క్రెడిట్ ఈ ఏడాది 5.6 లక్షల కోట్లకు పెరిగింది. ఈ భారీ డిపాజిట్ల వల్ల బ్యాంకుల్లో లిక్విడిటీ మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. బ్యాంకులు ఎక్కువగా హోం లోన్, బంగారంపై లోన్లు ఇస్తున్నాయి. దేశంలో బంగారంపై రుణాలు క్రమంగా పెరుగుతున్నాయి. బంగారం ధర పెరుగడం కూడా ఇందుకు కారణంగా చెబుతున్నారు. 2026 ఆర్థిక సంవత్సరంలో బంగారం రుణాలు దాదాపు 84 శాతం పెరిగాయి. బంగారం ధర పెరగడం వల్ల రుణం కూడా ఎక్కువ వస్తున్న తరుణంలో చాలా మంది బంగారం తాకట్టు పెట్టి లోన్లు తీసుకుంటున్నారు.

## ఐదేళ్లకే పెన్నీస్టాక్ క్యూపిడ్ షేర్ అనూహ్య రాబడి

**ముంబయి, జులై 12:** ఐదేళ్ల క్రితం కేవలం ఒక సాధారణ పెన్నీ స్టాక్స్‌గా ఉన్న హెల్త్ కేర్ ప్రొడక్ట్స్ కంపెనీ క్యూపిడ్ షేర్లు ఇపుడు దూసుకెళుతున్నాయి. మార్కెట్లో ఒడుదొడుకులు ఉన్నా ఈ స్మాల్ క్యాప్ స్టాక్ తన ఇన్వెస్టర్లకు లాభాలు కురిపించింది. లక్ష రూపాయల పెట్టుబడి ఐదేళ్లలోనే రూ. 87 లక్షలు చేసింది. ఐదేళ్లక్రితం ఎన్ఎస్ఈలో ఈ స్టాక్ కేవలం రూ.2.45స్థాయిలో ట్రేడయింది. ప్రస్తుతం క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర రూ.213 స్థాయికి చేరుకుంది. గత 5 సంవత్సరాల కాలంలో ఈ స్టాక్ ఏకంగా 8600 శాతం పైగా అద్భుతమైన వృద్ధిని నమోదు చేసింది. ఎవరైనా ఒక ఇన్వెస్టర్ ఐదేళ్ల క్రితం ఈ షేరుపై రూ.1 లక్ష ఇన్వెస్ట్ చేసి అలాగే ఉంచుకుని ఉంటే నేడు దాని విలువ ఏకగా రూ. 87 లక్షలకు చేరి ఉంటుంది. కేవలం ఏడాది క్రితం పెట్టిన రూ.1 లక్ష విలువ కూడా ఇప్పుడు రూ. 8.40 లక్షలుగా మారడం గమనార్హం. కంపెనీ త్వరలోనే ప్రకటించబోయే తొలిత్రైమాసిక ఆదాయం రికార్డ్ స్థాయిలో రూ.150 కోట్లు దాటుతుందని అంచనా. పూర్తి ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ గైడెన్స్ 10 శాతం నుంచి రూ. 660 కోట్లుగా కంపెనీ మేనేజ్మెంట్ సవరించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వ టెండర్లు, హెల్త్ కేర్ ప్రొక్యూర్మెంట్ సంస్థలతో కుదుర్చుకున్న వ్యూహాత్మక ఒప్పందాలు కంపెనీ ఆర్డర్ బుక్ ను బలోపేతం చేశాయి. క్యూపిడ్ లిమిటెడ్ షేరు ధర చివరి ట్రేడింగ్ సెషన్లో 1.41 శాతం లాభంతో ముగిసిం



# వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిసిన సూచీలు

**ముంబై, జులై 12:** భారతీయ స్టాక్ మార్కెట్ వరుసగా నాలుగు వారాల లాభాల పరంపరకు ముగింపు పలికిన నేపథ్యంలో, వచ్చే వారం మార్కెట్ దిశను నిర్ణయించే కీలక అంశాలపై పెట్టుబడిదారులు దృష్టి సారించారు. తొలి త్రైమాసికం కంపెనీల ఆర్థిక ఫలితాలు, అంతర్జాతీయ ముడి చమురుధరల కదలికలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధులరాక, పశ్చిమాసియా పరిణామాలు మార్కెట్‌ను ప్రభావితం చేసే ప్రధాన అంశాలుగా నిలవనున్నాయి. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తపరిస్థితులు నెలకొనడం, ముడి చమురు ధరలు పెరగడం వల్ల పెట్టుబడిదారుల సెంటిమెంట్ దెబ్బతినడంతో బెంచ్‌మార్క్ సూచీలు వారాంతంలో స్వల్ప నష్టాలతో ముగిశాయి. వారంలోని చివరి రెండు ట్రేడింగ్ సెషన్లలో ప్రపంచ మార్కెట్ల ఆందోళనలు కొంత తగ్గడం, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు మించిన ఆర్థిక ఫలితాలు ప్రకటించడం వల్ల మార్కెట్ బలంగా కోలుకుని నష్టాలను గణనీయంగా తగ్గించుకుంది. వారాంతానికి బీఎస్ఈ సెన్సెక్స్ 0.25 శాతం క్షీణించి 77,569.39 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 0.26 శాతం తగ్గి 24,206.90 వద్ద స్థిరపడింది. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు ఒక్కోటి ఒక శాతానికి పైగా లాభపడడం గమనార్హం. జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ టీసీఎస్ మెరుగైన ఫలితాలతో సానుకూలంగా ప్రారంభమైన నేపథ్యంలో, వచ్చే రోజుల్లో ప్రధాన కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలపై ట్రేడర్ల దృష్టి కేంద్రీకృతం కానుంది. ఈ ఫలితాలే ఈవారంలో మార్కెట్ దిశను నిర్దేశిస్తాయని నిపుణుల అంచనా. అమెరికా తాజాగా ఇరాన్‌పై జరిపినదాడులతోప్రాంతీయ స్థిరత్వంపై, ప్రపంచ ఇంధనసరఫరాలపై ఆందోళనలు మళ్లీపెరిగాయి. ఉద్రిక్తతలు మరింత పెరిగినా, తగ్గినా ప్రపంచ మార్కెట్లలో పెట్టుబడిదారుల రిస్క్ తీసుకునే ధోరణిపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు అంతర్జాతీయ ముడి చమురు ధరల కదలికలు కూడా అత్యంత కీలకంగా మారనున్నాయి. భారత్ ముడి చమురును అధికంగా దిగుమతి చేసుకునే దేశం కావడంతో లాభదాయకతపై కూడా ప్రతికూల ప్రభావం పడనుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.